ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 02.07.2026 | సంపుటి :12 సంచిక : 343 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# వారెవ్వా.. ఉస్మానియా

**దేశంలోనే తొలిసారి చరిత్ర సృష్టించిన ఆస్పత్రి వైద్యులు**



## రోగికి ఒకేసారి ఐదు అవయవాల మార్పిడి..

### అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స 36 గంటలపాటు..



ఒకేసారి ఐదు అవయవాల మార్పిడి జరిగిన పెషెంట్‌తో ఉస్మానియా జనరల్ ఆస్పత్రి వైద్య బృందం

- భారత వైద్య రంగంలో ఇదో సరికొత్త చరిత్ర
- సర్వత్రా ప్రశంసల వెల్లువ..
- వైద్య బృందాన్ని అభినందించిన సీఎం రేవంత్, ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ ,ఎన్‌ఓటీటీఓ

**దేశ వైద్య చరిత్రలో ఉస్మానియా హాస్పిటల్ మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. దేశంలోనే తొలిసారిగా ఒకే రోగికి ఐదు అవయవాల (మల్టీ-విసెరల్) మార్పిడి శస్త్రచికిత్సను ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈ చారిత్రాత్మక విజయంతో తెలంగాణ ప్రభుత్వ వైద్యరంగం మరోసారి దేశవ్యాప్తంగా తన సత్తా చాటుకుంది. ఒకే అవయవ మార్పిడి చేయడమే ఎంతో సవాలుతో కూడుకున్న పని. అలాంటిది ఒకే సర్జరీలో ఐదు అవయవాలను విజయవంతంగా మార్పిడి చేయడం దేశ వైద్య చరిత్రలోనే ఇది మొదటిసారి. కార్పొరేట్ ఆసుపత్రులకు ఏమాత్రం తీసిపోని విధంగా, ప్రభుత్వ రంగంలో ఈ స్థాయి విజయం సాధించడం విశేషం.**

హైదరాబాద్, జూలై 01 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర వైద్య రంగం అనేక సంచలనాలను నమోదు చేస్తున్నది. ఇటీవల 2వేల కిడ్నీ మార్పిడి ఆపరేషన్లతో నిమ్స్ దక్షిణ భారతదేశంలో ఈ ఘనత సాధించిన తొలి ప్రభుత్వ ఆస్పత్రిగా సరికొత్త రికార్డును సృష్టించగా తాజాగా ఉస్మానియా హాస్పిటల్ వైద్యులు ఒకేసారి రోగికి 5 అవయవాలను విజయవంతంగా మార్పిడి చేసి రికార్డు సృష్టించారు. దేశంలోనే తొలిసారి ఒకేసారి, ఒకే రోగికి ఐదు అవయవాలను విజయవంతంగా ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. సిరిసిల్ల జిల్లాకు చెందిన 30 ఏళ్ల యువ ఇంజినీర్ ఫ్యామిలియల్

మిగతా 2లో..

**వైద్యుల దినోత్సవాన ఉస్మానియా వైద్యులు**

### ఆదర్శంగా నిలిచారు

**ఒకేసారి 5 శస్త్రచికిత్సలు చేసిన ఉస్మానియా వైద్యులకు అభినందనలు.. వైద్యుల దినోత్సవాన ప్రతిష్టాత్మక ఆస్పత్రి వైద్యులు అత్యంత కిష్టమైన శస్త్ర చికిత్స చేసి దేశానికే ఆదర్శంగా ఆదర్శంగా నిలిచారు.ప్రజల మన్ననలను, నమ్మకాన్ని చురగొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగాన్ని మరింత బలోపేతం చేస్తూ అత్యున్నత వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తోంది. - సీఎం రేవంత్ రెడ్డి**

# ఆదాయ సమీకరణపై అలసత్వం వద్దు

**బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఈ అంశంపై సీరియస్‌గా దృష్టి సారించాలి : సీఎం రేవంత్ రెడ్డి**



- ప్రాజెక్టుల భూసేకరణకు తొలి ప్రాధాన్యత నివ్వాలి
- ఆదాయం పెంపు, నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వీడనాడాలి
- హెచ్‌ఎండిఎ,టిజిఐఐసి, కమర్షియల్ ట్యాక్సెస్, ఎక్సైజ్‌తో పాటు వివిధ శాఖలకు సంబంధించి లీకేజీలు లేకుండా జాగ్రత వహించాలి
- శాఖల వారీగా సామర్థ్యాన్ని పెంచుకోవాలి
- ఆదాయ సమీకరణ కోసం చేజింగ్ సెల్‌ను ఏర్పాటు చేయాలి
- ఏఐతో లబ్ధిదారుల జాబితాను డీబీటీకి అనుసంధానం చేయాలి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ దిశానిర్దేశం

హైదరాబాద్(జనంసాక్షి): ఆదాయ సమీకరణపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయ సమీకరణపై సీరియస్‌గా దృష్టి సారించాలన్నారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వీడాలని అన్నారు. హెచ్‌ఎండిఎ,టిజిఐఐసి, కమర్షియల్ ట్యాక్సెస్, ఎక్సైజ్‌తో పాటు వివిధ శాఖలకు సంబంధించి లీకేజీలు లేకుండా జాగ్రత వహించాలని సూచించారు. బుధవారం ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్‌డీలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై సమీక్ష నిర్వహించిన సీఎం.. అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఆదాయ సమీకరణకు సంబంధించి ఛేజింగ్ సెల్ నేర్పాటు చేసుకుని నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. అనుకున్న స్థాయిలో

మిగతా 2లో..

## నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

2లో..

### అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యం

**ట్రాఫిక్ తదితర సమస్యలపై చెక్ పెట్టే సాంకేతికత**
**ముఖ్యమంత్రి రేవంత్‌తో భేటీ మేఘా కృష్ణారెడ్డి, అనలాగ్ సీఈవో అలెక్స్ కిప్‌మాన్ భేటీ**



**వీబీ జీరామ్‌జీ వేతనాల పెంపు..**

## నోటిఫై చేసిన కేంద్రం

న్యూఢిల్లీ(జనంసాక్షి):మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్ చట్టం నేటి నుంచి అమల్లోకి వచ్చింది. ఉపాధి హామీ పథకంలో 100 రోజులుగా ఉన్న పనిదినాలను 125 రోజులకు పెంచుతూ తీసుకొచ్చిన ఈ చట్టం కింద చెల్లించే వేతనాలను కేంద్రం తాజాగా నోటిఫై చేసింది. రోజువారీ వేతనాన్ని కనిష్ఠంగా రూ.300 నుంచి గరిష్ఠంగా రూ.409 చెల్లించేలా నిర్ణయించింది. సిక్కింలోని కొన్ని పంచాయతీల్లో

మిగతా 2లో..

**బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ**

## వాయిదా

ఫిర్యాదుదారుకు హైకోర్టు నోటీసులు

2లో..

**రాముడిని నిలువునా**

# దోచేశారు

**కుంభమేళా సమయంలోనే విరాళాల చోరీచేశారు**

- చోరీ చేసిన సొమ్మును వాష్‌రూమ్‌లో దాచి తరువాత తరలించారు
- కేసులో దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి..



లక్నో(జనంసాక్షి):అయోధ్య విరాళాల చోరీ కేసులో పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు. గతేడాది ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించిన కుంభమేళా సమయంలోనే రామ మందిరంలో అధిక మొత్తంలో చోరీ జరిగినట్లు తెలిపారు. కుంభమేళాకు వచ్చిన కోట్లాది మంది భక్తులు అయోధ్య రామ మందిరాన్ని కూడా సందర్శించారని, ఆ సమయంలో ఆలయానికి భారీ మొత్తంలో కానుకలు, విరాళాలు వచ్చాయని పేర్కొన్నారు. ఇదే అదునుగా భావించిన నిందితులు కానుకల నుంచి కోట్ల రూపాయలు మాయం చేశారన్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు మొత్తం 8 మందిని అరెస్ట్ చేశామని పోలీసులు పేర్కొన్నారు. వారిలో లవ్‌కుష్ మిశ్రా, అనుకల్ప్ మిశ్రా అనే బావమరుదులు అత్యధిక మొత్తంలో నగదు దొంగిలించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. నిందితుల ఆర్థిక లావాదేవీలు, ఆస్తులు పరిశీలించడానికి ఆదాయపు పన్ను శాఖ, ఈడీ సహకారం తీసుకుంటున్నట్లు

మిగతా 2లో..

**దొంగలకు శిక్ష పడాలంటే**

### ప్రభుత్వం మారాలి

అయోధ్య విరాళాల చోరీపై కేజ్రీవాల్ ఫైర్

2లో..



**మహారాష్ట్రలో బాబ్లీ గేట్లు**

## ఎత్తివేత

నిజామాబాద్(జనంసాక్షి): మహారాష్ట్రలోని ఎగువ గోదావరి నదిపై నిర్మించిన బాబ్లీ గేట్లను సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి), మహారాష్ట్ర, తెలంగాణ ఇరిగేషన్ అధికారుల సమక్షంలో 14 గేట్లను ఎత్తివేశారు. బాబ్లీ ప్రాజెక్టులో నీటి నిల్వ స్వల్పంగా ఉండడంతో తెలంగాణ ప్రాంతానికి కేవలం 0.20 టిఎంసిల వరద మాత్రమే వచ్చింది. ఈ దశాబ్ద కాలంలో ఎగువ గోదావరి

మిగతా 9లో..

### వాణిజ్య సిలిండర్ ధర తగ్గింపు..

**19 కేజీల వాణిజ్య సిలిండర్‌పై రూ.183 తగ్గిస్తూ చమురు సంస్థల ప్రకటన**

వార్త 2 లో

# మీ వైఫల్యాలపై చర్చకు సిద్ధం



- తేది, సమయం ఫిక్స్ చేయండి
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్

- సీఎం, కుటుంబ సభ్యుల దోపిడీతో రాష్ట్రం ఆస్తులు కోల్పోతోంది
- వైఫల్యాలు ఎండగట్టకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటా..
- తెలంగాణను పదేపదే కించపరుస్తున్న ముఖ్యమంత్రి
- కాళేశ్వరంపై ప్రపంచమంతా అభినందిస్తే...విమర్శలా?
- కోటి ఎకరాల మాగాణంగా కేసీఆర్ తీర్చిదిద్దారు
- మీడియా సమావేశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ విమర్శలు

హైదరాబాద్(జనంసాక్షి): కాంగ్రెస్‌కు ఇచ్చిన అవకాశంలో 50 శాతం పూర్తయిందని.. ఇప్పటివరకు ఏం చేశారో ఆ పార్టీ చెప్పు కోలేకపోతోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కేసీఆర్ అధికారం నుంచి దిగిపోయేనాటికి రూ.3.50లక్షల కోట్ల అప్పు మాత్రమే ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అప్పుల కారణంగా దిల్లీకి వెళితే ఇజ్జత్ పోతోందంటున్న సీఎం.. 72 సార్లు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రైతుభరోసా నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం రేవంత్ చేసిన విమర్శలపై ఆయన స్పందించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా?

మిగతా 9లో..

**వైఫల్యాలపై దృష్టి మరల్చేందుకు**

## ఎత్తులు

- రైతుల పేరుతో కొత్త డ్రామాలకు తెరతీసారు
- అన్నదాతల అసలు సమస్యలపై పట్టింపేది?
- ముఖ్యమంత్రి రేవంత్‌కు హరీశ్ సవాల్

2లో..





# బతుకులు బుగ్గి

## రెండు వేర్వేరు ప్రమాదాలలో 12 మంది సజీవదహనం

- రాజస్థాన్‌లోని దౌసా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- ట్రక్కును వెనుక నుంచి స్లీపర్ బస్సు
- మంటలు చెలరేగి 8 మంది దుర్మరణం మరో 29 మందికి తీవ్ర గాయాలు
- పల్నాడు జిల్లాలో ఆగివున్న లారీని ఢీకొన్న మరో లారీ..
- ఘటనలో నలుగురు సజీవ దహనం

జైపూర్,అమరావతి(జనంసాక్షి): రాజస్థాన్‌లోని దౌసా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దిల్లీ - ముంబయి ఎక్స్‌ప్రెస్‌వేపై ధనవాడ సమీపంలో బుధవారం ఉదయం ఇండోర్‌కు చెందిన స్లీపర్ బస్సు.. ట్రక్కును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సులో భారీగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 8 మంది మృతి చెందారు. మరో 29 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు .తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో

మిగతా 2లో..

**భారత్ విశ్వసనీయ**

# మిత్ర దేశం

**ఇరుదేశాల సంబంధాలు ప్రపంచదేశాలకూ ఉపయోగకరం: అమెరికా సెనెటర్ స్టీవ్ డైన్స్**



వాషింగ్టన్(జనంసాక్షి): అమెరికాకు భారత్ విశ్వసనీయ మిత్రదేశమని అమెరికా సెనెటర్ స్టీవ్ డైన్స్‌ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య ఉన్న మధ్య సంబంధాలు రెండు దేశాలకే కాకుండా ప్రపంచదేశాలకు కూడా ఉపయోగకరమని అన్నారు. భారత్-చైనాల విషయంలో భద్రతా వ్యత్యాసాన్ని వివరిస్తూ.. తాను చైనాకు వెళ్లినప్పుడు ఫోన్‌ను తీసుకువెళ్లనని.. ఇంట్లోనే పెట్టి వెళ్తానని అన్నారు. కానీ భారత పర్యటనకు వెళ్తే మాత్రం ఫోన్ తీసుకువెళ్తానని వెల్లడించారు. దిల్లీ విషయంలో ఉన్న నమ్మకం బీజింగ్ విషయంలో ఉండదన్నారు. అయితే బీజింగ్‌తో వాషింగ్టన్ పూర్తిగా సంబంధాలు తెంచుకోబోదని ఆయన పేర్కొన్నారు. నష్ట భయాలను తగ్గించుకుంటూ ఆ దేశంతో సంబంధాలు కొనసాగిస్తామన్నారు. అమెరికా, భారత్ ద్వైపాక్షిక

మిగతా 2లో..



# అవసరమైతే ఇరాన్‌పై మళ్లీ దాడులు

**మూడోసారి కూడా దాడులు చేయడానికి కావాల్సిన సామర్థ్యం మాకుంది**

**టెహ్రాన్ అణు కార్యక్రమంపై కఠిన వైఖరి అనుసరిస్తాం.. నెతన్యాహు హెచ్చరిక**

టెల్అవీవ్(జనంసాక్షి):పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణ కోసం ఇరాన్‌తో అమెరికా చర్చలు జరిపేందుకు సిద్ధమవుతోన్న వేళ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. టెహ్రాన్ అణు కార్యక్రమంపై కఠిన వైఖరి అనుసరిస్తామని.. అవసరమైతే ఇరాన్‌పై మళ్లీ దాడి చేస్తామని హెచ్చరించారు. మూడోసారి కూడా దాడులు చేయడానికి కావాల్సిన సామర్థ్యం తమ సైనిక దళాలకు ఉందని పేర్కొన్నారు. గతంలో ఆ దేశంపై చేపట్టిన సైనిక చర్యలను నెతన్యాహు సమర్థించుకున్నారు. ఇరాన్ అణ్వాయుధాలను సంపాదించకుండా నిరోధించే విషయంలో తాము స్వతంత్రంగా వ్యవహరిస్తామని ఇజ్రాయెల్ ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇందుకోసం ఇతర దేశాలపై ఆధారపడబోమంటూ పరోక్షంగా అమెరికాను ఉద్దేశిస్తూ వ్యాఖ్యలు చేశారు. అణు కార్యక్రమాలను నిలిపివేయడంపై దౌత్య ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ.. అందుకు ఇరాన్ అంగీకరించకపోతే మళ్లీ సైనిక చర్య తప్పదని హెచ్చరించారు. తమ దేశానికి భద్రతాపరమైన

మిగతా 2లో..

### ఆగస్టు 30న నీట్ పీజీ పరీక్ష

రిజిస్ట్రేషన్ ప్రక్రియ షురూ

2లో..

### ఔటర్ రింగ్ రోడ్డుపై కాల్పుల కలకలం

పోలీసులపై మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ భూష్మి శ్రీకాంత్ దాడి
ఆత్మరక్షణ కోసం పోలీసుల కాల్పులు

2లో..

### ఎంపీ మహువా మొయిత్రాపై కోడిగుడ్లతో దాడి

పార్టీ కార్యకర్తలతో సమావేశంలో ఉండగా ఘటన

## అవసరమైతే ఇరాన్‌పై మళ్లీ దాడులు

ముప్పు తెచ్చే ఎటువంటి చర్యలనైనా అడ్డుకొని తీరుతామని పునరుద్ఘాటించారు. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమాన్ని కొనసాగించేలా ఉండే ఒప్పందాలను ఇజ్రాయెల్ ఎప్పటికీ స్వాగతించబోదన్నారు.లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని.. లేదంటే ఒప్పందం కుదుర్చుకోబోమని ఇరాన్ చెబుతోంది. కానీ, నెతన్యాహు మాత్రం తుది ఒప్పందం కుదిరేదాక ఇజ్రాయెల్ బలగాలు బీరుట్‌లోనే ఉంటాయని ఇప్పటికే వెల్లడించారు. ఈ క్రమంలోనే మంగళవారం దక్షిణ లెబనాన్‌లోని ఇజ్రాయెల్ ఆధీనంలో ఉన్న ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఇరాన్ నుంచి అణు ముప్పు తొలగిపోయే వరకు దక్షిణ లెబనాన్‌ను వదిలి రావద్దని తమ దళాలను ఆదేశించారు.

**WANAPARTHY DISTRICT GAZETTE EXTRAORDINARY PUBLISHED BY AUTHORITY**

Gazette No. 22/2026 Wanaparthy DATE: 23.06.2026.

File No: G/348/2026

The Right to Fair Compensation and in Transparency in Land Acquisition, Rehabilitation and Resettlement Act, 2013

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనాలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టము 2013 (కేంద్ర చటం 30/2013) యొక్క సేక్షన్ 11) 1( మరియు రాష్ట్ర రూల్ 25(1) ననరించి

**ఫారం - VI**

**ప్రాథమిక ప్రకటన**

తెలంగాణ ప్రభుత్వానికి **మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం** /క్రింద land acquired for KTLIS - on Sub Minor - 2R of Minor - 1L of Lattuapally canal వరకు భూమి ఎకరములు 04-14 గుంటలు వనపర్తి జిల్లాలో ఘనపూర్ మండలంలో గల **మామిడిమాడ గ్రామం** పరిమితిలో అవసర నిమిత్తం సేకరించనైనదిభూసేకరణ పునరుపాది పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీ చేయనైనది.

పైన పేర్కొన్న ప్రాజెక్టు కోసం వనపర్తి జిల్లా ఘనపూర్ మండలంలో గల **మామిడిమాడ గ్రామములో** నిర్దేశించిన కొలతల ప్రకారం వచ్చిన విస్తీర్ణం **ఎకరములు 04 -14 గుంటల** భూమి భూసేకరణ నిమిత్తం ఈ క్రింది చూపిన విధముగా కలదు.

**షెడ్యూల్**

గ్రామం : మామిడిమాడ మండలం : ఘనపూర్ జిల్లా : వనపర్తి

| క్ర. సం | సర్వే నం. | భూమి రకం తరి / మెట్ట | భూమి వర్గీకరణ | పట్టాదారు/అనుభవదారు పేరు మరియు తండ్రి / భర్త పేరు | భూసేకరణ కొరకు పరతిపాదిత భూ విస్తీర్ణం ఎ-గు | సరిహద్దులు ఉ | ద | తూ | ప |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 371 | మెట్ట | పట్టా | రాజా శంకర బహద్దూర్ తండ్రి రాజా శ్యాం కరణ్ (పట్టాదారు) కేతావత్ పీరు తండ్రి మంగ్య (అనుభవదారు) | 0.05 ½ | 370 | 387, 388 | 369 | 411 |
| 2 | 371 | మెట్ట | పట్టా | రాజా శంకర బహద్దూర్ తండ్రి రాజా శ్యాం కరణ్ (పట్టాదారు) కేతావత్ గోపాల్ తండ్రి మంగ్య (అనుభవదారు) | 00.05 ½ | | | | |
| 3 | 370 | మెట్ట | పట్టా | రాజా శంకర బహద్దూర్ తండ్రి రాజా శ్యాం కరణ్ (పట్టాదారు) కేతావత్ పీరు తండ్రి మంగ్య (అనుభవదారు) | 00.13 ½ | 365 | 371 | 369 | 356 |
| 4 | 370 | మెట్ట | పట్టా | రాజా శంకర బహద్దూర్ తండ్రి రాజా శ్యాం కరణ్ (పట్టాదారు) కేతావత్ గోపాల్ తండ్రి మంగ్య (అనుభవదారు) | 00.13 ½ | | | | |
| 5 | 365 | మెట్ట | పట్టా | కేతావత్ ఛాత్రు తండ్రి కేతావత్ రూప్ సింగ్ (అనుభవదారు) | 00.11 | 366 | 370 | 369 | 364 |
| 6 | 365 | మెట్ట | పట్టా | కేతావత్ యాదయ్య తండ్రి కేతావత్ మన్య | 00.08 | | | | |
| 7 | 366 | మెట్ట | పట్టా | రాజా శంకర బహద్దూర్ తండ్రి రాజా శ్యాం కరణ్ (పట్టాదారు) కేతావత్ పాండు తండ్రి వాలియ (అనుభవదారు) | 00.14 ½ | 369 | 369 | 369 | 356, 365 |
| 8 | 366 | మెట్ట | పట్టా | రాజా శంకర బహద్దూర్ తండ్రి రాజా శ్యాం కరణ్ (పట్టాదారు) కేతావత్ శంకర్ తండ్రి వాలియ (అనుభవదారు) | 00.14 ½ | 369 | 369 | 369 | 356, 365 |
| 9 | 366 | మెట్ట | పట్టా | రాజా శంకర బహద్దూర్ తండ్రి రాజా శ్యాం కరణ్ (పట్టాదారు) లంబాడి కేతావత్ ఛాత్రు తండ్రి జుంప్ల (అనుభవదారు) | 00.05 | 368 | 366 | 369 | 356 |
| 10 | 367 | మెట్ట | పట్టా | కేతావత్ బాలు నాయక్ తండ్రి జాత్రు | 00.09 | 368 | 369 | 369 | 356 |
| 11 | 368 | మెట్ట | పట్టా | కేతావత్ మోత్య తండ్రి జాత్రు (అనుభవదారు) | 00.09 | | | | |
| 12 | 368 | మెట్ట | పట్టా | లంబాడి కేతావత్ ఛత్రు తండ్రి జూంపాల్య | 00.17 | 356 | 367 | 356 | 356 |
| 13 | 356 | మెట్ట | పట్టా | ప్రభుత్వ భూమి | 00.18 | 355, 354 | 369 | 360, 361 | 368, 355 |
| 14 | 355 | మెట్ట | పట్టా | నేరళ్ల లక్ష్మి మనోహర్ తండ్రి అర్వేటి వెంకట సుబ్బా రావు | 00.30 | 356 | 356 | 369 | 356 |
| | | | | మొత్తం విస్తీర్ణం (ఎ - గు) | 04.14 | | | | |

ఈ నోటిఫికేషన్ భూసేకరణ, పునరావాసం మరియు పునరావాసం చట్టం 2013 (నెం. 30/2013) లోని నిబంధన 11(1) ప్రకారం సరసమైన పరిహారం మరియు పారదర్శకత వివరముల కొరకు కార్యాలయం పని సమయములో ఏదైనా పని రోజున జిల్లా కలెక్టర్, వనపర్తి, భూ సేకరణ అధికారి & స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, యల్.ఎ. ఆర్.యల్.ఐ.పి.II పెబ్బేర్ కార్యాలయంలో భూమి యొక్క ప్రణాళికను పరిశీలించవచ్చు.

తెలంగాణ ప్రభుత్వం తగిన ప్రభుత్వం ఆఫీసర్ - కమ్ - కలెక్టర్ / భూ సేకరణ అధికారి & స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, యల్.ఎ. ఆర్.యల్.ఐ.పి. II పెబ్బేర్ వద్ద మరియు అతని సిబ్బందికి భూమిపైకి ప్రవేశించడానికి మరియు భూమిని ప్రవేశపెట్టడానికి, ఏదైనా భూమిని తీసుకోవటానికి, త్రవ్వటానికి అధికారం ఇవ్వడానికి సంతోషిస్తున్నాము మరియు చెప్పిన చట్టంలోని సెక్షన్ 12 అమలు చెయ్యడానికి పేర్కొన్న విధంగా వారి పనిని సరిగ్గా అవసరమైన అన్ని చర్యలను చెయ్యండి.

చట్టం యొక్క సెక్షన్ 11(4) ప్రకారం, ఏ వ్యక్తి ఎటువంటి లావాదేవీలు చేయకూడదు లేదా భూమి యొక్క ఏదైనా లావాదేవీకి కారణం కాదు, అమ్మకం కొనుగోలు మొదలైనవి చేయకూడదు లేదా ముందస్తు అనుమతి / లేకుండా అటువంటి నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుండి అటువంటి భూమిపై ఏదైనా ఆక్రమణలను సృష్టించకూడదు

అధీకృత అధికారి చట్టం యొక్క ఏదైనా ఉంటే సముపార్జనకు అభ్యంతరాలు, మరియు వారి భూముల పరిష్కారం కోసం ఆసక్తి ఉన్న ప్రభావితమైన వ్యక్తుల నుండి వచ్చిన వాదనలు /, ఈ నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుండి 60(అరవై రోజులుకింద భూసేకరణ 15లోపు భూమిపై ఆసక్తి ఉన్న వ్యక్తి భూసేకరణ చట్టం లోని సెక్షన్ (అధికారికి తెలియజేయగలరు .

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ భూసేకరణ ఆర్.ఎల్.ఐ. ఎస్.పి., యూనిట్ - 2 పెబ్బేర్

సం/- అదనపు కలెక్టర్, వనపర్తి

సం/- జిల్లా కలెక్టర్, వనపర్తి

DIPR RO.NO: 387/LA/PP/Advt/Pub/2026-27

# వారెవ్వా ఉస్మానియా

అడెనోమాటస్ పాలిపోసిస్ అనే అరుదైన జన్యుపరమైన వ్యాధితో పాటు పెద్దపేగు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. గతంలో ఒక కార్పొరేట్ హాస్పిటల్‌లో అతనికి పెద్దపేగును పూర్తిగా తొలగించడంతో పాటు చిన్నపేగులో సుమారు 60 శాతం భాగాన్ని తొలగించారు. అనంతరం అతను తీవ్ర పోషకాహార లోపం, బరువు తగ్గడం, తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ ఆరు నెలల క్రితం ఉస్మానియా హాస్పిటల్‌ను ఆశ్రయించాడు. ఉస్మానియా వైద్యులు నిర్వహించిన సమగ్ర పరీక్షల్లో చిన్నపేగు, డ్యూడినమ్ తదితర జీర్ణాశయ అవయవాల్లో మరిన్ని పాలిప్స్, ట్యూమర్లు ఉన్నట్లు గుర్తించారు. రోగి పరిస్థితిని సమగ్రంగా పరిశీలించిన అనంతరం అతడిని జీవన్‌దాన్ కార్యక్రమంలో మల్టీ-విసెరల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం నమోదు చేశారు.

**సుమారు 36 గంటల పాటు శస్త్రచికిత్స**

ఇటీవల 35 ఏళ్ల మహిళ గర్భధారణ సమయంలో అధిక రక్తపోటు (ప్రీ-ఎక్లాంప్సియా) కారణంగా తీవ్ర మెదడు రక్తస్రావానికి గురై ఉస్మానియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించబడింది. వైద్యులు అవయవదానంపై ఆమె కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించగా, వారు ఎంతో ఉదారంగా అవయవదానానికి అంగీకరించారు. అవయవదాత నుంచి సేకరించిన జీర్ణాశయం, డ్యూడినమ్, ప్యాంక్రియాస్, చిన్నపేగు, కుడివైపు పెద్దపేగు అనే ఐదు అవయవాలను సుమారు 36 గంటల పాటు నిరంతరాయంగా సాగిన అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స ద్వారా వైద్యులు విజయవంతంగా మార్పిడి చేశారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండగా, వెంటిలేటర్‌ను కూడా తొలగించినట్లు వైద్యులు తెలిపారు. ఈ తరహా ఒకే రోగికి ఐదు అవయవాల మల్టీ-విసెరల్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను భారతదేశంలో తొలిసారిగా విజయవంతంగా నిర్వహించిన ఘనత ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌కు దక్కింది. ఇలాంటి శస్త్రచికిత్సలు ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటివరకు అమెరికా, బ్రెజిల్ వంటి కొద్ది దేశాల్లో మాత్రమే నమోదయ్యాయి.

**ప్రభుత్వ వైద్యరంగ ప్రతిష్ఠను మరింత పెంచింది : మంత్రి దామోదర రాజనర్సింహా**

ఉస్మానియా వైద్య బృందాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు. దేశంలోనే తొలిసారిగా ఇంత క్లిష్టమైన మల్టీ-విసెరల్ ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతంగా నిర్వహించడం తెలంగాణ వైద్యరంగానికి గర్వకారణమని మంత్రి అభినందించారు. ఈ తరహా శస్త్రచికిత్సతో ప్రభుత్వ వైద్యరంగ ప్రతిష్ఠను మరింత పెంచిందని తెలిపారు. ప్రాణాలను కాపాడేందుకు అంకితభావంతో పనిచేసిన వైద్యులు, అనస్థీషియా, నర్సింగ్, క్రిటికల్ కేర్, తదితర సిబ్బందిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక, ప్రపంచస్థాయి వైద్య సేవలందుతున్నాయనడానికి ఉస్మానియా వైద్యుల ఘనతే నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగాన్ని మరింత బలోపేతం చేస్తూ అత్యున్నత వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తోందని తెలిపారు.

**అభినందించిన ఎన్ఓటీటీఓ**

భారత వైద్య రంగంలో సంచలనం నమోదు చేసిన హైదరాబాద్ ఉస్మానియా డాక్టర్ల బృందాన్ని నేషనల్ ఆర్గాన్స్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆర్గనైజేషన్ (ఎన్ఓటీటీఓ) అభినందించింది. ఈ మేరకు ఉస్మానియా వైద్య బృందాన్ని అభినందిస్తూ ఎన్ఓటీటీఓ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో ట్వీట్ చేసింది. ఫ్యామిలియల్ అడెనోమాటస్ పాలిపోసిస్ (ఎఫ్ఏపీ) ఉన్న రోగికి దేశంలోనే తొలిసారిగా ఈ అరుదైన శస్త్రచికిత్స నిర్వహించినట్లు ఎన్ఓటీటీఓ తన ట్వీట్‌లో పేర్కొంది. 36 గంటల పాటు సాగిన ఈ అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన వైద్య బృందం నైపుణ్యం, అంకితభావాన్ని ఎన్ఓటీటీఓ ప్రశంసించింది. అవయవదాత, వారి కుటుంబ సభ్యుల సేవాభావాన్ని కూడా ఎన్ఓటీటీఓ ప్రత్యేకంగా కొనియాడింది.

## వైఫల్యాలపై దృష్టి మరల్చేందుకు ఎత్తులు

హైదరాబాద్(జనంసాక్షి):శిల్పకళావేదిక సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, ఆ వైఫల్యాల నుండి ప్రజల దృష్టి మరల్చేందుకే రేవంత్ రెడ్డి రైతుల పేరుతో కొత్త డ్రామాలకు తెరతీశారని మండిపడ్డారు. రైతు భరోసా పేరుతో కేవలం పబ్లిసిటీ స్టంట్లు చేస్తూ, అన్నదాతల అసలు సమస్యలను పక్కన పెట్టేసి గొప్పలు చెప్పుకోవడం తప్ప ఈ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి మాట్లాడేవన్నీ చేతగాని మాటలు, చెత్త వాగుడు తప్ప వాటి వల్ల రైతులకు కొత్తగా ఒరిగిందేమీ లేదన్నారు. ప్రభుత్వం చెబుతున్న లెక్కల్లోని డొల్లతనాన్ని హరీష్ రావు ఆధారాలతో సహా ఎండగట్టారు. ఒకే సభలో ఉంటూ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క రైతుల కోసం రూ.1.56 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెబితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం రూ.1.75 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారని, అసలు వీరిద్దరిలో ఎవరి లెక్కలు నిజమని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో చేసింది ఏమీ లేదు కాబట్టే ఇద్దరూ ఇష్టం వచ్చినట్లు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. 2027 మార్చి 31 వరకు వ్యవసాయ రంగానికి చేసిన మొత్తం బడ్జెట్ కేటాయింపులే సుమారు రూ.82 వేల కోట్లు అయితే, జూన్ 2026 నాటికే లక్షా 56 వేల కోట్లు, లక్షా 75 వేల కోట్లు ఎలా ఖర్చు చేశారో సమాధానం చెప్పాలని నిలదీశారు. బడ్జెట్‌లో లేని డబ్బును ఖర్చు చేశారా? లేక రైతులను మభ్యపెట్టడానికి కల్పిత లెక్కలు చెబుతున్నారా? అని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధాలను పదిసార్లు చెప్పినా అవి నిజాలు కావని, లేనివి ఉన్నట్లు చెప్తే రైతులు నమ్మరని హితవు పలికారు. ఎన్నికల సమయంలో ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఓట్లు అడిగారని, తీరా అధికారంలోకి వచ్చాక ఇప్పుడు కేవలం స్వల్పకాలిక రుణాలకే మాఫీ వర్తిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పడం రైతులను దారుణంగా మోసం చేయడం కాదా అని హరీష్ రావు ప్రశ్నించారు. ఇదే ముందే చెప్పి ఉంటే రైతులు కాంగ్రెస్‌ను నమ్మేవారా అని అడిగారు. మేనిఫెస్టోలో ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరో మాట చెప్పడం కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఫేక్ ప్రచారాలు చేసుకోవడం ఆపి, రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో రైతులే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను ఎలా గాలికి వదిలేశారో, అన్నదాతను ఎలా మోసం చేశారో నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు

## అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యం

హైదరాబాద్(జనంసాక్షి): ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో అనలాగ్ వ్యవస్థాపకుడు, సీఈఓ అలెక్స్ కిప్‌మాన్, మెగా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఎండీ పి. కృష్ణారెడ్డి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో సమావేశమయ్యారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ సీఈఓ, హైదరాబాద్ మెట్రోరైల్ అదనపు ఎండీ బి. అజిత్ రెడ్డి పాల్గొన్నారు.అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతిపై ఈ సందర్భంగా చర్చించారు. అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో భవిష్యత్తరాలకు అవసరమైన మేధోపరమైన మౌలిక సదుపాయాలు, ఫిజికల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిష్కారాలపై తమ ఆలోచనలను సమావేశంలో వివరించారు. హైదరాబాద్ ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్టు వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. నగరంలో ఎదురయ్యే సమస్యలకు సత్వర పరిష్కారానికి దోహదపడే సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై వారు సమావేశంలో వివరించారు. గరంలో అత్యాధునిక ఫిజికల్ ఇంటెలిజెన్స్ ప్లాట్ ఫామ్స్ వినియోగం వల్ల ప్రయోజనాలను తెలిపారు.సెన్సర్లు, రోబోటిక్స్ వంటి ఫిజికల్ ఇంటెలిజెన్స్ వినియోగం ద్వారా సురక్షితమైన, సమర్థవంతమైన, వేగంగా స్పందించే పట్టణ రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి ఎలా తోడ్పుతుందన్న అంశాలను వివరించారు. ట్రాఫిక్ రద్దీని గుర్తించి తదనుగుణంగా సిగ్నళ్ల వ్యవస్థ, నీటి లీకేజీలను ముందుగానే గుర్తించి మరమ్మతులు చేపట్టడం, అవసరానికి అనుగుణంగా విద్యుత్ వినియోగాన్ని నిర్వహించడం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలకు మార్గం సుగమం చేయడం వంటి కాగ్నిటివ్ సిటీస్ రూపకల్పనకు ఉన్న విస్తృత అవకాశాలను సమావేశంలో సమావేశంలో వివరించారు. వేగంగా పెరుగుతున్న పట్టణాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, ప్రభుత్వాల కార్యనిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడం, పౌరులకు అందించే సేవలను మరింత మెరుగుపరచడం, అలాగే డేటా ఆధారిత మౌలిక సదుపాయాల ప్రణాళికకు ఎలా దోహదపడతాయో ఇరు సంస్థలు వివరించాయి. సందర్భంగా ముఖ్యమంత్రి ఇటు సంస్థలకు పలు సూచనలు చేశారు.హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఇంటిగ్రేట్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా సిగ్నల్స్ పనిచేసే విధానాన్ని తీసుకురావాలన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించేలా ఎఐ కి అనుసంధానించాలని సీఎం సూచించారు. మావేశం అనంతరం ముఖ్యమంత్రి గారి సమక్షంలో అనలాగ్, ఎంఈఐఎల్ సంయుక్త భాగస్వామ్యంతో అవగాహన ఒప్పందం కుదిరింది.

## ఆదాయ సమీకరణపై అలసత్వం వద్దు

పనిచేయాలంటే శాఖలవారీగా డి పార్ట్‌మెంట్స్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరు చుకో వాలని సీఎం సూచించారు. ఎఐ టెక్నాలజీని ఉపయో గించుకుని లబ్ధిదారుల జాబితాను డీబీటీకి అనుసం ధానం చేసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ ప్రాజె క్టులను, ఇతర పనులను పూర్తి చేసేందుకు అనుగుణం గా బడ్జెట్‌ను తయారు చేసుకోవాలన్నారు. భూసేకర ణను మొదటి ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచనలు చేశారు. ఊహాజనిత బడ్జెట్ కాదని.. వాస్తవికత ఆధారంగానే బడ్జెట్‌ను రూపొందించుకోవాలని అధికారులకు తెలిపారు. వివిధ శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని,ఆదాయం పెంపు, నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వీడాల్సిందే అని మఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారులు రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జూలై 2వ తేదీన గురువారం మధ్యాహ్నం 3:00 గంటలకు జరగనుంది. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని 6వ అంతస్తులో ఉన్న కేబినెట్ సమావేశ మందిరంలో ఈ 34వ మంత్రిమండలి సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ కేబినెట్ సమావేశం జరిగే సమయంలో అధికారులందరూ తప్పనిసరిగా హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని సిఎస్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇకపోతే వివిధ అంశాలపై ఈ కేబినేట్‌లో చర్చించనున్నారు. ఇటీవలే కేంద్రం మూసీ ప్రక్షాళనకు ఆమోదం తెలిపింది. అలాగే మెట్రోకు కూడా పచ్చ జెండా ఊపింది.

## వీబీ జీరామ్‌జీ వేతనాల పెంపు.. నోటిపై చేసిన కేంద్రం

మాత్రం అత్యధికంగా రూ.450 వేతనం చెల్లించనున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది.అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, బిహార్, ఝార్ఖండ్, అస్సాం, త్రిపుర, సిక్కిం, పశ్చిమ బెంగాల్‌లో ఉపాధి హామీ పథకంతో పోలిస్తే ఇప్పుడు వేతనాలు 15 శాతానికి పైగా పెరిగాయి. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మాత్రం 3 శాతం కంటే తక్కువే పెంచడం గమనార్హం. వీబీ జీరామ్‌జీ పథకం కింద 21 రాష్ట్రాల్లో రోజువారీ వేతనం రూ.300గా నిర్ణయించారు. గుజరాత్, రాజస్థాన్, ఒడిశా, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్‌తో పాటు పలు ఈశాన్య రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయి.తెలంగాణలో రోజువారీ కూలి రూ.308, ఆంధ్రప్రదేశ్‌లో రూ.312, మహారాష్ట్రలో రూ.317, దాద్రానగర్ హవేలీ, దమన్ దీవ్‌లో రూ.340, తమిళనాడులో రూ.345, పుదుచ్చేరిలో రూ.347 చొప్పున చెల్లించేందుకు కేంద్రం నిర్ణయించింది. కర్ణాటకలో రూ.382, కేరళలో రూ.401, గోవాలో రూ.406 చొప్పున కూలీలకు రోజువారీ వేతనం చెల్లించనున్నారు. సిక్కింలోని మూడు పంచాయతీలకు మాత్రం ప్రత్యేకంగా రూ.450 వేతనం నిర్ణయించారు.ఉపాధి హామీ పథకానికి గానూ 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం వేతన సవరణ చేపట్టలేదు. వీబీ జీరామ్‌జీ చట్టం తీసుకొచ్చిన నేపథ్యంలో పెంపును వాయిదా వేసింది. ఇప్పుడు కొత్త చట్టం అమల్లోకి తీసుకురావడంతో వేతన సవరణ చేపట్టింది. చివరికి సారిగా గతేడాది మార్చి 27న ఈ వేతనాలను కేంద్రం సవరించింది.

## భారత్ విశ్వసనీయ మిత్ర దేశం..

వాణిజ్య ఒప్పందం కుదరనుందని తెలిపారు. ఈ ఒప్పందంతో ఇరు దేశాలకు ప్రయోజనం చేకూరుతుందని, జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటుందన్నారు. ఇదీ చదవండి: జన్మతః పౌరసత్వంపై 'సుప్రీం' తీర్పు.. ఇండో అమెరికన్ల హర్షం

## బతుకులు బుగ్గి

ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. బస్సు రిషికేష్ నుంచి ఇండోర్ వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నడా..? ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో విచారిస్తున్నామన్నారు. ఐదుగురు ప్రయాణికులు మంటల్లోనే సజీవ దహనం అయ్యారని.. మరో ముగ్గురు తీవ్రగాయాలై మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు.

ఆగివున్న లారీని ఢీకొన్న మరో లారీ..

బోయపాలెం: పల్నాడు జిల్లా బోయపాలెం వద్ద జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు లారీలు ఢీకొని మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో నలుగురు సజీవ దహనమయ్యారు. ఆగివున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు క్లీనర్లు మంటల్లో చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

## ఆగస్టు 30న నీట్ పీజీ పరీక్ష..

న్యూఢిల్లీ(జనంసాక్షి):వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జాతీయస్థాయి అర్హత పరీక్షకు షెడ్యూల్ విడుదలైంది. ఆగస్టు 30న పరీక్ష నిర్వహించనున్నట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ ప్రకటించింది. ఈ రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని, జులై 21 వరకు ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ అందుబాటులో ఉంటుందని వెల్లడించింది.దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ వేదికగా నీట్ పీజీ పరీక్షను నిర్వహించేందుకు ఎన్‌బీఈఎంఎస్ ఏర్పాట్లు చేస్తోంది. పరీక్ష కేంద్రానికి సంబంధించి ముందస్తు సమాచారాన్ని ఆగస్టు 11నే అభ్యర్థులకు తెలియజేస్తామని పేర్కొంది. సెప్టెంబర్ 30 నాటికి ఫలితాలను విడుదల చేయనున్నట్లు తెలిపింది.

# రాముడిని నిలువునా దోచేశారు

తెలిపారు. ఈ కుట్రలో కొంతమంది ఎస్‌బీఐ ఉద్యోగుల పాత్ర కూడా ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. నిందితులు బ్యాంక్ సిబ్బందితో కుమ్మక్కై డబ్బును అక్రమంగా తరలించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నట్లు తెలిపారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు.దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అయోధ్య విరాళాల అపహరణపై ముమ్మర దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో నిందితులను విచారించగా.. కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆలయంలోని విరాళాల లెక్కింపు వ్యవస్థలో లోపాలను ఆసరాగా చేసుకున్న ఈ ఇంటిదొంగలు.. చాలా సునాయాసంగా సొమ్ము బయటకు తరలించినట్లు తెలుస్తోంది. దొంగలించిన సొత్తును వాష్‌రూమ్‌ల్లో దాచి.. ఎవరికీ కనబడకుండా తీసుకెళ్లినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.ఈ కేసులో ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కోర్టు అనుమతితో నిందితుల్లో ఒకడైన అవినాష్ శుక్లాను పోలీసులు మంగళవారం రెండు గంటల పాటు విచారించారు. ఈ సందర్భంగా అతడు కీలక విషయాలు బయటపెట్టినట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. విరాళాల కౌంటింగ్ గదికి ఉన్న తాళాలను మరో నిందితుడు టిన్నూ యాదవ్ సంపాదించాడు. అనంతరం ఎవరూ లేని సమయంలో ఆ గదిలోని డబ్బును చోరీ చేశామని శుక్లా తెలిపినట్లు సమాచారం.ఇక ఆలయ ప్రాంగణంలో ఎక్కడెక్కడ సీసీటీవీ కెమెరాలు ఉన్నాయి.. వాటిని ఎవరు పరిశీలిస్తారన్న వివరాలు నిందితులకు బాగా తెలుసు. దాన్ని అనువుగా తీసుకున్న నిందితులు.. సీసీటీవీ కెమెరాలకు చిక్కకుండా చోరీ చేసిన సొమ్మును వాష్‌రూమ్‌ల్లో దాచిపెట్టినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఆ తర్వాత సమయం చూసుకుని ఆ డబ్బును బయటకు తరలించినట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్వాహకులతో తమకున్న సాన్నిహిత్యం కారణంగా.. తమను ఎవరూ అనుమానిం చలేకపోయారని అవినాష్ శుక్లా విచారణలో వెల్లడించాడు.చోరీ చేసిన సొమ్ముతో తాను ఇల్లు, స్థలం కొనుగోలు చేసినట్లు శుక్లా విచారణలో అంగీకరించాడు. దీంతో అతడి ఆర్థిక లావాదేవీలతో పాటు, ఇతర నిందితుల ఆస్తుల వివరాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే, ఎవరికీ అనుమానం రాకుండా నిందితులు సుదీర్ఘకాలంగా ఎలా ఈ చోరీ చేశారు? వీరి వెనుక ఇంకెంతమంది ఉన్నారన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇక, విచారణ సమయంలో నిందితులు పలుమార్లు ట్రస్టీ అనిల్ మిశ్రా పేరును ప్రస్తావించినట్లు సమాచారం. ఈ కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత ఆయన సభ్యత్వానికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

## వాణిజ్య సిలిండర్ ధర తగ్గింపు..

న్యూఢిల్లీ(జనంసాక్షి):వాణిజ్య, పారిశ్రామిక వినియోదారులకు కాస్త ఊరటనిచ్చే వార్త. 19 కేజీల వాణిజ్య సిలిండర్‌పై రూ.183 తగ్గిస్తున్నట్లు చమురు సంస్థలు ప్రకటించాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టి, ఎల్పీజీ సరఫరా మెరుగుపడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. దీంతో దిల్లీలో ఒక్క సిలిండర్ రూ.2,930కి లభ్యంకానుంది. ఇన్నిరోజులు ఆ ధర రూ.3,113గా ఉంది.ఇప్పటికే హోటళ్లు, రెస్టారంట్లు వంటి వాణిజ్య వినియోగదారులకు వంటగ్యాస్ సరఫరాపై విధించిన ఆంక్షలను కేంద్రం తొలగించిన సంగతి తెలిసిందే. యుద్ధ సంక్షోభానికి ముందున్న స్థాయికి సరఫరాల్ని పునరుద్ధరించింది. దేశీయంగా ఎల్పీజీ ఉత్పత్తి పెరగడం, విదేశాల నుంచి దిగుమతి స్థాయిలు మెరుగుపడటం వంటి పరిణామాల నేపథ్యంలో ఆంక్షలను సడలించినట్లు పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఇప్పటికే ప్రకటన చేసింది. మరోవైపు ప్రైవేటు రంగ ఇంధన సంస్థ నయారా ఎనర్జీ కూడా పెట్రోల్‌పై లీటర్‌కు రూ.5, డీజిల్‌పై రూ.3 ధర తగ్గించింది. ఇక, ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడంతో చమురు సంస్థలు ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధర ఒక లీటర్‌పై రూ.5 తగ్గించాయి. దీంతో లీటర్ ఏటీఎఫ్ ధర రూ.115 నుంచి 110కి పడిపోయింది. దేశీయంగా రాకపోకలు సాగించే విమానసంస్థలకు ఈ తగ్గింపు వర్తించనుంది.

## హైకోర్టులో బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ ఎల్లుండికి వాయిదా

హైదరాబాద్(జనంసాక్షి):బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. అనంతరం జులై 03వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ చేసింది. బండి భగీరథ్ పోక్సో కేసులో ఇప్పటికే అరెస్టై చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. పరీక్షల కోసం ఇటీవల వారంరోజులపాటు మధ్యంతర బెయిల్?పై విడుదల అయ్యారు. అనంతరం జూన్ 26న తిరిగి జైలుకి వెళ్లారు.మైనర్ బాలికపై లైంగిక ఆరోపణల నేపథ్యంలో పేట్ బషీరాబాద్ పోలీసులు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. కేసు ప్రస్తుతం దర్యాప్తు దశలో ఉంది. దర్యాప్తులో భాగంగా మొయినాబాద్?లోని అనన్య హౌస్ ఫామ్‌హౌస్‌కు నిందితుడిని మే నెలలోనే తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. అక్కడ నేరం జరిగిన తీరు, అసలు డిసెంబరు 31వ తేదీన ఏం జరిగింది? తదితర వివరాలన్నీ భగీరథ్ నుంచి సేకరించారు. దాదాపు గంటపాటు ఫామ్‌హౌస్‌లో విచారణ చేసిన పోలీసులు కొన్ని వివరాలు రాబట్టారు.క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం మొయినాబాద్? ఫామ్?హౌస్?కు వెళ్లినప్పుడు అప్పటికే ఇతర వ్యక్తులు ఫామ్?హౌస్‌ను అద్దెకు తీసుకున్నారు. వారిని ఒక గదిలోకి పంపించి విచారణ పూర్తయ్యే వరకు బయటకు రావొద్దని పోలీసులు వారికి సూచించారు. డిసెంబరు 31కి మూడు రోజుల ముందు ఆ ఫామ్?హౌస్‌ను భగీరథ్? స్నేహితులు బుక్ చేసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో గుర్తించారు. ఆరోజు భగీరథ్, బాలికతో పాటు ఎవరెవరు ఫామ్‌హౌస్‌కి వచ్చారు? అంతకుముందు పరిణామాలు, ఆ తర్వాత ఏం జరిగిందో వివరాలన్నీ సేకరించారు.

## దొంగలకు శిక్ష పడాలంటే ప్రభుత్వం మారాలి

న్యూఢిల్లీ(జనంసాక్షి):అయోధ్య రామజన్మభూమి ఆలయ విరాళాల చోరీ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం రేపుతోంది. తాజాగా ఈ విషయంపై ఆమ్? ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కేంద్రం, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రామమందిర విరాళాలను దొంగిలించిన వారికి శిక్ష పడాలంటే ప్రభుత్వాన్ని మార్చాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ప్రభుత్వంలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ప్రతి రామభక్తుడిపై ఉందని తెలిపారు. .

## ఔటర్ రింగ్ రోడ్డుపై కాల్పుల కలకలం

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డుపై బుధవారం తెల్లవారుజామున కాల్పులు కలకలం సృష్టించాయి. మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ భూష్మి శ్రీకాంత్ హైదరాబాద్‌లో ఉన్నారనే సమాచారంతో అతన్ని పట్టుకునేందుకు నల్లగొండ సీసీఎస్ పోలీసుల బృందం అక్కడకు వెళ్లింది. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ సమీపంలోని బొంగులూరు ఓఆర్ఆర్ ఎగ్జిట్ 12 వద్ద శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా.. పోలీసులపై తిరగబడి కత్తితో దాడి చేశారు. ఈ క్రమంలో పోలీసులు ఆత్మరక్షణ కోసం అతనిపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నల్లగొండ సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధనగిరి తలకు గాయమైనట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపూర్‌కు చెందిన భూష్మి శ్రీకాంత్ చిన్న చిన్న దొంగతనాలు చేస్తుండేవాడు. 2007లో అతడిని అరెస్టు చేసే క్రమంలో కానిస్టేబుల్ వేణుబాబును చంపి పారిపోయాడు. అప్పటి నుంచి 120కిపైగా పైగా నేరాలు చేశాడు. ఒక్క నల్లగొండ జిల్లాలోనే అతనిపై సుమారు 300 వరకు కేసులు ఉన్నాయి. దీంతో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ శ్రీకాంత్ ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో భూష్మి శ్రీకాంత్ హైదరాబాద్‌లో ఉన్నాడనే సమాచారం తెలియడంతో సీసీఎస్ పోలీసుల బృందం వెళ్లింది. బొంగులూరు ఎగ్జిట్ వద్ద శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో తప్పించుకునేందుకు శ్రీకాంత్ కత్తితో పోలీసులపై దాడికి దిగాడు. దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. తర్వాత నిందితుడి కాళ్లపై కాల్చారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ తలకు గాయమైంది. దీంతో హెడ్ కానిస్టేబుల్‌ను ఆస్పత్రికి తరలించారు. నిందితుడి తలకు గాయం కావడంతో హైదరాబాద్ వనస్థలిపురంలోని ఆస్పత్రికి తరలించారు.

## మహువా మొయిత్రాపై కోడిగుడ్లతో దాడి

కోల్‌కతా(జనంసాక్షి):టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై కొందరు కోడిగుడ్లతో దాడి చేశారు. పశ్చిమ బెంగాల్‌లో పార్టీ కార్యకర్తలతో సమావేశంలో ఉండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఆమె ఉన్న భవనంపైకి నిరసనకారులు కోడిగుడ్లు విసురుతూ.. దొంగ దొంగ అని నినాదాలు చేశారు. ఘటనకు సంబంధించిన వీడియోను మొయిత్రా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY







# ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

- నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాల్సిందే
- కూనంనేని ఆధ్వర్యంలో లెఫ్ట్ పార్టీల ధర్నా

**కొత్తగూడెం, జూలై1 (జనంసాక్షి) :** ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పాలక ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఎం, సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ మాస్ లైన్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎవరినైనా ప్రశ్నిస్తానన్నారు. పాలక ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికైన ప్రభుత్వాలను కొలగొట్టేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. సర్ పేరుతో ఓట్లను తొలగించి తమకు అనుకూలమన్న ఓటర్లను మాత్రమే చేర్చే పక్రియ చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని, జీవో నెంబర్ 76 ను పునరుద్ధరించి ఇంటి పట్టాలు మంజూరు చేయాలన్నారు. పేదల పక్షాన పోరడడానికి తాను ఎప్పుడు సిద్ధమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ మూడు గణెళిష్, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, ముత్యాలు, విశ్వనాథం, తుపాకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యుల కీలక పాత్ర

- నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి
- డాక్టర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దామోదర



**హైదరాబాద్, జూలై1 (జనంసాక్షి) :** డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులందరికీ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. తమ నైపుణ్యం ద్వారా ప్రతి రోజూ వేల ప్రాణాలను డాక్టర్లు కాపాడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని, వారి సేవలు ఆరోగ్య వ్యవస్థకు ఎంతో కీలకమని అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్యులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య సౌకర్యాలు, తగిన మానవ వనరులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందని తెలిపారు. ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 440 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, 1,616 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు, సుమారు 800 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి గుర్తు చేశారు. డాక్టర్లతో పాటు ఇతర పోస్టులను కూడా పెద్ద సంఖ్యలో భర్తీ చేశామని చెప్పారు. సుమారు 15 వేల పోస్టులు భర్తీ చేశామని తెలిపారు. ఉద్యోగాల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న డెంటిస్టుల ఆకాంక్షను నెరవేర్చుతూ 48 డెంటల్ సర్జన్ పోస్టులను భర్తీ చేశామని మంత్రి గుర్తు చేశారు. ఈ రెండున్నర సంవత్సరాల్లో సుమారు 1,300 మంది డాక్టర్లకు పదోన్నతులు కల్పించినట్లు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. డాక్టర్ల దశాబ్దకాల ఆకాంక్ష అయిన ఉస్మానియా నయా హాస్పిటల్ నిర్మాణాన్ని ప్రారంభించామని, అలాగే గాంధీ, ఉస్మానియా మెడికల్ కాలేజీల్లో నూతన హాస్టళ్ల నిర్మాణం పూర్తికావొచ్చిందని మంత్రి తెలిపారు. వైద్యులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు, ఇతర సిబ్బందికి మెరుగైన వర్క్ ఎన్విరాన్‌మెంట్ కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జూనియర్ డాక్టర్ల స్టైఫండ్, సీనియర్ రెసిడెంట్ల గౌరవ వేతనాలను 15 శాతం మేర పెంచామని మంత్రి గుర్తు చేశారు. అ÷-దదె భవనాలు, పాత భవనాల్లో కొనసాగుతున్న మెడికల్ కాలేజీలు, హాస్పిటళ్లకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఆధునిక భవనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ వైద్యుల సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా వైద్యులు తమ సేవలను కొనసాగించాలని కోరుతూ, డాక్టర్స్ డే సందర్భంగా మరోసారి రాష్ట్రంలోని వైద్యులందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

# స్మోకింగ్ మానేస్తే.. మీకు, మీరే ఓ డాక్టర్

- టుబాకో కంట్రోల్ హీరో మాచన రఘునందన్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సిగరెట్,గుట్కా లతో ఆరోగ్యం పాడు చేసుకుని, డాక్టర్ వద్దకు వెళ్లే..బదులు పొగాకు ఉత్పత్తుల వినియోగం కు దూరం గా ఉంటే..మీరే స్వయం వైద్యులు అని టుబాకో కంట్రోల్ హీరో మాచన రఘునందన్ స్పష్టం చేశారు. సిగరెట్ తాగకు..గుట్కా తినకు అని తన స్నేహితుడికి చెప్పి, పొగాకు ఉత్పత్తుల అలవాట్లను దోస్తుల తో.. మాన్పించే ప్రతి మిత్రుడు ఓ గొప్ప మార్పు తెచ్చే వైద్యుడే అని ఆయన అభిప్రాయపడ్డారు బుధవారం నాడు డాక్టర్స్ డే సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ.. స్నేహితుల మాటలే ఆయా వ్యక్తుల పై ఓ ఔషదం లా పని చేస్తాయని అన్నారు. "ఎంత చెప్పినా వాడు వినడు" అని.. అలా వదిలేసే బదులు స్నేహితుల ను చెడు అలవాట్ల నుంచి సంరక్షించే వారు సహజ వైద్యులు అని రఘునందన్ అభిప్రాయపడ్డారు. ఓ వ్యక్తి ధూమపానం లేదా పొగాకు ఉత్పత్తుల అలవాటు తో..జబ్బు చేసి..మరణానికి దగ్గర అవుతుండగా చూసే కంటే..మనసును కష్ట పెట్టి ఐనాసరే..మంచి కోరుతూ.. ఓ వ్యక్తి జబ్బు ను జయించాలి, అది పొగాకు,ధూమపానం అలవాటు నుంచి ఆ వ్యక్తి ని దూరం చేస్తే నే సాధ్యం అని అనుకున్నపుడు. మిత్రులే వైద్యుడి అవతారం ఎత్తాలి. దోస్తు ను కాపాడుకోవాలి అని రఘునందన్ ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు.

# పోలీసుల అదుపులో పుష్కరాల ఏసి దొంగలు



**కాళేశ్వరం, జూలై 1 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద గత సంవత్సరం జరిగిన సరస్వతి ఆది పుష్కరాలలో టెంట్ సిటీ ల నుండి దొంగిలించలించబడిన ఏసీ ల విషయం లో పురోగతి కనిపించింది. మొన్న జరిగిన అంత్య పుష్కరాల సందర్భంగా కూడా కొన్ని ఫ్లడ్ లైట్లు దొంగతనానికి గురయ్యాయి. ఈ విషయంలో పోలీసులు కాళేశ్వరం చుట్టుపక్కల ప్రాంతాలలో సోదాలు నిర్వహించగా ఒక వ్యక్తి ఇంట్లో లైట్లు దొరికినట్లుగా తెలిసింది. దీంతో ఆ వ్యక్తిని విచారించగా గత ఆది పుష్కరాలలో దొంగిలించబడిన ఏసీల గురించి వివరాలు , కొందరు వ్యక్తుల పేర్లు వెల్లడించినట్లు తెలిసింది. కొన్ని ఏసీలను అమ్ముకున్నట్లుగా వారు తెలిపినట్లు సమాచారం. అయితే ఈ విషయంపై మహాదేవపూర్ సి ఐ వెంకటేశ్వర్లు ను వివరణ కోరగా దొంగతనం చేసిన వ్యక్తులను అదుపులోకి తీసుకొని ఇంటరాగేషన్ చేస్తున్నామని ఒకటి రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

# అయోధ్య చోరీ కేసులో దర్యాప్తు ముమ్మరం

- నిందితుల నుంచి రూ.70,25,000 నగదు సీజ్



**లక్నో, జూలై1 (జనంసాక్షి) :** అయోధ్య రామమందిర విరాళాల చోరీ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలో పోలీసులు నిందితుల ఇళ్ల నుంచి రూ.70,25,000 నగదును సీజ్ చేశారు. అత్యధిక శాతం నగదు నిందితుడు అవినాశ్ శుక్లా ఇంట్లో లభించింది. అతడి ఇంట్లో రూ.20 లక్షలను సీజ్ చేశారు. కరుణెళిశ్ పాండే ఇంటి నుంచి మరో రూ.18 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. అనుకల్ప్ మిశ్రా ఇంట్లో రూ.16 లక్షలు లభించాయి. అవినాశ్ శుక్లా ఇంట్లో 1,121 యూఎస్ డాలర్స్ కూడా లభించాయి. ఆయోధ్య రామ మందిర విరాళాల అవకతవకల కేసుపై దర్యాప్తు చేసేందుకు యూపీ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సిట్ నివేదిక మేరకు జూన్ 25న పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి లోతైన దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. అవినాశ్ శుక్లా, అనుకల్ప్ శుక్లా, లవ్‌కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణెళిశ్ పాండే, రామశంకర్ మిశ్రా, శుభాష్ శ్రీవాత్సవ, రామశంకర్ యాదవ్‌లను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. జులై 13 వరకూ వారికి కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దర్యాప్తులో భాగంగా పలు చోట్ల రెయిడ్స్ నిర్వహిస్తున్న పోలీసులు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల బంధువులను కూడా ప్రశ్నిస్తున్నారు.

# చిరుతపులి కోసం గాలింపు చర్యలు

- మర్రిమిట్ట సమీపంలో ఎన్ హెచ్ 365 రహదారి దాటుతుండగా చూసిన ప్రయాణికుడు
- తోటదస్రుతండా మామిడితోటకు వెళ్లినట్లు సమాచారం
- ఆనవాళ్లు కనిపిస్తే సమాచారం అందించండి
- ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి
- గూడూరు రేంజ్ అటవీశాఖ అధికారి ప్రసాద రావు




**గూడూరు, జులై 1 (జనంసాక్షి):** గూడూరు మండలంలోని మర్రిమిట్ట సమీపంలో మంగళవారం రాత్రి ఎన్ హెచ్ జాతీయ రహదారి చిరుతపులి దాటుతుండగా ఆ ప్రాంతానికి చెందిన వ్యక్తి ఫారెస్ట్ అధికారులకు సమాచారం తెలపడంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. హుటాహుటిన అక్కడకు చేరుకొని అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న ప్రజలు, మండల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని గూడూరు రేంజ్ అటవీ శాఖ అధికారి ప్రసాదరావు సూచించారు.మంగళవారం రాత్రి మర్రిమిట్ట సమీపంలోని తోటదస్రు తండా మామిడి తోటవైపు వెళ్లినట్లు గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో గ్రామస్తుల సహకారంతో రాత్రంతా మా టీంతో కలసి మేం అంత అక్కడే ఉండి గాలింపు చర్యలు చేపట్టామని, అప్పటికే రాత్రి సమయం కావడంతో ఆనవాళ్లు కనిపించక పోవడంతో అధికారులు పరిస్థితిని పర్యవేక్షిం చారు. బుధవారం ఉదయం పోలీసులకు సమాచారం అందించ టంతో పాటు గ్రామస్తుల సహకారంతో అందరం కలసి అనుమానిత ప్రాంతాలను అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించామని, మంగళవారం రాత్రి కురిసిన వర్షం మధ్య రాత్రి కురిసిన వర్షం, బుధవారం కురిసిన చిన్న చిన్న జల్లులకు చిరుత పులి ఆనవాళు ,,ఎలాంటి పాదముద్రలు గుర్తించలేక పోయామని అటవీ శాఖ అధికారి ప్రసాదరావు తెలిపారు. అనంతరం గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు,జాగ్రత్తలు తెలిపారు. చిరుత పులికి ఎటువంటి హాని తలపెట్టొద్దని, పొలాల్లో వెళ్లేటప్పుడు అనవాళు ,, కనిపిస్తే సమాచారం అందించాలని,మీకు సపోర్టుగా ఉంటామని, మండల ప్రజలంతా అప్రమత్తం గా ఉండాలని, అటవీ ప్రాంతానికి ఒంటరిగా వెళ్లోద్దని, పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని,అన్ని టీంలు అక్కడే ఉండే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామని, ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లామని అటవీ శాఖ అధికారి ప్రసాదరావు తెలిపారు.

## భీమ్‌గల్ విద్యుత్ శాఖ ఎడిగా రాజేందర్ రెడ్డి

**నిజామాబాద్, జూలై 1 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండల విద్యుత్ శాఖ నూతన అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ (ఏడీ)గా రాజేందర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇన్‌చార్జి ఏడీ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ పరిపాలన కొనసాగుతుండగా, ప్రభుత్వం ఇటీవల రాజేందర్ రెడ్డిని శాశ్వత ఏడీగా నియమించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం విద్యుత్ శాఖ టౌన్ ఏఈ సత్యప్రసాద్, శాఖ అధికారులు, సిబ్బంది, లైన్‌మెన్లు రాజేందర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఏడీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## ఆటో, ట్రాక్టర్ ఢీ

### ముగ్గురికి గాయాలు



**లక్షెట్టిపేట జూన్ 01 (జనంసాక్షి) :** లక్షెట్టిపేట పట్టణంలోని కరీంనగర్ చౌరస్తా రాష్ట్ర రహదారిపై శుక్రవారం సాయంత్రం ట్రాక్టర్ ఆటోను ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పాత కొమ్ముగూడెం గ్రామానికి చెందిన మంద లచ్చయ్య అనే ఆటో డ్రైవర్ రోజు మాదిరిగా తన ఆటోలో సంయుక్త, సత్తయ్య అనే ఇద్దరు ప్యాసింజర్ లను ఎక్కించుకొని ఆటో నడుపుకుంటూ లక్షెట్ పేటకు వస్తుండగా కరీంనగర్ చౌరస్తా సమీపంలో ఎదురుగా జన్నారం వైపు వెళ్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ లచ్చన్న తో పాటు ఇద్దరు ప్యాసింజర్లకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆటో నుజునుజు కావడంతో పాటు ముగ్గురు గాయాల అవడంతో ఆటో నడుపుతున్న డ్రైవర్ లచ్చన్న యొక్క అన్న మంద శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు లక్షెట్టిపేట ఎస్సై సురేష్ తెలిపారు.

# సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

- ఇంటి స్థలాలు, ఇంటి పట్టాలు ఇంటి నెంబర్లకై డిమాండ్
- ట్రాక్టర్ పై గుడిసె వేసి ఇంటి నమూనాలతో వినూత్న ప్రదర్శన
- ఆందోళన ఉద్రిక్తం.. 40 మంది సిపిఐ నేతల అరెస్ట్




**మహబూబాబాద్, జూలై 01(జనం సాక్షి):** భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఇంటి స్థలాలు, ఇంటి పట్టాలు, ఇంటి నెంబర్లకై కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ట్రాక్టర్పై గుడిసె వేసి ఇంటి నమూనాలతో వినూత్న ఆందోళన నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత కాగా 40 మంది సిపిఐ నేతల అరెస్టు టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఆందోళనలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేవరకు సిపిఐ పోరాటం ఆగదన్నారు. జిల్లా కేంద్రంలో వందలాది ప్రభుత్వ స్థలాలు ఉన్న ప్రభుత్వం నిరుపేదలకు ఇంటి స్థలాలు పంచడం లేదన్నారు. జిల్లా కేంద్రంలో రియాల్టర్లు, భూ కబ్జా కారులు అక్రమంగా ధరణి మరియు భూ భారతి పేరిట రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వానికి మరియు జిల్లా అధికారులకు కళ్ళు కనిపించట్లేవా అన్నారు. పేదలు 80 గజాల్లో గుడిసెలు వేసుకుంటే అక్రమంగా కూల్చేసి కేసులు పెడతారా అని హెచ్చరించారు. వెంటనే సిపిఐ నేతలు గుడిసె వాసులపై అక్రమ కేసులు ఎత్తివేసి నిరుపేదలకు ఇంటి స్థలాలు పంచాలన్నారు. జిల్లా కేంద్రంలో వేలాదిమందికి ఇంటి నెంబర్లు ఇంటి పట్టాలు లేవన్నారు.గత ప్రభుత్వం పదివేల మంది అప్లై చేసుకుంటే కేవలం 600 మందికి ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. ఇందిరమ్మ పేరిట ఈ ప్రభుత్వం ఇంటి పట్టాలు ఉంటేనే ఇస్తామంటున్నారు. కానీ ప్రభుత్వం ఇంతవరకు ఇంటి పట్టాలు ఇవ్వడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం ఇంటి పట్టాలు ఇంటి నెంబర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సుమారు పదివేల రూపాయలు ఇంటికి రాయిలు కట్ట ఇక ఇబ్బందుల పాలు కొంతమంది ఆత్మహత్యల పాలవుతున్నారన్నారు. ఇంటి స్థలాలు పేదలకు పంచకపోతే సిపిఐ ఆధ్వర్యంలో దశల వారి ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళన ఉద్రిక్తత మధ్య సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి లతో సహా 40 మంది సిపిఐ నేతల్ని అరెస్టు చేసి టౌన్ పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ ఆందోళనలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి అజయ్ సారధి రెడ్డి, నన్ను సుధాకర్ రెడ్డి, కట్టబోయిన శ్రీనివాస్, పెరుగు కుమార్, దేశ పల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిళ్ల సాంబలక్ష్మి, కట్లోజు పాండురంగాచారి, వరిపల్లి వెంకన్న, నెల్లూరు నాగేశ్వరరావు, తండా సందీప్, నర్రా శ్రావణ్, వెలుగు శ్రావణ్, మేక వీరన్న, తురక రమేష్, సమ్మయ్య, ఆబోతు అశోక్, మహమూద్, చిరంజీవి, పాల్, వెంకటరెడ్డి, చిర్ర సత్యనారాయణ, భూక్య హరి, అన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందికి గుడ్ న్యూస్

- ఫస్ట్ తారీఖున జీతాల జమ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు జీతాల చెల్లింపు విషయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సొసైటీలు, విశ్వవిద్యాలయాలు, ఇతర ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందికి ఈ నెల మొదటి తేదీనే జీతాలు విడుదలయ్యాయి. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ బుధవారం ఉద్యోగుల జీతాలను విడుదల చేసింది. జీతాల చెల్లింపులో ఆలస్యం వల్ల ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, హానరేరియం ప్రాతిపదికన పనిచేస్తున్న సిబ్బందికి కూడా ప్రతి నెలా జీతాలు ఆలస్యం లేకుండా అందించాలని ఇటీవలే అధికారులను ఆదేశించారు.

సీఎం ఆదేశాల అమలులో భాగంగా ఆర్థిక శాఖ ఇటీవల అన్ని శాఖలు, విభాగాలకు సర్క్యులర్ జారీ చేసింది. జీతాల బిల్లుల సమర్పణ, పరిశీలన, ఆడిట్, ఆథరైజేషన్‌లో జాప్యం రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ప్రతి నెల 25వ తేదీలోగా జీతాలు, రెమ్యునరేషన్ బిల్లులను ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్, అకౌంట్స్ విభాగాలకు సమర్పించాలని ఆదేశించింది. నెల చివరి పని దినానికల్లా పరిశీలన, ఆడిట్, ఆథరైజేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని స్పష్టం చేసింది. ఈ అదేశాల అమలు.. జీతాల చెల్లింపుల వివరాలపై ముఖ్యమంత్రి బుధవారం ఆర్థిక శాఖ అధికారులను ఆరా తీశారు. ఈ నెల బిల్లులు అందిన అన్ని విభాగాల ఉద్యోగులకు బుధవారం జీతాలు జమ చేసినట్లు ఆర్థిక శాఖ అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు.

## వేజ్ బోర్డు కమిటీని ఏర్పాటు చేయాలని జేఏసి ఆధ్వర్యంలో ధర్నా



**శ్రీరాంపూర్(జనంసాక్షి):** 12వ వేజ్ బోర్డ్ వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని,నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సింగరేణిలోని ఏఐటియుసి, ఐఎన్టియుసి, సిఐటియు, హెచ్ఎంఎస్ నాలుగు జాతీయ సంఘాల జేఏసి ఆధ్వర్యంలో బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు,డిపార్ట్మెంట్లలో ధర్నాను నిర్వహించి యాజమాన్యానికి వినతి పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 11వ వేజ్ బోర్డు కాలపరిమితి ముగిసిన 12వ వేజ్ బోర్డు కమిటీని నేటి వరకు ఏర్పాటు చేయలేదన్నారు. బ వేజ్ బోర్డు కమిటీని ఏర్పాటు చేయాలని లేని పక్షంలో భవిష్యత్తులో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా,కొట్టే కిషన్ రావు, ఐఎన్టీయూసీ నాయకులు శీలం చిన్నయ్య,జగన్,శ్రీధర్, సిఐటియు నాయకులు సుధాకర్, సందీప్, హెచ్ఎంఎస్ నాయకులు శశిధర్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
2 జూలై 2026

# సర్కారు దవాఖానకు సెల్యూట్

సంపాదకీయం

ప్రైవేటు ఆసుపత్రుల కార్పొరేట్ కళ్లు చెదిరే హంగుల మధ్య, ప్రజల నమ్మకం ఇప్పటికీ ఒక్క పేరు మీద నిలబడి ఉంది ఉస్మానియా. నిజాం కాలం నాటి ఈ చారిత్రక వైద్యశాల, తెలంగాణ ఏర్పడ్డాక వచ్చిన నిర్లక్ష్యపు మచ్చలను చెరిపేసుకుని, మళ్లీ తన పూర్వవైభవాన్ని అందుకుంటోంది. తాజాగా ఉస్మానియా ఆసుపత్రిలో ఏకకాలంలో ఐదు అవయవాల మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా జరగడం ఒక చరిత్రాత్మక ఘట్టం. ఇది కేవలం ఒక వైద్య విజయం మాత్రమే కాదు, ప్రభుత్వ రంగ వైద్యం ఇంకా బతికే ఉందని, అది ప్రైవేటు రంగానికి ఏమాత్రం తీసిపోదని నిరూపించిన సందర్భం.

ఈ ప్రభుత్వ దవాఖానల చరిత్ర తవ్విచూస్తే ఇలాంటి విజయాలు కొత్తేమీ కాదు. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా ఐవీఎఫ్ ద్వారా శిశు జననాన్ని విజయవంతంగా సాధించిన ఘనత గాంధీ ఆసుపత్రిది. కరోనా మహమ్మారి విరుచుకుపడినప్పుడు, ప్రైవేటు ఆసుపత్రులు లక్షలు వసూలు చేస్తూ సామాన్యుడిని దూరం పెట్టిన వేళ, అదే గాంధీ ఆసుపత్రి రాష్ట్రానికే వెన్నెముకగా నిలిచి వేలాది మంది ప్రాణాలు కాపాడింది. నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) కిడ్నీ మార్పిడి చికిత్సల్లో దక్షిణాదిన మార్గదర్శిగా నిలిచింది, సూపర్ స్పెషాలిటీ చికిత్సల్లోనూ తనదైన ముద్ర వేసుకుంది. ఇవన్నీ కలిపి చూస్తే, తెలంగాణలో ప్రభుత్వ వైద్యరంగం నెమ్మదిగానైనా సరే, స్థిరంగా బలపడుతున్న చిత్రం కళ్లముందు కదులుతుంది.

ఈ విజయాలను జాతీయ, అంతర్జాతీయ నేపథ్యంలో పెట్టి చూస్తే వాటి ప్రాముఖ్యత మరింత స్పష్టమవుతుంది. బ్రిటన్, జర్మనీ, కెనడా వంటి అభివృద్ధి చెందిన దేశాలు కూడా విద్యా, వైద్య రంగాలను ప్రభుత్వ గొడుగు కిందే ఉంచాలని పట్టుదలగా ప్రయత్నిస్తున్నాయి. ప్రజారోగ్యాన్ని లాభాపేక్ష లేని రంగంగా, పౌరుడి ప్రాథమిక హక్కుగా అవి పరిగణిస్తాయి. కానీ మన దేశంలో పరిస్థితి పూర్తి భిన్నం. మౌలిక సదుపాయాలను, ముఖ్యంగా విద్యా వైద్య రంగాలను క్రమంగా ప్రైవేటు చేతుల్లోకి నెట్టేసి, సర్కారు తన బాధ్యత నుంచి తప్పుకుంటున్న ధోరణి కనిపిస్తోంది. కార్పొరేట్ ఆసుపత్రుల బిల్లులు సామాన్యుడి ఆర్థిక వెన్నువిరుస్తున్న ఈ కాలంలో, ప్రభుత్వ దవాఖానలే పేదల చివరి ఆశ్రయంగా మిగిలాయి.

ఇలాంటి నేపథ్యంలో ఉస్మానియా సాధించిన ఈ విజయం ఒక సంకేతం. సరైన నిధులు, సరైన వసతులు, సరైన సిబ్బంది కల్పిస్తే ప్రభుత్వ ఆసుపత్రులు కూడా అత్యున్నత స్థాయి చికిత్సలను అందించగలవని ఇది రుజువు చేస్తుంది. అయితే ఒక్క విజయంతో ఆగిపోకూడదు. ఈ స్ఫూర్తిని కొనసాగించి, రాష్ట్రంలోని ప్రతి జిల్లా ఆసుపత్రినీ బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. వైద్య రంగంలో పెట్టుబడి అంటే ఖర్చు కాదు, అది భవిష్యత్తు తరాల ఆరోగ్యంపై పెట్టే పెట్టుబడి. ఉస్మానియా వంటి సంస్థలు చూపిన బాటలో నడిచి, ప్రభుత్వ వైద్యరంగాన్ని మరింత పటిష్టం చేయడమే నిజమైన ప్రజాసేవ. అలాంటి నిబద్ధత కొనసాగినప్పుడే, "సర్కారు దవాఖాన" అనే మాటకు నిజమైన గౌరవం దక్కుతుంది.

# ప్రశ్నిస్తే దేశద్రోహమా? అక్షరాయుధమా!




ఒక ప్రశ్న అడగడం నేరమైతే, ఆ దేశంలో ఇక న్యాయం మిగలదు. ఒక పాలకుడిని ప్రశ్నించడం ద్రోహమైతే, ఆ దేశపు రాజ్యాంగం కేవలం ఒక కాగితం ముక్కగా మిగిలిపోతుంది. నేడు మన కళ్ళ ముందు జరుగుతున్నది సరిగ్గా ఇదే. అధికార పీఠాలపై కూర్చున్నవారిని విమర్శిస్తే వెంటనే దేశద్రోహి అనే ముద్ర వేసే ధోరణి రోజురోజుకూ పెరిగిపోతోంది. ఇది యాదృచ్ఛికంగా జరుగుతున్నది కాదు; ఇది పథకం ప్రకారం సాగుతున్న ఒక నిశ్శబ్ద యుద్ధం, పౌర సమాజపు గొంతును నొక్కేసే ఒక కుటిల వ్యూహం. భారత స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రభుత్వం మన ఉద్యమకారులను అణచడానికి వాడిన అదే ఆయుధాన్ని, అదే 124-ఎ సెక్షన్‌ను, స్వతంత్ర భారతదేశంలో నేటికీ వాడుతున్నారంటే అది ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు. బ్రిటిష్ వలస పాలకులు ఏ చట్టాన్ని స్వాతంత్ర్య సమరయోధుల స్వేచ్ఛను హరించడానికి తయారు చేశారో, ఆ చట్టపు ఆత్మనే నేటి కొందరు పాలకులు, అధికారులు తమ స్వప్రయోజనాల కోసం పునరుద్ధరిస్తున్నారు. ఒక పరాయి వలస పాలన కోసం రూపొందించిన నల్ల చట్టం, స్వేచ్ఛా భారతదేశపు సార్వభౌమ పౌరులపై ఎలా ప్రయోగించబడుతుంది? ఇది చరిత్ర మన ముందు ఉంచిన అతిపెద్ద ప్రశ్న. దీనికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత నేటి వ్యవస్థపై ఉంది. ఇక్కడ ఒక విషయాన్ని మనం చాలా స్పష్టంగా, నిష్పాక్షికంగా అర్థం చేసుకోవాలి. విమర్శ అంటే దేశాన్ని ద్వేషించడం కాదు. విమర్శ అంటే దేశాన్ని ప్రేమించడం, దానిని మరింత మెరుగుపరచాలనే తపన, ఆర్తి. ఒక తండ్రి తన బిడ్డ తప్పు మార్గంలో వెళ్తుంటే గద్దిస్తాడు, మందలిస్తాడు. అది బిడ్డపై ద్వేషంతో కాదు, వాడి భవిష్యత్తుపై ఉన్న ప్రేమాభిమానాలతో. అలాగే ఒక పౌరుడు ప్రభుత్వ విధానాలను, లోపాలను ప్రశ్నిస్తే, అది దేశంపై ఉన్న అపారమైన ప్రేమ వల్లే. ప్రభుత్వాన్ని విమర్శించడం వేరు, దేశాన్ని విమర్శించడం వేరు ఈ కనీస వ్యత్యాసాన్ని గుర్తించలేని లేదా గుర్తించ నిరాకరించే వ్యవస్థ ప్రజాస్వామ్యంగా చలామణి అయ్యే అర్హతను కోల్పోతుంది. అయితే ఇక్కడే మరో వాస్తవాన్ని కూడా మనం నిజాయితీగా ఒప్పుకోవాలి. హింసను ప్రేరేపించడం, మతకల్లోలాలను రెచ్చగొట్టడం, తప్పుడు సమాచారంతో (ఫేక్ న్యూస్) సమాజంలో విద్వేషాలను నింపడం ఇవి ఎప్పటికీ విమర్శ పరిధిలోకి రావు. నిజమైన ప్రజాస్వామ్యం ఈ రెండు విషయాల మధ్య స్పష్టమైన గీత గీయాలి. ఈ గీతను ఉద్దేశపూర్వకంగా చెరిపేసి, పాలకపక్షాన్ని వ్యతిరేకించే ప్రతి అసమ్మతి స్వరాన్నీ, సామాజిక కార్యకర్తలను ఒకే గాటన కట్టి జైలు పాలేయడమే నేటి అసలైన విషాదం. ఒక పాత్రికేయుడు (జర్నలిస్ట్) నిజం రాసినందుకు జైలుకు వెళ్ళాల్సి వస్తే, ఒక కళాకారుడు తన కళ ద్వారా సామాజిక రుగ్మతలను ప్రశ్నిస్తే కేసులు నమోదైతే, ఒక సామాన్య పౌరుడు సామాజిక మాధ్యమాల్లో (సోషల్ మీడియా) తన అభిప్రాయాన్ని నిర్భయంగా వ్యక్తపరిస్తే అర్ధరాత్రి అరెస్టులు జరిగితే అప్పుడు ఆ సమాజం జీవించి లేనట్టే. అది కేవలం శ్వాస తీసుకుంటున్న ఒక నడమంత్రపు శవం మాత్రమే. ప్రజాస్వామ్యానికి అసలైన ప్రాణం, ఊపిరి అసమ్మతిలోనే ఉన్నాయి. అసమ్మతి లేని చోట చర్చ ఉండదు, చర్చ లేని చోట పురోగతి సాధ్యం కాదు, పురోగతి లేని దేశం కాలక్రమేణా కుంటుపడుతుంది. ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే, ఏ గొప్ప ప్రజాస్వామ్య దేశమూ నిశ్శబ్దం మీదనో, పాలకుల భజనల మీదనో నిర్మించబడలేదు. ప్రతి గొప్ప సామాజిక, రాజకీయ సంస్కరణ వెనుక ఒక నిశితమైన ప్రశ్న ఉంది. ప్రతి పెద్ద విప్లవాత్మక మార్పు వెనుక ఒక బలమైన అసమ్మతి స్వరం ఉంది. ఆ స్వరాలను అధికార బలంతో నొక్కేస్తూ పోతే, సమాజంలో మిగిలేది భౌతిక అభివృద్ధి కాదు అది కేవలం మెరుగైన ఆధునిక ముసుగు వేసుకున్న నిరంకుశత్వం మాత్రమే అవుతుంది. ఈ చీకటి రోజుల్లో మనకు ఆశాకిరణంగా నిలుస్తున్నది న్యాయవ్యవస్థే. దేశంలోని అత్యున్నత న్యాయస్థానాలు అనేక సందర్భాలలో చాలా స్పష్టంగా తీర్పులు ఇచ్చాయి. ప్రభుత్వ విధానాలపై అసంతృప్తి వ్యక్తపరచడం, శాంతియుతంగా నిరసన తెలపడం అనేది పౌరుల ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు సైతం నొక్కి చెప్పింది. హింసను ప్రేరేపించనంత కాలం, సమాజ భద్రతకు భంగం కలిగించనంత కాలం వ్యక్తమయ్యే ప్రతి భిన్న అభిప్రాయం రాజ్యాంగం కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛ పరిధిలోకి వస్తుంది. ఈ న్యాయసూత్రాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని పాలకులు గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చట్టం అనేది అధికారంలో ఉన్నవారి స్వార్థ రక్షణ కవచంగా మారకూడదు; అది సామాన్య ప్రజల హక్కులను కాపాడే వజ్రాయుధంగా నిలవాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకుల ధోరణికి, నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తికి మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉంటుంది. నేడు పాలకులలో ప్రశ్నించే వారిపై 'దేశద్రోహం' అనే ముద్ర వేసి వేధించే ధోరణి పెరిగిపోతుండగా, నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి మాత్రం ప్రతి ప్రశ్నకు బాధ్యతగా సమాధానం చెప్పి, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని కోరుకుంటుంది. అధికార బలం ఉన్నవారు పౌరుల అసమ్మతిని, భిన్న స్వరాలను అణచివేయాలని చూస్తే, ప్రజాస్వామ్యం మాత్రం భిన్న అభిప్రాయాలను గౌరవించి, ఆరోగ్యకరమైన చర్చలకు వేదికను కల్పిస్తుంది. అలాగే, చట్టాన్ని అధికారంలో ఉన్నవారు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఒక రక్షణ కవచంగా వాడుకోవడం పాలకుల ధోరణి అయితే, అదే చట్టాన్ని సామాన్య పౌరుల ప్రాథమిక హక్కుల రక్షణ కోసం, వారి స్వేచ్ఛ కోసం ఉపయోగించడమే అసలైన ప్రజాస్వామ్య సిద్ధాంతం. కానీ ఈ ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం కేవలం కోర్టుల మీదో, పాలకుల విజ్ఞత మీదో మాత్రమే ఆధారపడి ఉండదు ఇది దేశంలోని ప్రతి పౌరుడి నైతిక బాధ్యత. నేడు మన పక్కవాడి గొంతు నొక్కేస్తుంటే మనం మౌనంగా చూస్తూ ఉంటే, రేపు మన వంతు వచ్చినప్పుడు మన తరఫున మాట్లాడేందుకు ఎవ్వరూ మిగలరు. నాకెందుకులే అనే ఉదాసీనత ప్రజాస్వామ్యానికి పెద్ద శాపం. అందుకే ప్రతి పౌరుడూ తన అంతరాత్మను ఒక్కసారి ప్రశ్నించుకోవాలి నేను భయపడి మౌనంగా ఉంటున్నానా, లేక పౌరుడిగా నా బాధ్యతను గుర్తించి నిజాయితీగా ప్రశ్నిస్తున్నానా? ఈ ప్రశ్నకు మనం ఇచ్చే సమాధానమే మన భారతదేశ ప్రజాస్వామ్య భవిష్యత్తును, మన తరువాతి తరాల స్వేచ్ఛను నిర్ణయిస్తుంది. విమర్శ అనేది ఎంతమాత్రం దేశద్రోహం కాదు. అది ప్రజాస్వామ్య వ్యవస్థకు వెన్నెముక వంటిది. ఒక దేశం అంతర్గతంగా, బాహ్యంగా బలంగా ఉండాలంటే, దాని పౌరులు నిర్భయంగా, స్వతంత్రంగా ప్రశ్నించగలగాలి. పాలకుల తప్పులను ఎత్తిచూపగలగాలి. ప్రశ్నించే హక్కును హరించే ప్రతి ప్రయత్నమూ, వాస్తవానికి దేశ భద్రత కోసం చేసేది కాదు, అది కేవలం అధికారంలో ఉన్నవారి పీఠాల భద్రత కోసం మాత్రమే ఉపయోగపడుతుంది. ఈ ప్రాథమిక వ్యత్యాసాన్ని మనం గుర్తించలేకపోతే, మన చేతులతో మనమే ప్రజాస్వామ్యాన్ని పూడ్చిపెట్టినట్టు అవుతుంది. కాబట్టి, తదుపరిసారి ఎవరైనా పాలకులను విమర్శించిన వారిపై లేదా పత్రికలపై దేశద్రోహం అనే ముద్ర వేసేందుకు ప్రయత్నించినప్పుడు, ఒక్క క్షణం ఆగి వివేకంతో ఆలోచించండి. వారు దేశాన్ని రక్షిస్తున్నారా, లేక తమ స్వార్థ అధికారాన్ని రక్షించుకోవడానికి దేశభక్తి అనే ముసుగును వాడుతున్నారా? ఈ ప్రశ్నకు జవాబు వెతకడమే నిజమైన దేశభక్తి, అదే పౌరుడిగా మన అంతిమ ప్రజాస్వామ్య బాధ్యత.

డా .సూర్యదేవర రామకృష్ణ,
9490754169




## బలి దానం

నేను డాక్టర్‌ని!
ముందు మనిషిని!
దైవసమానుణ్ణి
నారాయణో హరిః!
ఆరోజులేవీ?
ఆప్రేమలేవీ?
కాలం కార్పొరేట్
నృత్యం చేస్తోంది!
హృదయానికి
సంకెళ్ళబంధం!
బలిపశువులు!
వైద్యుడి దీనగాథ!
ఏం జరిగింది?
'సేవ'నసించింది
'డబ్బు'స్పృసించింది!
జనం తిరుగుబాటు!
మానవత్వం
ప్రేమ తత్వం
వైద్యనారాయణం!
పరితప్త హృదయం!
ఫ్రెంట్లైన్ వారియర్స్!
కరోనాకాటుకు
బలియైపోయిన
నిష్ఫల త్యాగాలు!
అదిఅదృశ్యశక్తి
వైద్య వ్యాపారం!
కబళించే కాలం!
వైద్యులబలిదానం!

తమ్మినేనిఅక్కిరాజు
హైదరాబాద్

# గౌడ జీవన దర్పణం

## 'మోకు' కథా సంకలనం



ఆదిమ మానవుడి నుండి ఆధునిక మానవుడి వరకు సమాజ పరిణామక్రమానికి వృత్తి వారధిలా నిలిచింది. మానవ మేధో వికాసానికి శ్రమ పాత్ర, వృత్తి నైపుణ్యం ఎంతో కీలకమైనది. సమాజం విస్తరించే క్రమంలో ఆహార సేకరణ నుండి, ఉత్పత్తి చేసుకోవాల్సిన స్థితి వరకు సమాజానికి వృత్తులు అవసరం అయ్యాయి. మానవాళి అభివృద్ధి చెందుతున్న తరుణంలో వృత్తుల విభజన జరిగింది. ఒక ప్రత్యేక పనికి నిష్ణాతుడైన వ్యక్తి ఆ పనిలోనే నిమగ్నమయ్యే అనివార్యత ఏర్పడింది. అట్లా ఏర్పడిన నిష్ణాతులైన వ్యక్తులు చేసే పనుల్లో తాటి చెట్టు ఎక్కి కల్లు గీయడం అనే వృత్తి ప్రత్యేకమైనది. కల్లుగీత వృత్తి సమాజంలో విశిష్టస్థానం గలది. కల్లుతీయడం ఎంత ఒడుపుతో, నేర్పుగా చేస్తారో అంతే స్థాయిలో ప్రమాదం కూడా పొంచివున్న వృత్తి ఇది. కల్లు గీయడం నేర్పుగా, ఓర్పుగా, కష్టంగా, ప్రమాదకరంగా, ప్రకృతికి సైతం ఎదురొడ్డి బతుకు కోసం తాటి చెట్టుతో సజీవ సంబంధం కలిగిన వ్యక్తే గౌడు. ఆకాశంలోకి ఎదిగిన తాటి చెట్టు నుండి చల్లని అమృతం లాంటి పానీయంను తీసుకొచ్చి సమాజానికి అందిస్తాడు. తాను ఒడ్సుకొచ్చిన కల్లుతో సమస్త కష్టజీవుల కష్టాలను, బాధలను మైమరిపిస్తాడు. కనుక ప్రకృతీ పానీయాన్ని ప్రజలకు అందించే సేవా కులం గౌడవృత్తి.

తెలుగు సమాజంలో ముఖ్యంగా తెలంగాణలో ప్రజల ఆనందాల్లో, చావులో, పండగల్లో, పబ్బాల్లో, పెండ్లి పేరంటాల్లో ఇంకా ఏ కార్యమైనా తప్పక కల్లు ఉండాల్సిందే. సుట్టమొస్తే మర్యాదకోసం కల్లు పోయాల్సిందే. ఊర్లో ఏ ఇంటి కార్యమైనా గౌడు ఇంట్లో కార్యమే అన్నట్లు ఉంటది. ఆధిపత్య వర్గాలు ఈ వృత్తిని, వృత్తిలో పాలుపంచుకునే గౌడుల పట్ల అగౌరవంగా, అన్యాయంగా వ్యవహరించినా, అవమానాలు, కష్టాలు ఎన్ని ఉన్నాగానీ, కంటి నీరు కనిపించకుండా నిష్కల్మషంగానే, స్వచ్ఛమైన పానీయాన్నే అందించేవారు. అట్లాంటి గౌడు స్థితిగతులపై మొట్టమొదటిసారి ఢిల్లీ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. అట్టెం దత్తయ్య తన సంపాదకత్వంలో "మోకు – గౌడుల బతుకు తాళ్లు" అనే పేరుతో కథా సంకలనాన్ని మన ముందుకు తీసుకొస్తున్నాడు. తెలంగాణ బిసి కథలు సిరీస్ లో భాగంగా వస్తున్న ఈ మోకు పుస్తకంలో 20 మంది రచయిత, రచయిత్రులు రాసిన 20 కథలు ఉన్నాయి. ఒక్కో కథ ఒక్కో వైవిధ్యమైన గాథను వివరిస్తుంది.

"మోకు" గౌడ జీవనంలో అత్యంత ముఖ్యమైనది. శివుడు నెత్తిన పాములా, గౌడు వంటి చుట్టూ మోకు పెనవేసుకుని ఉంటది. తాటి చెట్టుకు, గౌడుకు అవినాభావ సంబంధం మోకు. మోకు, గుజిబంధం అనే రెండు పరికరాలు తయారయ్యాక సమాజంలో ఓ పెద్ద మార్పు సంభవించింది. ఏడేడు కోలలకు మించి ఎత్తుండి, ఆకాశాన్నంటినట్లుండే తాటి చెట్లను ఎక్కడం సుసాధ్యమైంది మోకు కనిపెట్టాకనే. దాంతో ఎంతపెద్ద చెట్టయినా గౌడుకు తలొగ్గాల్సిందే. అందుకు ప్రకృతి కూడా గర్వపడ్డది. బిడ్డ చేసే సృజనకు తల్లికి సంతోషమైనట్లే గౌడును చూసి ప్రకృతీ కూడా పరవశించింది. తనలోని అనురాగాన్ని కల్లుపాలతో బిడ్డకు ఇష్టంగా ఒంపింది. మోకు ప్రకృతమ్మ వరప్రసాదం. ఇప్పటి అసహజ యంత్రాల్లా కాకుండా ప్రకృతిలోంచి సహజంగా తయారైనది మోకు. ఈ "మోకు" గౌడ వృత్తికి జీవన ఆధారం. అలాంటి మోకు పేరు ఈ కథల పుస్తకానికి పెట్టడం సముచితంగా ఉంది. ఈ మోకు కథల పుస్తకం గుర్తింపుకు నోచుకోకుండా సముద్రపు అడుగుల్లో పడిపోయిన గౌడుల అంతర్వేదనను బయటికి తీస్తుంది. అల్లంత ఎత్తున్నే కాదు, అట్టడుగు పొరల్లో దాగిన గౌడుల విలువైన జీవన గాథలను మోకు కథలు వెలికితీయబోతున్నాయి. ప్రతీ కథ ప్రమాదంలో గౌడ వృత్తి గమనాన్ని తెలుపుతున్నాయి. గౌడ వృత్తి పైకి గంభీరంగా కనిపిస్తున్నా అంతరంగ అనేక గాట్లు ఉంటాయి. గౌడ వృత్తిలో స్త్రీ పురుషుల సమాన భాగస్వామ్యం ఉంటుంది. ఇతర ఉత్పాదక వృత్తుల్లో కూడా స్త్రీల భాగస్వామ్యం







ఉన్నా గానీ, గౌడ వృత్తిలో స్త్రీ పాత్ర లేకపోతే ఆ వృత్తి నడవదనే విషయాన్ని చెబుతూ స్త్రీ గొప్పదనాన్ని ఈ కథలు గానం చేస్తున్నాయి. స్త్రీ పురుషుల సమాన ప్రాతినిధ్యం ఉన్నా స్త్రీకి ఈ వృత్తిలో అవమానాలు, లైంగిక వేధింపులు అధికంగా ఉన్నాయని గౌడుల వేదనను ప్రకటిస్తున్నాయి.

గౌడవృత్తి గత కాలంలో దొరల జాగీర్దారుల మీద ఆధారపడి బతకాల్సి వచ్చిన స్థితిని తెలుపుతున్నాయి. పన్నుల పేర దోపిడీ, మరో వైపు గౌడుల మహిళలపై అత్యాచారాలు చేయడం లాంటి భూస్వాముల ఆగడాల పరాకాష్టతను కళ్ళకు కట్టినట్లు ఈ కథలు చూపించాయి. అదే సందర్భంలో తెలంగాణ సాయుధ పోరాట వెలుగుల్లో కల్లుగీత కార్మిక సంఘం పెట్టుకొని పోరాడిన తీరును, దొరలపై తిరగబడిన గౌడుల త్యాగాల చరిత్రను ఈ కథలు కళ్ళముందుంచాయి. అట్లనే స్వాతంత్ర్యం అనంతరం ఎక్సైజ్ అధికారుల దాష్టీకాలు, దళారుల జోక్యం కల్లుగీత కార్మికుల కళ్ళల్లో నలుసుగా మారాయి. ఐక్యతతో అవి తిప్పి కొట్టి హక్కులు సాధించుకున్న వృత్తిదారుల వృత్తాంతాన్ని కథలు విప్పి చెబుతున్నాయి. తొంభైల్లో ప్రవేశించిన ప్రపంచీకరణ వల్ల సమాజంలోకి ఇబ్బడి ముబ్బడిగా డంపింగ్ చేయబడ్డ విదేశీ కోకోకోలా, థమ్స్ అప్ లాంటి శీతల పానీయాలు వృత్తిని ప్రమాదంలో పడవేసాయి. అంతేకాక ఫారీన్ మందును ప్రభుత్వాలు ఆదాయవనరులుగా చూడటం వల్ల, వాటికి అనుమతులు ఇష్టారీతిన ఇచ్చి, గౌడ వృత్తిని వెనక్కు నెట్టివేయటాన్ని ఈ మోకు కథలు వినిపిస్తున్నాయి. నేటి గౌడ కుటుంబాలు చదువువైపు ప్రయాణించడం, చదువును ప్రత్యామ్నాయ సాంస్కృతిక పతాకగా చూడాలని, గీతకార్మికుల పిల్లలు గౌరవనీయస్థానాలకు చేరాలన్న ఆలోచనలను ఈ కథలు వ్యక్తం చేశాయి.

సమాజానికి తోడునీడలా ఉన్న గౌడుల చరిత్రను, శ్రమను, సేవను, త్యాగాన్ని, జీవనగానాన్ని ప్రాచీన సాహిత్యం విస్మరించింది. ఉత్పత్తిలో భాగమైన ఈ మెజారిటీ శ్రమ జీవుల గాథలను కథలుగా తీసుకురావాలని తలచడం, అందుకు నడుంకట్టి మొదటి సంకలనంగా మోకును తీసుకురావడం అట్టెం దత్తయ్యకున్న బిసివాద స్పృహకు నిదర్శనం. ఉత్పత్తి కులాల కోసం, శ్రమజీవుల కోసం ఆయన చేస్తున్న సాహితి కృషిని గుర్తించి, అచ్చు వేస్తూ అండగా నిలుస్తున్న ధృవ ఫౌండేషన్ లాంటి సంస్థకు జయహో. ఇట్లాంటి మోకును ఆదరించి, అధ్యయనం చేసి, అందరిలోకి తీసుకెళ్లడం మనందరి బాధ్యత.

*(నేడు అనగా 02/07/2026 నాడు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'మోకు' పుస్తకావిష్కరణ జరుగుతున్న సందర్భంగా..)*



ఎ. విజయ్ కుమార్
9573715656

# నళిని జ్ఞాపకాలు.. తటిల్లత కోపం



తననే కించ పరచడం చూసి ఇక పూర్తిగా దూరం జరిగాడు చరణ్.

ఒకరోజు సుమతి ఒక ప్రముఖ బిల్డర్‌ను చరణ్‌కు పరిచయం చేసింది. సుమతి తెలివైన ప్లానర్ అనుకున్నాడు చరణ్. . తన కన్నా బాగా ఆలోచిస్తూంది. తన కన్నా సాహసంగా ముందుకు నడుస్తుంది. సుమతి ఏది చేసినా పక్కా ప్లాన్ ప్రకారం చేస్తుంది అన్నది చరణ్ విశ్వాసం.

"సార్, మీ ప్లాట్ చాలా ప్రైమ్ లొకేషన్‌లో ఉంది. మాకు ఇస్తే మేము 50-50 జాయింట్ వెంచర్ అగ్రిమెంట్ కింద ఇక్కడ ఒక పెద్ద అపార్ట్‌మెంట్ నిర్మిస్తాం. మీ పార్టనర్స్ ్ని కూడా ఒప్పించండి. మీకు ఎటువంటి నిర్మాణ ఖర్చు ఉండదు. బిల్డింగ్ పూర్తయ్యాక, మీ వాటాగా ఒక త్రీ-బెడ్‌రూమ్ (3దీఽఖ) ఫ్లాట్ మీకు ఉచితంగా వస్తుంది" అని బిల్డర్ ఆఫర్ ఇచ్చాడు.

సుమతి లీగల్ అగ్రిమెంట్స్ అన్నీ పక్కాగా చూసుకుంది. పార్ట్నర్స్ కూడా కొందరు కలిసారు. అక్కడ బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్ నిర్మాణం పూర్తయింది. ఆ నిర్మాణం చూస్తూ మరి కొందరు మధ్యలో కలిసారు. అలా గేటెడ్ కమ్యూనిటీ గా రూపు దిద్దుకుంది. అగ్రిమెంట్ ప్రకారం చరణ్‌కు , సుమతి ఫ్రెండ్స్ కు ఫ్లాట్లు వచ్చాయి. పై అంతస్తులో ఉన్న ఫ్లాట్ పూర్తిగా ఉచితంగా, సొంత ఇల్లుగా చేతికి వచ్చింది. సుమతి వల్ల దొరికిన అద్భుతమైన బహుమతి అది అని అందరు సమతిని అభినందించారు.

చరణ్ కొత్త ఫ్లాట్ గృహప్రవేశం రోజూ రానే వచ్చింది. ఇల్లు ఎంతో అందంగా, ఆధునికంగా డిజైన్ చేయబడింది. చెల్లె బావ , బంధువులు, స్నేహితులు అందరూ వచ్చి చరణ్‌ను, సుమతిని అభినందిస్తున్నారు. చరణ్ తల్లి సమతి తల్లి ఆనందానికి హద్దులు లేవు. అప్పులు లేకుండా చెల్లె పెళ్లి చేశాడు. అప్పు లేకుండా కోడలు ఉపాయంతో ఇంత పెద్ద అపార్టుమెంటు దక్కింది. జాగ ఇచ్చినందుకే ఇంత మంచి అపార్టు మెంటు రావడం వియ్యపు రాళ్లకు ఇంకా కలలో లా నమ్మ బుద్ది కావడం లేదు. తన బిడ్డ ముందు చూపుకు సమతి తల్లి ఆనందానికి హద్దులు లేవు. వాళ్ల నాన్న బతికి వుంటే ఎంత సంతోషించా వాడో! అనుకోకుండా ఉండ లేక పోయింది.

ఆ వేడుకకు మాధవ్ వచ్చాడు. మాధవ్ కుఈ మధ్య తటిల్లతతో పెళ్లయింది. తటిల్లత కాస్త ఒత్తు శరీరం. కాస్తముదురు వయసు, ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. మాధవ్ తల్లిదండ్రులు ఎంతో బతిమలాడి, కాళ్లు పట్టుకున్నంత పని చేస్తే, గతం నుంచి బయటపడటానికి మాధవ్ ఈ సంబంధానికి మొగ్గు చూపాడు. తటిల్లత కూడా మాధవ్ ప్రవర్తనను అర్థం చేసుకొని, ఈ వయసులో ఒక తోడు దొరుకుతుందని పెళ్లికి ఒప్పుకుంది.

అందరూ భోజనాల దగ్గర కూర్చున్నారు. తటిల్లత ఎంతో గౌరవంగా మాధవ్ పక్కన కూర్చుని మాట్లాడుతోంది. "మాధవ్ గారు మనం కూడా ఒక ఫ్లాట్ చూసుకుందాం. గతం తిరిగి రాదు . ఇక నుండైనా మన జీవితం బాగుండాలి" అని ఎంతో ఆశగా అంటోంది తటిల్లత .

కానీ మాధవ్ మనసు అక్కడ లేదు. అపార్ట్‌మెంట్‌లోని డెకరేషన్, కిటికీలకు దర్వాజలకు పూల దండలు. వాతావరణం, అక్కడ పడుతున్న వర్షం చూస్తూ అతని మైండ్ మళ్లీ నళిని జ్ఞాపకాల వైపు పరుగెత్తింది.

" ఈ అపార్ట్‌మెంట్ ఈ పూలు చూస్తుంటే నళిని గుర్తొస్తోంది. నళినితో కొత్త గృహ ప్రవేశం చేస్తున్నట్టు కల " ఏదో బాధ తొలుస్తోంది.

చుట్టుపక్కల ఉన్న బంధువులంతా నిరాశతో ఏదో గొణుగుతున్న మాధవ్ కేసి వింతగా చూశారు. తటిల్లతకు సంతోష సమయంలో మూడీగా ఉండడం కోపం తెప్పించింది. తటిల్లత లేచి నిలబడింది.

"ఇదిగో మాధవ్! ఇన్నాళ్లూ నీకు ఒక గతం ఉందని, దాని నుంచి బయటపడతావని నేను ఓపికగా ఉన్నాను. శుభకార్యంలో నన్ను పక్కన కూర్చోబెట్టుకుని, ఏం ఆలోచిస్తున్నావు? "

కొత్త ఇంట్లో వారి వ్యవహారం చూసి అందరు ఆశ్చర్య పోయారు. . అందరిని చరణ్ , సుమతి సముదాయించారు. మాధవ్ ఆ మూడ్ నుండి బయట పడ్డాడు.

చరణ్ సుమతి దంపతులు తమకు తోచిన మేరకు బంధు మిత్రులకు కొత్త బట్టలు పెట్టారు.

. వారికి పెట్టాల్సిన వారు కూడా అపుడే బట్టలు పెట్టారు. సుమతి పని కాలేజీ మిత్రులు సమ్మతిని బాగా మెచ్చుకున్నారు.

ఆ గృహ ప్రవేశానికి ఆకాశ్ ఏదో పని ఉందని రాలేదు. మొహం చెల్లక తప్పించుతున్నాడు.

ఇంటికి రాగానే తటిల్లత మాధవ్ ని నిలదీసింది. ఫోటో ఆల్బం లు మాధవ్ ముందేసింది. చాలా ఫోటోల్లో మాధవ్ తో నళిని చలాకీ సన్నిహితంగా... ! ఎక్స్ కర్షన్ టూర్లలో ఫ్రెండ్‌కి అంతా వాళ్లిద్దరికి పెళ్లయి పోయినట్టే ప్రయివసీ ఇచ్చేశారు. అవి చూస్తుంటే తనకా యోగం పట్టలేదని బాధ. మరో వైపు తన భర్త అందులో అలా ఉండడం వెలపరంగా ఉంది. ట్లత తిరగబడింది.

" నేను మౌనంగా ఉన్నానని అలుసై పోయింది మీకు. నళిని తో ఒక్క ఫోటో ఈ ఇంట్లో కనపడ కూడదు. మీకు కలలో కూడా గుర్తుకు రాకూడదు. నేను మీకేమి తక్కువ చేశాను? నళిని ని చేసుకుంటే ఇంత కన్నా ఎక్కువ చేస్తుందా? గారాల పట్టి. పైగా జడ్జి బిడ్డ .ఒక్క పని చేయదు. అన్ని మీతోనే చేయించేది . ఆ ఫోటోలు అన్ని తీసి పారేస్తేనే వస్త." అంటూ సూట్ కేసు సర్దుకుంది తటిల్లత.

మాధవ్ కు కరెంట్ షాక్ తగిలినట్టయి ఉలిక్కి పడ్డాడు. తటిల్లత వెళ్లి పోతే తాను మళ్లీ హోటల్ తిండి, చేతి వంట. .. ఇక ఆ పై ఆలోచించ లేక పోయాడు. తటిల్లత తన జీవితంలోకి రావడంతో తన జీవితం ఎంత సుఖంగా హాయిగా గడిచి పోతోంది. తటిల్లత వెళ్లి పోతే... ! ఆ ఊహే మాధవ్ ని వాస్తవంలోకి విసిరి కొట్టింది.

" సాయంత్రంలోగా అన్ని తీసేస్తాను. నువ్వు ఎక్కడికీ వెళ్లవద్దు లతా! " అని బతిమాలాడు. లత ఆ పిలుపులోని మాధుర్యానికి కరిగి పోయింది.

రెండేళ్లు రెప్పపాటులో గడిచిపోయాయి. సుమతికి ఒక పాప.

మాధవ్ మామూలు మనిషిగా మారాడని తటిల్లత సంతోషాన్ని సుమతితో పంచుతుంది.

ఆకాశ్ అనుకున్న అమెరికా ప్రాజెక్ట్ రాలేదు. ఒక శనివారం ఉదయం ఆకాశ్ నగరంలోని మ్యారేజ్ బ్యూరో ఆఫీసులో కూర్చుని చర్చిస్తున్నాడు.

"చూడండి ఆకాశ్ గారు... మీ ప్రొఫైల్ చూశాను. వయసు ఇప్పుడు ముప్పై నాలుగు.. మీరు ఐటి ఉద్యోగం చేస్తున్నా.. సొంత ఇల్లు లేదు. బ్యాంక్ బ్యాలెన్స్ , ఆస్తులేవీ చూపించలేదు. అమ్మాయిలు ఫ్యూచర్ సెక్యూరిటీ చూస్తున్నారు " శ్రీధర్ నిర్మొహమాటంగా చెప్పారు.

ఆకాశ్ ముఖం అహంకారంతో, అవమానంతో ఎర్రబడింది. ఏదేదో మాట్లాడితే ...

" అప్పుడే చేసుకోవాల్సింది. వయసు దాటాక ఇపుడెవరిస్తారు? ఎంతో ఆస్తి పాస్తులున్నోల్లను కూడా ఆడ పిల్లలు మెచ్చడం లేదు. కొందరు లివ్‌ఇన్ అంటూ అసలు వెళ్లే వద్దంటున్నారు. కేవలం తల్లి దండ్రుల బాధకు మా మ్యారేజీ బ్యూరోలో రికార్డు చేసుకున్నారు. " ఆడ పిల్లల కోరికలు వారి జెన్ జీ తరం ఆలోచనలు చెప్తూ వచ్చాడు శ్రీధర్.

ఆకాశ్ పడే ఆవేదన, అతనిలో అసూయ, బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియ లేదు.

కొద్ది రోజులకు సింగపూర్ లో మంచి ఉద్యోగం వచ్చిందని మాయమై పోయాడు ఆకాశ్. ఎక్కడికి వెళ్లాడో తెలియదు. ఫోన్ స్విచ్ఛాఫ్.." ఆ తరువాత ఆకాశ్ జాడ ఎవరికీ తెలియదు. ఆకాశ్ తల్లి కొడుకు ఫోన్ కోసం ఎదిరి చూస్తూనే ఉంది.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

## ఉప్పల్ ప్రాంత అభివృద్ధికి సమగ్ర ప్రణాళికపై చర్చ



**హైదరాబాద్, జూలై 1 (జనం సాక్షి) :** మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిని వేగవంతం చేసే దిశగా కీలక చర్యలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనూ చౌదరి ఐఏఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో ప్రధానంగా ఉప్పల్ ప్రాంత సమగ్ర అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల పనుల పురోగతి, ప్రజా సమస్యల తక్షణ పరిష్కారం, పట్టణ అభివృద్ధి ప్రాజెక్టుల అమలు వేగవంతం వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, తాగునీటి సరఫరా బలోపేతం, కాలనీల మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఉప్పల్ నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సమయానికి పూర్తిచేసేలా సంబంధిత శాఖల మధ్య మెరుగైన సమన్వయం అవసరమని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలెక్టర్‌ను కోరారు. ప్రజలకు అవసరమైన సేవలు మరింత వేగంగా అందేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనూ చౌదరి ఐఏఎస్ మాట్లాడుతూ, ఉప్పల్ ప్రాంత అభివృద్ధికి జిల్లా పరిపాలన పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యత క్రమంలో వేగవంతం చేసి, ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ భేటీతో ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి పనులకు మరింత వేగం చేకూరే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## రూ.19 కోట్లతో రామంతాపూర్ పెద్ద చెరువుకు సమగ్ర రూపాంతరం

- **పర్యావరణ హితంగా ఆధునిక సుందరీకరణ పనులు వేగవంతం**

**హబ్సీగూడ, జూలై 1 (జనం సాక్షి) :** హైదరాబాద్ తూర్పు ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణకు, భూగర్భ జలాల సంరక్షణకు కీలకంగా ఉన్న రామంతాపూర్ పెద్ద చెరువు త్వరలోనే సమగ్రంగా రూపాంతరం చెందనుంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.19 కోట్ల వ్యయంతో చేపట్టిన సుందరీకరణ, అభివృద్ధి పనులు ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ పనుల పురోగతిని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్న ఈ సందర్శనలో పనుల నాణ్యత, అమలు వేగం, భద్రతా ప్రమాణాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రామంతాపూర్ పెద్ద చెరువును కేవలం సుందరీకరణ ప్రాజెక్టుగా కాకుండా, నగరానికి ఒక "మల్టీ పర్పస్ ఎకో–స్పేస్"గా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మొత్తం 18.23 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఆధునిక సౌకర్యాలను కలిపి సమతుల్య అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ప్రణాళికలో భాగంగా చెరువు చుట్టూ విశాలమైన వాకింగ్ ట్రాక్, జాగింగ్ ట్రాక్, సైక్లింగ్ మార్గాలు, ఓపెన్ జిమ్, యోగా జోన్, మహిళల కోసం ప్రత్యేక బతుకమ్మ కొలను, పిల్లల కోసం సేఫ్ ప్లే జోన్, పచ్చదనం పెంపు కోసం గ్రీన్ బెల్ట్ అభివృద్ధి, సాయంత్రం వేళల్లో ఆహ్లాదకర వాతావరణం కోసం లైటింగ్ వ్యవస్థ, రోడ్ కనెక్టివిటీ, సీటింగ్ ఏరియాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదనంగా వర్షపు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే విధంగా చెరువు పునరుద్ధరణ పనులు కూడా చేపడుతున్నట్లు వెల్లడించారు. అలాగే చెరువు నీటి



నాణ్యతను మెరుగుపరచేందుకు శుద్ధీకరణ వ్యవస్థలు ఏర్పాటు చేయడం, ఆక్రమణలు లేకుండా కఠిన చర్యలు తీసుకోవడం, పర్యావరణ సమతుల్యతను కాపాడేలా స్థానిక జీవ వైవిధ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలు కూడా ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయని అధికారులు వివరించారు. ఈ అభివృద్ధి పూర్తయితే ఇది కేవలం వినోద కేంద్రం కాకుండా పర్యావరణ విద్యా కేంద్రంగా కూడా ఉపయోగపడుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మందుముల పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ అభివృద్ధి పనుల వల్ల స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేస్తామని, చెరువు సహజ స్వరూపాన్ని కాపాడుతూ ఆధునిక సౌకర్యాలను సమన్వయం చేయడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ అభివృద్ధి ప్రాంతంలో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, అందులో భాగంగానే రామంతాపూర్ పెద్ద చెరువు అభివృద్ధికి రూ.19 కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. ఇదే విధంగా రామంతాపూర్ చిన్న చెరువు అభివృద్ధి పనులకు కూడా నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే అక్కడ కూడా పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఈ మూడు చెరువుల అభివృద్ధి పూర్తయితే ఉప్పల్ ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణతో పాటు పట్టణ జీవన నాణ్యత గణనీయంగా మెరుగుపడుతుందని అభిప్రాయపడ్డారు. మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, హబ్సీగూడ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రామంతాపూర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చే ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేయడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. అలాగే పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వేగవంతం చేస్తున్న ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి కృషిని ఆయన అభినందించారు. రామంతాపూర్ పెద్ద చెరువు అభివృద్ధి పూర్తయిన తర్వాత ఈ ప్రాంతం ఉదయం జాగింగ్, యోగా, కుటుంబ వినోదాలు, పర్యాటక ఆకర్షణలకు కేంద్రంగా మారనుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో నగరంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కాలుష్యాన్ని తగ్గించడంలో ఈ చెరువు అభివృద్ధి కీలక పాత్ర పోషించనుందని పర్యావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ కంది ఆగి రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బొప్పనపల్లి సుధాకర్ రెడ్డి, హబ్సీగూడ డివిజన్ అధ్యక్షుడు గన్నారం విజయ్ కుమార్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు గణేష్ నాయక్, జనరల్ సెక్రటరీ ధర్మా నాయక్, చింతల బాబురావు, మురళీకృష్ణ ముదిరాజ్, లక్ష్మారెడ్డి, కిషన్ నాయక్, రాజు నాయక్, గుండు రాజన్న, మాలు నాయక్, ధర్మరాజు, వాసు నాయక్, సుమన్ నాయక్, సాయి కిరణ్, శివ, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యంగా కృషి చేయాలి

- **అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ శిరీష కృష్ణారెడ్డి**

**శామీర్‌పేట్, జూన్ 1 (జనం సాక్షి) :** అలియాబాద్ పురపాలక సంఘం పరిధిలోని తుర్కపల్లి వార్డు కార్యాలయంలో బుధవారం రోజు స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 - 2026 మార్గదర్శకాల మేరకు ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూని కేషన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన సమా వేశం నిర్వహించారు.యునైటెడ్ వే హైదరాబాద్ మరియు బ్యాంక్ ఆఫ్ అమెరికా హైదరాబాద్ వారి సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్ ద్వారా ఘన వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థ వంతంగా అమలు చేయడానికి పలు చర్యలు చేపడుతున్నారు. ఈ కేంద్రం ద్వారా ఇంటింటి నుండి సేకరించే చెత్తను తడి చెత్త -- పొడి చెత్తగా వేర్వేరుగా సేకరించడం, అనంతరం డీఆర్‌సీసీ కేంద్రంలో శాస్త్రీయ విధానంలో ప్రాసెసింగ్ చేయడం, అలాగే స్వచ్ఛ ఆటోల



ద్వారా డోర్–టు–డోర్ చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వ హించడం వంటి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన ఐఈసీ సమావేశంలో పురపాలక సంఘ చైర్ పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఇంటి నుంచి తడి మరియు పొడి చెత్తను తప్పనిసరిగా వేర్వేరుగా అందించడం ద్వారా వ్యర్థాల నిర్వహణ సులభతరం అవుతుందని, పరిశుభ్రమైన తుర్కపల్లి నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. డీఆర్‌సీసీ కేంద్రాన్ని ప్రజల సహకారంతో ఆదర్శవంతంగా నిర్వహించి, స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాలను సాధించే దిశగా అందరూ కృషి చేయ్యాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నూకల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ..స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 మార్గదర్శకాల ప్రకారం ఐఈసీ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, శాస్త్రీయ ఘన వ్యర్థాల నిర్వహణ, డోర్–టు–డోర్ సేకరణ, మూలం వద్దనే చెత్త విభజన వంటి అంశాలను కట్టుదిట్టంగా అమలు చేస్తామని తెలిపారు.పురపాలక సంఘాన్ని పరిశుభ్రమైన, సుస్థిరమైన మున్సి పాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ భాగ స్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమం లో కౌన్సిలర్లు యూసుఫ్ బాబా, రవి, దీపిక, దీపా, యునైటెడ్ వే హైదరాబాద్ ప్రతి నిధులు,తదితరులు పాల్గొన్నారు.

## డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



**హైదరాబాద్, జూలై 1 (జనం సాక్షి) :** భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) హైదరాబాద్ జిల్లా మహాసభలు జూలై 5న జరగనున్నట్లు, డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జావీద్ తెలిపారు. మహాసభలను యువత, విద్యార్థులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం బాగ్లింగంపల్లి సుందర విజ్ఞాన్ కేంద్రంలో మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా మహాసభలో నగర యువత, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలన, నిరుద్యోగ సమస్య, విద్యారంగ సమస్యలు, నిరుద్యోగ యువత పట్ల ప్రభుత్వాల వైఖరిపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 20 వేల పోలీసు కానిస్టేబుల్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజీవ్ యువ వికాస్ పథకాన్ని తక్షణమే అమలు చేసి నిరుద్యోగ యువతకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు దేవేందర్, రాజయ్య, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

- **మైనార్టీ సంక్షేమ అధికారి రషీద్**

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 1 (జనం సాక్షి) :** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పించాలని మైనారిటీ సంక్షేమ అధికారి ఎంఏ రషీద్ అధికారులను ఆదేశించారు.బుధవారం పట్టణంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలను మైనారిటీ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న విద్యాసదుపాయాలు, తరగతి గదులు, వసతి గృహాలు,తాగునీటి



సౌకర్యం, మరుగుదొడ్లు,పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లు మరియు ఇతర మౌలిక వసతులను క్షుణ్ణంగాపరిశీలించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందుబాటులో ఉండేలా నిరంతరం చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం పాఠశాల వంటశాలనుసందర్శించి,ఆహార తయారీ విధానం,పరిశుభ్రత ప్రమాణాలు,నిల్వ చేసిన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు.విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారంనాణ్యమైన,పోషకాహారం అందించాలని, వంటశాలలో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, విద్యా ప్రమాణాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాఠశాల సిబ్బందికి ఆదేశించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు స్కూల్ యూనిఫార్మ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మహబూబ్ ఖాన్,అధ్యాపకులు,వార్డెన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కార్మిక వ్యతిరేక పథకాన్ని వెంటనే రద్దు చేయాలి

- **వీబీజీ రామ్‌జీ విధానంపై సీఐటీయూ నిరసన**
- **అధికారులకు వినతి పత్రం**

**బెజ్జంకి, జూలై 1 (జనం సాక్షి) :** మండలంలో జూలై 1 నుంచి కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన వీబీజీ రామ్‌జీ పథకాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ మండల కన్వీనర్ సంఘ ఎల్లయ్య ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీవో కడవెరువు ప్రవీణ్ కు వినతి పత్రం అందించారు.అనంతరం సంఘ ఎల్లయ్య మాట్లాడుతూ కొత్త



విధానం ఉపాధిహామీ కార్మికులకు అనుకూలంగా లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు అందిస్తున్నప్పటికీ,కొత్త విధానంలో పనుల ఎంపిక, నిర్వహణపై కేంద్ర ప్రభుత్వ ఆధిపత్యం పెరుగుతుందని అన్నారు. ఇకపై ఏ పని ఎప్పుడు,ఎక్కడ చేయాలనే నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం సూచించిన విధంగానే అమలు చేయాల్సి ఉంటుందని,గ్రామపంచాయతీల పాత్ర తగ్గిపోతుందని అన్నారు.గతంలో ఒకసారి హాజరు నమోదు చేస్తే సరిపోయేదని,ఇప్పుడు ఫేస్ ఐడెంటిఫికేషన్ ద్వారా ఉదయం,సాయంత్రం హాజరు నమోదు చేయాల్సి వస్తోందని అన్నారు.అలాగే ఫీల్డ్ అసిస్టెంట్ల వ్యవస్థను తొలగించడం వల్ల వారి ఉపాధికి ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.జిల్లా కమిటీ పిలుపు మేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు భువనగిరి పరుశరాములు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు భువనగిరి రాజలింగం,భువనగిరి నర్సయ్య,మహంకాళి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయండి

**శేరిలింగంపల్లి, జూలై 1 (జనంసాక్షి) :** 'సర్' ప్రక్రియను మరింత వేగవంతం చేయడం ద్వారా నిర్ణీత గడువులో సమర్థవంతంగా పూర్తి చేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్/ జోన్ ఈఆర్వో నారాయణ అమిత్ ఆదేశాలను జారీ చేశారు. ఈ మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ డివిజన్ పరిధి రోలింగ్ హిల్స్, అంజయ్య నగర్, మాదాపూర్ ప్రాంతాలలో బుధవారం ఆయన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)



ప్రక్రియ కొనసాగుతున్న తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్ ప్రక్రియ పురోగతిని అంచనా వేసి, పనుల వేగం పెంచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. సర్ - 2026 విజయవంతంగా అమలు చేసేందుకు క్షేత్రస్థాయి ప్రయత్నాలను మరింత ముమ్మరం చేయాలని, అన్ని శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని సూచించడమైనదన్నారు. నిర్దేశించిన గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని ఈ సందర్భంగా శేరిలింగంపల్లి జోన్ ఈఆర్ఓ నారాయణ్ అమిత్ సంబంధిత ఉన్నతాధికారులకు సూచించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ అబ్జర్వర్స్ జయ చంద్రారెడ్డి, మరియు అసిస్టెంట్ ఈఆర్వోస్, బూత్ లెవెల్ సూపర్వైజర్స్ పాల్గొన్నారు.

# అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి

- **ఇండ్ల స్థలాలు లేని వారికి ఇండ్ల స్థలాలు కేటాయించాలి**
- **సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య**

**చేవెళ్ల, జూలై 1 (జనంసాక్షి) :** అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, గతంలో పట్టాలు ఇచ్చిన వారికి ఇండ్ల స్థలాలు చూపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం నాడు భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలోని రోడ్లు భవనాల అతిథిగృహం నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయం ముందు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిపిఐ నియోజకవర్గ ఇన్చార్జి కే.రామస్వామి అధ్యక్షతన మహా ధర్నాను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య హాజరై మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని, కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దేశములో నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు రోజురోజుకు తగ్గుతూ ఉంటే భారతదేశంలో మాత్రం దానికి భిన్నంగా రోజురోజుకు పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెరుగుతున్నాయని, పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వం కూడాఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేవెళ్ళ లోని 75వ సర్వే నెంబర్ లో గత నాలుగు సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని భూపోరాటం నిర్వహిస్తున్న గుడిసేవాసులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని, అక్కడ మంచినీరు, కరెంటు, రోడ్డు మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా పాలన ప్రభుత్వం వచ్చి 30 నెలలు గడుస్తున్న ఇండ్ల స్థలాలు లేని వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వడం లేదని, అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించడం లేదని అన్నారు. చేవెళ్ల నియోజకవర్గం లోని వందలాది నిరు పేద లకు గతంలో గత ప్రభుత్వాలు పట్టాలు ఇచ్చాయని వారికి మాత్రం ఇంత వరకు ప్రభుత్వాలు మారిన ఇండ్ల స్థలాలు మాత్రం చూపించడం లేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు ముందుకు వచ్చి అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు



ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏం.ప్రభు లింగం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ, షాబాద్ మండల కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం, శంకర్పల్లి మండల కార్యదర్శి సుధీర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సుధాకర్ గౌడ్, ఎండి.మక్బూల్, వడ్ల మంజుల, అంజయ్య, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు బాబురావు, శ్రీను, జలీల్, వెంకయ్య, రఘు, మధు, లలిత, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి: సర్పంచ్ బండ లక్ష్మి నరసింహ

**శంకర్‌పల్లి, జూలై 1 (జనం సాక్షి) :** మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో ఏడు రోజులపాటు జరిగే పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల సందర్భంగా మొదటిరోజు అయిన బుధవారం ప్రారంభంతో నిజ జ్యేష్ఠ బహుళవిదియ శ్రీమహా గణాధిపతిపూజ, పుణ్యాహవచనము, గోపూజ, అంకురారోపణము, యాగశాల ప్రవేశము, అఖండ దీపారాధన, కర్కరీ స్థాపనము, స్తంభ పూజ, ధ్వజారోహణము, ఋఋత్విక్ వర్ణనము, మండప స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, వాస్తు, యోగిని, క్షేత్రపాలక సర్వతో భద్రమండల స్థాపన ఆవాహన, జలధివాసము, అయినటువంటి కార్యక్రమాలు పురోహితులు బ్రహ్మశ్రీ లక్ష్మీనారాయణ, వెంకటకృష్ణ పంతులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేయడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బండ లక్ష్మి నరసింహ మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆయిల్‌పామ్ సాగుతోనే రైతులకు సుస్థిర ఆదాయం

• ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**రాజపూర్ , జూలై 1 (జనం సాక్షి) :** రాజపూర్ మండలం గుండ్ల పొట్లంపల్లి గ్రామంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో బుధవారం నాడు మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్ అత్యంత ఘనంగా నిర్వహించబడింది. గ్రామానికి చెందిన ప్రగతిశీల రైతు గోపాల్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జడ్చర్ల శాసనసభ్యులు ముఖ్య అతిథిగా హాజరై, స్వయంగా ఆయిల్ పామ్ మొక్కలను నాటి ఈ బృహత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు సదస్సులో శాసనసభ్యులు మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వ ఉద్యానవన శాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు అందిస్తున్న పథకాలు, రాయితీలను సుదీర్ఘంగా వివరించారు. సంప్రదాయ పంటల సాగుతో నష్టపోతున్న రైతులకు ఆయిల్ పామ్ ఒక అద్భుతమైన ప్రత్యామ్నాయమని, దీని ద్వారా ఎకరాకు ఏడాదికి లక్షన్నర నుండి రెండు లక్షల రూపాయల వరకు నికర ఆదాయం సంపాదించవచ్చని పేర్కొన్నారు. డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ (నీటి పారుదల రాయితీ): ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా లిమైక్రో ఇరిగేషన్ (డ్రిప్) పై 70% నుండి 90% వరకు భారీ సబ్సిడీలి అందిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల నీటి వినియోగం తగ్గడమే కాకుండా ఎరువుల యాజమాన్యం సులువవుతుందని చెప్పారు. మొక్కల సబ్సిడీ నాణ్యమైన ఆయిల్ పామ్ మొక్కలను ప్రభుత్వం సబ్సిడీ ధరలపై రైతులకు అందిస్తోందని, మొదటి నాలుగు సంవత్సరాల పాటు తోటల నిర్వహణ కోసం ఉద్యాన శాఖ ద్వారా అదనపు ప్రోత్సాహకాలు కూడా లభిస్తాయని వివరించారు. దిగుబడి కొనుగోలు మరియు గ్యారెంటీ ఆయిల్ పామ్ గెలల కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి మార్కెట్ ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. ప్రభుత్వ అనుమతి పొందిన కంపెనీలే నేరుగా రైతుల క్షేత్రాల వద్దకే వచ్చి, మద్దతు ధరతో గెలలను కొనుగోలు చేస్తాయని, డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. అనంతరం జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వేణుగోపాల్ పూర్తి సమాచారాన్ని వివరించారు. జడ్చర్ల నియోజకవర్గంలో ఆయిల్ పామ్ సాగును ఉద్యాన శాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, సబ్సిడీల మంజూరు మరియు క్షేత్రస్థాయి పరిశీలనలను తమ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తారని తెలిపారు. ఆసక్తి గల రైతులు ఉద్యానవన శాఖను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మెగా డ్రైవ్‌కు సహకరించిన రైతు గోపాల్ రెడ్డిని మరియు అధికారులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జడ్చర్ల ఉద్యాన శాఖ వ్యవసాయ అధికారి మహేందర్, సర్పంచ్ మాసయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ శేఖర్ గౌడ్, శ్రీనివాస్ నాయక్ , విక్రమ్ రెడ్డి, సుజన్ చంద్రారెడ్డి, శంకరయ్య, వ్యవసాయ అధికారులు, ఉద్యానవన శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌ను పకడ్బందీగా నిర్వహించాలి



**కృష్ణ, జూలై 1 (జనం సాక్షి) :** ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్, రివిజన్ ఎస్ ఐఆర్ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని అదనపు రెవెన్యూ కలెక్టర్ శ్రీను అధికారులను ఆదేశించారు. బుధవారం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని కృష్ణ మండలం, హిందూపూర్ గ్రామంలో పరిశీలించారు. ఈ సందర్భంగా, బిఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో మాట్లాడుతూ అర్హులైన ఓట్లు నమోదు చేయాలని సూచించారు. ఫారాలపంపిణీ ప్రక్రియను నిర్వహిస్తు న్నప్పుడు, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని వారికి సూచించారు. అన్ని ఎస్ఐ అర్ కార్యకలాపాలను ఖచ్చితత్వం, శ్రద్ధతో సకాలంలో, సమయాను కూలంగా పూర్తి చేయడం యొక్క ప్రాముఖ్యతను అదనపు కలెక్టర్ నొక్కిచెప్పారు. తాసిల్దార్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం జూనియర్ అసిస్టెంట్ ప్రమోద్, జి పిఓ తిరుపతి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ లు, తదితరులు పాల్గొన్నారు.

# రెండు నెలల్లో ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియ పూర్తి కావాలి



**గద్వాల నడిగడ్డ, జూలై 1 (జనం సాక్షి) :** ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంను పూర్తిచేసి రైతులకు పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ఆ దిశగా అధికారులు రెండు నెలల్లో ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జిల్లాలోని నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించి ప్రైమరీ డిక్లరేషన్ పూర్తయి అవార్డు స్థాయిలో ఉన్న భూముల వివరాలను అడిగారు. అనంతరం వివిధ మండలాల వారీగా ఆయా గ్రామాల పరిధిలో చేయాల్సిన భూ సేకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రెండు నెలల్లో ప్రాజెక్టుకు అవసరమైన పెండింగ్ భూసేకరణను పూర్తి చేయాలని ఆదేశించినందున అందుకు అనుగుణంగా అధికారులు ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. భూ సేకరణ పై ప్రతి వారం సమీక్ష సమావేశాలు తప్పకుండా నిర్వహిస్తామని, అధికారులు ఎప్పటికప్పుడు పురోగతి సాధిస్తూ కావాల్సిన భూసేకరణ లక్ష్యాలను సాధ్యమైనంత తొందరగా చేరుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ రెవిన్యూ, ఇరిగేషన్, సర్వే అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించుకుని భూసేకరణ విషయంలో పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ఆయా శాఖల అధికారులు ప్రత్యేక టీములుగా ఏర్పడి రోజువారి లక్ష్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పనిచేయాలన్నారు. భూ సేకరణ వేగవంతం కావడానికి అవసరమైతే అదనపు సర్వేయర్లను నియమిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, సర్వే ఏడి నూకరాజు, ఇరిగేషన్ ఈఈలు సంజీవ్ ప్రసాద్, శ్రీనివాసులు, ఆయా మండలాల తహసిల్దార్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తిలో రూ.22 కోట్లతో ఐటీ టవర్‌కు శంకుస్థాపన

• జిల్లా యువతకు స్థానికంగానే ఐటీ ఉద్యోగావకాశాలు
• ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో, జూలై 1 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లా కేంద్ర అభివృద్ధిలో మరో కీలక అడుగు పడింది. జిల్లా కేంద్రంలో రూ.22 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆధునిక ఇంటిగ్రేటెడ్ ఐటీ టవర్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బుధవారం భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వనపర్తి పట్టణాన్ని ఆధునిక నగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. జిల్లాను సాంకేతిక రంగంలో ముందంజలో నిలిపేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఐటీ టవర్ నిర్మాణం పూర్తయితే జిల్లా యువతకు స్థానికంగానే ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఉద్యోగాల కోసం ఇతర నగరాలు లేదా విదేశాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని పేర్కొన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించబడనున్న ఈ ఐటీ టవర్ ద్వారా సాఫ్ట్‌వేర్ కంపెనీలు, స్టార్టప్ సంస్థలు వనపర్తికి ఆకర్షితమవుతాయని, తద్వారా కొత్త పెట్టుబడులు జిల్లాకు వచ్చే అవకాశాలు పెరుగుతాయని ఎమ్మెల్యే తెలిపారు. డిజిటల్ సేవల విస్తరణతో పాటు జిల్లాలో సాంకేతిక ఆధారిత అభివృద్ధికి ఈ టవర్ కీలక కేంద్రంగా మారుతుందని అన్నారు. భవిష్యత్



అవసరాలను దృష్టిలో ఉంచుకొని వనపర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు తాను కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఐటీ టవర్ నిర్మాణానికి రూ.22 కోట్ల నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కదిరే రాములు, కాంగ్రెస్ జిల్లా నాయకులు బ్రహ్మాచారి, బి. కృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, డైరెక్టర్లు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**బెజ్జంకి, జూలై 1 (జనం సాక్షి) :** మండలంలోని తోటపల్లి గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారురాలు గుంటి విజయ (భర్త ఓదెయ్య)కు మంజూరైన ఇంటి నిర్మాణ పనులకు మాజి ఎంపీపీ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ వాస్తు పండితులతో కలిసి ముగ్గు వేసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఒగ్గు దామోదర్ మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తోటపల్లి గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి,సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్,బైరి సంతోష్,ఒంటెల సంపత్ రెడ్డి,రావుల నర్సయ్య,గ్రామశాఖ అధ్యక్షుడు దయ్యాల ఐలేష్,బోయినిపల్లి చంద్రరావు,పంచాయతీ కార్యదర్శి శ్రీను, వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వివక్ష లేని సమసమాజమే లక్ష్యం

**గద్వాల, జూలై 1 (జనంసాక్షి) :** గద్వాల మండలం జిల్లేడుబండ గ్రామంలో నాయబ్ తహసీల్దార్ అజిత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పౌర హక్కుల దినోత్సవం గ్రామీణ ప్రాంతాలలో అంటరానితనం, కుల వివక్ష వంటి సామాజిక జాఢ్యాలను పూర్తిగా నిర్మూలించి, ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కులను అనుభవించాలని గద్వాల మండల నాయబ్ తహసీల్దార్ అజిత్ కుమార్ పిలుపునిచ్చారు. జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం జిల్లేడుబండ గ్రామంలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు నాయబ్ తహసీల్దార్ అజిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ చట్టాలపై అవగాహన, ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టడానికి రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక చట్టాలు, రక్షణల గురించి దళిత సోదరులకు వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సమానులేనని, దళిత వర్గాల హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. గ్రామంలోని దళితులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను నేరుగా



అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, మరియు భూ సమస్యలపై అందిన దరఖాస్తులను పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఆర్థిక, సామాజిక సాధికారత సాధించడానికి విద్యాభ్యాసమే ఏకైక మార్గమని, పిల్లలందరినీ ఉన్నత చదువులు చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లేడుబండ గ్రామ రెవెన్యూ అధికారి, పంచాయతీ కార్యదర్శి, స్థానిక వార్డు సభ్యులు, దళిత సంఘాల ప్రతినిధులు, మరియు గ్రామ పెద్దలతో పాటు కాలనీ మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని కొనసాగించాలి



**కృష్ణ, జూలై 1 (జనం సాక్షి) :** వ్యవసాయ కార్మిక సంఘం సిఐటియు తెలంగాణ రైతు సంఘం అఖిలభారత కమిటీ పిలుపులో భాగంగా కృష్ణ మండల కేంద్రంలో ఎంపీడీవో ఆఫీసు ముందు వివిజి రాంజీ పథకాన్ని రద్దు చేయాలనీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేసి అనంతరం సూపరిటెంట్ రామకృష్ణారెడ్డికు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పుంజనూర్ ఆంజనేయులు, సిఐటియు జిల్లా నాయకులు భరత్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వి బి జి రాంజీ పథకం ద్వారా గ్రామీణ కూలీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మళ్లీ వలసలు పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం భరించే నిధుల శాతం తగ్గడం కారణంగా రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటా చెల్లించుకోలేక కూలీలకు పని దినాలు తగ్గడం అనివార్యంగా మారుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు బోల్లబోడి దేవప్ప మంగళ అశోక్ , తేజ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా యాప్‌ను రద్దు చేయాలి



**సంగారెడ్డి, జూలై 1 (జనం సాక్షి) :** యూరియా యాప్‌ను రద్దు చేయాలని, అప్ తో సమబంధం లేకుండా యూరియా సరఫరా చేయాలని రైతు సంగం జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డి సుందరయ్య భవన్ లో సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ యూరియా యాప్ ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వం ను డిమాండ్ చేశారు.లియూరియా అప్ తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.రైతులకు అవసరమైన యూరియాను వెంటనే సరఫరా చేయాలని అన్నారు. యూరియా అప్ తో సంబంధం లేకుండా యూరియాను సప్లై చేయాలని డిమాండ్ చేశారు. యూరియా అక్రమంగా అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు.అధిక ధరలకు విత్తనాలు ఎరువులు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులందరికీ రైతు భరోసా ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రయత్నం జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్ ఉపాధ్యక్షులు రాజయ్య శ్రీనివాస్ భూషణం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం

• డీఎస్పీ నల్లపు లింగయ్య
• 180 ఇళ్లలో తనిఖీలు పత్రాలు లేని 55
• వాహనాలు సీజ్

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 1 (జనం సాక్షి) :** ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం అని నారాయణపేట డీఎస్పీ లింగయ్య తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడం, నేరాల నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచడం లక్ష్యంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని భీమండి కాలనీలో బుధవారం ఉదయం 6:30 గంటల నుంచి 8:30 గంటల వరకు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించినట్లు డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. ఈ సందర్భంగా మొత్తం 75 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని కాలనీలోని 180 ఇళ్లలో సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని 51 ద్విచక్ర వాహనాలు, 2ఆటోలు, 2 కార్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అదేవిధంగా కాలనీవాసులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో



అవసరమని వివరించారు. కొత్త వ్యక్తులు కాలనీలో నివాసం ఉంటే వారి వివరాలను స్థానిక పోలీసులకు తెలియజేయాలని,అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజల భద్రత కోసం ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అలాగే రోడ్డు భద్రతా నియమాలు,సైబర్ నేరాల నివారణ, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండే విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణ, ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడం కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాములను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు పోలీసులతో సమన్వయంతో పనిచేస్తే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చున్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. కాలనీల్లో అద్దెకు వచ్చే వ్యక్తుల పూర్తి వివరాలను గృహయజమానులు తప్పనిసరిగా స్థానిక పోలీసులకు అందించాలని సూచించారు. అనుమానాస్పద కదలికలు,నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్ల మోసపూరిత ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ తెలియజేయవద్దని ప్రజలకు సూచించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించి వాహనాల సంబంధిత పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ శివ శంకర్, ఎస్ఐ లు ఏ వెంకటేశ్వర్లు, సతీష్ రెడ్డి, నరేష్, కృష్ణ చైతన్య, గాయత్రి, పోలీసు సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వీబీజీ రాంజీ చట్టం రద్దు చేయాలి



**సదాశివపేట, జూలై 1 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వీ బీజీ రాంజీ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. బుధవారం సదాశివపేట మండలంలోని పలు గ్రామాల్లో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొత్త చట్టం వల్ల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వీర్యమవుతుందని, పేదలకు ఉపాధి అవకాశాలు తగ్గుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు 200 రోజుల పని, రోజుకు రూ.800 కూలి, 15 రోజుల్లో వేతనాల చెల్లింపు, పని ప్రదేశాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు శ్రీనివాస్, మల్లేష్, చారి, వేరేశం తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు దృష్టి పెట్టాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ బ్యూరో, జూలై 1(జనంసాక్షి) : రైతులు ఆయిల్ పామ్ పంటల సాగు వైపు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. కలెక్టర్ బుధవారం మామడ మండలం పరిమండల్ గ్రామంలో విస్తృత ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు గబ్బర్ సింగ్ చౌహాన్, బిక్కు నాయక్ చౌహాన్ లకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో అధికారులు, రైతులతో కలిసి ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ, ఆయిల్ పామ్ పంటల ద్వారా రైతులు అధిక లాభాలు పొందగలుగుతారని అన్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఆయిల్ పామ్ పంటలకు మంచి డిమాండ్ ఉందని, రైతులు పండించిన పంటలకు అధికారులు మార్కెట్ కల్పిస్తారని తెలిపారు. ఇప్పటికే ఆయిల్ పామ్ పంటను సాగు చేసి పంటను అమ్ముతున్న రైతులతో మాట్లాడారు. ఆయిల్ పామ్ పంటలకు మంచి లాభాలు వస్తున్నాయని రైతులు తెలిపారు. పంటను అమ్ముకునేందుకు అధికారులు మార్కెటింగ్ అవకాశం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. మరింత మంది రైతులు ఆయిల్ పామ్ పంటలను సాగు చేసేందుకు ముందుకు రావాలని అన్నారు. ఇతర పంటలతో పోల్చుకుంటే ఆయిల్ పామ్ పంటల సాగుకు నీరు కూడా తక్కువ అవసరం అవుతుంది అన్నారు. అంతర పంటగా ఇతర పంటలు సాగు చేసుకోవచ్చునన్నారు. అవసరానికి మించి ఎరువులను వాడరాదని పేర్కొన్నారు. నానో యూరియా వాడకం వైపు అడుగులు వేయాలన్నారు. అధికారులు రైతులను ఆ విధంగా ప్రోత్సహించాలని చెప్పారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న స్థానిక రైతు మాట్లాడుతూ, గ్రామానికి చెందిన ఇతర రైతుల నుంచి స్ఫూర్తిని పొంది, అధికారుల ప్రోత్సాహంతో ఆయిల్ పామ్ పంటను సాగు చేసేందుకు ముందుకు వచ్చామని తెలిపారు. ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తున్న రైతులను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి రమణ, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత




కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 1 (జనంసాక్షి): విద్యార్థులను సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని కెరమెరి మండలం అగర్వాడ గ్రామంలో గ్రామ సర్పంచ్ రోజా సోనాజీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులను సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని అన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు అల్పాహారం, పోషకాలతో కూడిన రుచికరమైన మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి అయిన తర్వాత పై చదువులకు గురుకుల పాఠశాలలకు పంపించాలని, ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని తెలిపారు. ప్రతిరోజు విద్యార్థులు పాఠశాలకు హాజరై 100 శాతం హాజరు నమోదు చేసేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాల ని తెలిపారు. గ్రామ సర్పంచ్ విద్యార్థు లకు నోట్ పుస్తకాలు అందించడం అభినంద నీయమని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామం లో నెలకొన్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి గ్రామానికి వెళ్లే రహదారి, గ్రామంలోని అంతర్గత రహదా రులు, మురుగు కాలువల వ్యవస్థ నిర్మాణానికి, గ్రామంలో రేషన్ షాప్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆడే ప్రకాష్, సర్పంచ్ రోజా సోనాజీ, ఉపాధ్యాయులు, పంచాయితీ పాలక వర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి జూలై 1 (జనంసాక్షి) : ప్రజలతో మమేకమై సేవలు అందించే ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం రాత్రి జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో కలెక్టరేట్ పరిపాలన అధికారిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందుతున్న పిన్న రాజేశ్వర్ దంపతులు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయ డి.ఎ.ఓ.గా పనిచేస్తూ పదవి విరమణ పొందుతున్న పుప్పాల హనుమంతరావు దంపతులను డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా అధికారులతో కలిసి శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ విధులలో నిబద్ధతతో పని చేసి టైపిస్టు నుండి తహసిల్దార్ వరకు 39 సంవత్సరాలు సేవలు అందించారని తెలిపారు. డి.ఎ.ఓ. పుప్పాల హనుమంతరావు 39 సంవత్సరాల పాటు నిరంతరాయంగా సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగి విధులలో చేరిన రోజునే పదవీ విరమణ రోజు కూడా నిర్ణయించడం జరుగుతుందని, ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని, పదవీ విరమణ పొందిన అనంతరం శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.

# శాంతి భద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యం

- ప్రజలందరి సహకారం అవసరం
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా రెడ్డి




వరంగల్ బ్యూరో, జూలై 01 (జనం సాక్షి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని, ఇందుకు ప్రజలందరి సహకారం ఎంతో అవసరమని వరంగల్ నూతన పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా రెడ్డి తెలిపారు. బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమె, ఉదయం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సాయుధ పోలీసులు నూతన కమిషనర్ కు వందనం సమర్పించారు. అనంతరం కమిషనర్బా కార్యాలయంలో వెళ్తున్న మాజీ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ నుంచి నూతన పోలీస్ కమిషనర్ గాఎన్. శ్వేతా రెడ్డి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది నూతన పోలీస్ కమిషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కలు, నోట్ బుక్‌లను సీపీకి అందజేసి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా రెడ్డి మాట్లాడుతూ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు కమిషనరేట్ పరిధిలోని ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది సమన్వయంతో కృషి చేస్తారని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించే విధంగా పోలీసింగ్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తామని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# సర్కారు దవాఖానాలో సేవలు మరింత మెరుగు

- రూ.12 కోట్ల వ్యయంతో అత్యాధునిక ఎంఆర్ఐ యంత్రం ఏర్పాటు
- సీఎం సహకారంతో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): 'భూపాలపల్లి సర్కారు దవాఖానలో సేవలు మరింత మెరుగయ్యేలా చేశాం.. రూ.12 కోట్ల వ్యయంతో అత్యాధునిక ఎంఆర్ఐ యంత్రం ఏర్పాటు చేశాం.. పేద రోగులకు ఇది ఒక వరం.. సీఎం సహకారంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం.. అంటూ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలియజేశారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం రూ.12 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఎంఆర్ఐ యంత్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ యంత్రాన్ని మంగళవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభించగా, బుధవారం జిల్లా ఆసుపత్రిలో అధికారికంగా ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ఇప్పటివరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన పేద, మధ్యతరగతి ప్రజలు ఎంఆర్ఐ పరీక్షల కోసం వేల రూపాయలు ఖర్చు చేసి హైదరాబాద్, వరంగల్‌కు వెళ్లాల్సి వచ్చేదని, ఇకపై ఆ కార్పొరేట్ ఆసుపత్రులు అక్కర్లేదన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఉచితంగా ఎంఆర్ఐ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఇది పేదలకు నిజంగా ఒక వరం అని అన్నారు. జిల్లా ప్రజలు ఇకపై అత్యాధునిక వైద్య సేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, ప్రజలందరూ ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### సీటీ స్కాన్, వెంటిలేటర్ కూడా అందుబాటులో..

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సీటీ స్కాన్, వెంటిలేటర్ వంటి ఆధునిక వైద్య పరికరాలను కూడా ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు వెల్లడించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం ఉంచి, అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి అని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, డి.ఎం.హెచ్.ఓ, వైద్యశాఖ అధికారులు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎస్టీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కోర్టు ద్వారా 40 కేసుల విచారణ

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్..



మహబూబాబాద్ ప్రతినిధి, జూన్ 30 (జనం సాక్షి): మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ సమావేశ మందిరంలో మంగళవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు శ్రీ జాటోత్ హుస్సేన్ నాయక్ అధ్యక్షతన ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక హియరింగ్ నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో కలిసి ప్రత్యేక కోర్టు ద్వారా కేసులను విచారించి, సమస్యల సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజల నుంచి అందిన వినతులు, ఫిర్యాదులను స్వీకరించి మొత్తం 40 కేసులను ప్రత్యేక కోర్టు ద్వారా విచారించామని తెలిపారు. న్యాయమైన కేసులను ఆలస్యం చేయకుండా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని, ఈ విచారణలో అధిక శాతం భూ సంబంధిత సమస్యలే వచ్చినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ, అటవీ, ఎండోమెంట్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఆ హౌసింగ్ పీడీ పురుషోత్తం, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# పెళ్లి పారాలు ఆరకముందే పెళ్లి ఇంట్లో తీవ్ర విషాదం

హనుమకొండ ప్రతినిధి జూలై 1 (జనం సాక్షి) : పెళ్లి పారాలు ఆరకముందే పెళ్లి ఇంట్లో తీవ్ర విషాదం హన్మకొండ జిల్లాలో చోటు చేసుకుంది. వివాహం జరిగిన కేవలం నాలుగు రోజులకే విద్యుత్ షాక్తో నవ వరుడు, అతని తండ్రి ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హసన్పర్తి మండలం భీమారానికి చెందిన సాంబయ్య, రమాదేవి దంపతులకు ముగ్గురు కొడుకులు ఉన్నారు. వీరి చిన్న కుమారుడైన శరత్ కు నాలుగు రోజుల క్రితమే నగరానికి చెందిన ఒక మహిళతో ఘనంగా వివాహమైంది. పెళ్లి వేడుక ముగిసి ఇంట్లో పండగ వాతావరణం ఉండగానే ఈ ఘోరం జరిగింది. ఇంటిపై సామాన్లు సర్దుతున్న క్రమంలో తండ్రీకొడుకులు ఇద్దరికీ అనుకోకుండా కరెంట్ షాక్ తగిలింది. తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరూ మృతి చెందారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నాలుగు రోజుల ముచ్చటైన పెళ్లి ఇంట్లో ఒకేసారి తండ్రీకొడుకులు మరణించడంతో స్థానికంగా తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.

# ఉపాధ్యాయురాలిగా మారిన జిల్లా కలెక్టర్

- గణితం బోధిస్తూ విద్యార్థులకు స్ఫూర్తినిచ్చిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



ఐనవోలు జూలై 1 (జనం సాక్షి): ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యకు చిరునామాగా నిలవాలని, విద్యార్థుల్లో పఠన సామర్థ్యం, గణిత నైపుణ్యాలు, ఆలోచనా శక్తిని పెంపొందించేలా ఉపాధ్యాయులు బోధన సాగించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా ఉపాధ్యాయురాలిగా మారి ఐదో తరగతి విద్యార్థులకు గణిత పాఠ్యాంశాన్ని బోధించారు. ఒక చేత్తో గణిత పాఠ్యపుస్తకాన్ని కలెక్టర్ పట్టుకొని మరో చేతితో చాక్ పీస్ చేత పట్టి బ్లాక్‌బోర్డుపై స్వయంగా లెక్కలు రాసి విద్యార్థులతో గణితం లెక్కను సాధింపజేయడంతో పాటు వారి అవగాహన, ప్రతిభ, నేర్చుకునే సామర్థ్యాన్ని పరిశీలించారు. పాఠశాల సందర్శనకు వచ్చి తరగతి గదులు పరిశీలిస్తూ వచ్చిన కలెక్టర్ ఐదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ స్వయంగా బోధించడం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. కలెక్టర్ ఉపాధ్యాయురాలుగా మారి పాఠశాల విద్యార్థులకు విద్యా బోధన సాగించడం పాఠశాల ఉపాధ్యాయులకు సైతం స్ఫూర్తినిచ్చింది. విద్యార్థులకు గణిత పాఠ్యాంశాన్ని బోధిస్తూ ఎంతవరకు అర్థం చేసుకున్నారనే వివరాలను అడుగుతూ కలెక్టర్ ముందుకుసాగారు. స్వయంగా జిల్లా కలెక్టర్ గణిత పాఠ్యాంశాన్ని సులువుగా అర్థమయ్యేట్టు బోధించడంతో పాఠశాల విద్యార్థులు సంబరపడ్డారు. పాఠశాలలోని తరగతి గదులు, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనశాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి వారి తల్లులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న గుడ్లు, బాలామృతం పంపిణీని పరిశీలించి లబ్ధిదారులకు అందజేశారు. ప్రీ-స్కూల్ విద్యా బోధనను పరిశీలించి చిన్నారుల్లో ప్రాథమిక అభ్యాస నైపుణ్యాలు పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వనమహోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని డంపింగ్ యార్డ్, గ్రామపంచాయతీ కార్యాలయంలోని నర్సరీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చింతకుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ సమర్థ నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాంభూపాల్, జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, జిల్లా శిశు సంక్షేమ అధికారి విశ్వజ, తహసీల్దార్ విక్రమ్ కుమార్ , ఎంపీడీవో నర్మద, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పోలీస్ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్



హనుమకొండ ప్రతినిధి జులై,1 (జనంసాక్షి) : వరంగల్ పోలీస్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎన్. శ్వేతను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ బుధవారం జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖతో సమన్వయంతో పనిచేయడానికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.

# దేశానికే ఆదర్శంగా తెలంగాణ సంక్షేమ పథకాలు

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్ ఘన్‌పూర్, జూలై 01 (జనంసాక్షి) : పేద ప్రజల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ దేశంలో ఎక్కడ లేనటువంటి సంక్షేమ పథ కాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘన పూర్ పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కల్యాణలక్ష్మి చెక్కుల ను, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి లబ్ధిదారులకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు,నాయకులు,కార్యకర్తలు,లబ్ధిదారుల ు తదితరులు పాల్గొన్నారు.

# భవిత కేంద్రంతోపాటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

- జిల్లా కలెక్టర్ డా. సత్య శారద



ఖానాపురం, జూలై 1 (జనం సాక్షి): ఖానాపూర్ మండలం అశోక్‌నగర్, మనబోతుల తండాలోనీ జిల్లా పరిషత్ ,ప్రైమరీ,అంగన్వాడి కేంద్రాలను జిల్లా కలెక్టర్ డా. సత్య శారద సంబంధిత శాఖల అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ప్రత్యేక అవసరాలు గల పిల్లల కేంద్రాన్ని అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అశోక్ నగర్ అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన కలెక్టర్, దీనిపై సంబంధిత జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి (డీడబ్ల్యూఓ) వివరణ ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, మెనూ ప్రకారమే నాణ్యమైన భోజనం అందించాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. అనంతరం పిల్లలతో కలిసి జిల్లా కలెక్టర్ భోజనం చేసి విద్యాబోధన, మధ్యాహ్న భోజనం నాణ్యత, ప్రతిరోజూ అందుతున్న ఆహారంపై విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మరుగుదొడ్ల సమస్య పై ఉన్నట్లు ఇంచార్జ్ ప్రిన్సిపాల్ కలెక్టర్ గారి దృష్టికి తీసుకురాగా, అట్టి సమస్య పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలు, నివేదికలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందించాలని, పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. మనుబోతుల తండా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు బెంచీల కొరతను గమనించిన కలెక్టర్, కేజీబీవీలలో అందుబాటులో ఉన్న బెంచీలను వెంటనే ఇక్కడికి తరలించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. మనుబోతుల తండా మహిళలు ఆర్టీసీ బస్సు కావాలని జిల్లా కలెక్టర్ గారిని కోరగా అందుకు జిల్లా కలెక్టర్ అనుకూలంగా స్పందించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, ఖానాపూర్ తాసిల్దార్ శ్రీనివాస్ డీఎస్ఓ శ్రీనివాస్ స్కూల్ ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

## రామస్వామిగుట్ట వద్ద ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**హుజూర్ నగర్, జూలై 1 (జనంసాక్షి) :** హుజూర్ నగర్ పరిధిలోని రామస్వామి గుట్టవద్ద 110 ఎకరాలలో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని, ఎలక్ట్రిసిటీ, స్ట్రీట్ లైట్, గ్రీనరీ, త్రాగునీరు, పైలాన్ స్తూపం, సభాస్థలి పరిశీలించి మిగిలి పోయిన పనులను త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని, గ్రీనరీలో నాటిన మొక్కలకు నీరు అందించి మొక్కలు ఎండిపోకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, హార్టికల్చర్ పిడి నాగయ్య, మిషన్ భగీరథ ఈ ఈ అరుణాకర్ రెడ్డి, తహసీల్దార్ కవిత, సంబంధిత శాఖల అధికారులు, గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.

# 11 ఏళ్లుగా ఉద్యోగ నోటిఫికేషన్ కోసం ఎదురుచూపులు

- డీఎంపీహెచ్‌ఏ నిరుద్యోగుల ఆవేదన
- 2014లో కోర్సు పూర్తి చేసిన వేలాది మంది అభ్యర్థుల నిరీక్షణ
- ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో ఖాళీలు భర్తీ చేయాలని విజ్ఞప్తి
- ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వానికి డిమాండ్




**సదాశివనగర్, జూలై 1 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దాదాపు 12 ఏళ్లు పూర్తవుతున్నప్పటికీ, 2014లో డీఎంపీహెచ్‌ఏ (డిప్లొమా ఇన్ మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్) కోర్సు పూర్తి చేసిన వేలాది మంది అభ్యర్థులు ఇప్పటికీ ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆరోగ్యశాఖలో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఆశించినా, ఇప్పటి వరకు డీఎంపీహెచ్‌ఏ అర్హతకు ప్రత్యేక నియామక నోటిఫికేషన్ విడుదల కాలేదని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత అయినా తమకు న్యాయం జరుగుతుందని ఆశించినప్పటికీ, నియామకాలపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడంతో తీవ్ర నిరాశ నెలకొందని అభ్యర్థులు తెలిపారు. ఉద్యోగాల కోసం ఎన్నో సంవత్సరాలుగా సిద్ధమవుతూ ఎదురుచూస్తున్న తమ భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎంపీహెచ్‌ఏ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), సబ్ సెంటర్లు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, తల్లి--శిశు సంక్షేమ కార్యక్రమాలు, టీకా కార్యక్రమాలు, అంటువ్యాధుల నియంత్రణ, గ్రామీణ ప్రజారోగ్య సేవలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాల్లో సేవలందించేందుకు శిక్షణ పొందినవారమని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో తమ పాత్ర కీలకమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో ఆలస్యం జరుగుతోందని అభ్యర్థులు ఆరోపించారు. ఈ పోస్టులను వెంటనే భర్తీ చేస్తే ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని అభిప్రాయపడ్డారు. 11 ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుండటంతో అనేక మంది అభ్యర్థులు వయోపరిమితికి చేరువవుతున్నారని, కొందరు ఇప్పటికే వయోపరిమితి సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కుటుంబ బాధ్యతలు, నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నామని వాపోయారు. ప్రభుత్వ ఉద్యోగంపై ఆశతో ఇతర అవకాశాలను కూడా వదులుకున్నామని కొందరు అభ్యర్థులు పేర్కొన్నారు. డీఎంపీహెచ్‌ఏ నిరుద్యోగుల సంఘాలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జిల్లాల వారీగా ఖాళీల వివరాలను ప్రకటించి, ప్రత్యేక నియామక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. నియామకాలను పారదర్శకంగా నిర్వహించి అర్హులైన ప్రతి అభ్యర్థికి అవకాశం కల్పించాలని, అవసరమైతే వయోపరిమితిలో సడలింపు ఇవ్వాలని కోరుతున్నాయి. ఆరోగ్య రంగంలో సిబ్బంది కొరతను తగ్గించి, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్య సేవలను బలోపేతం చేయడానికి డీఎంపీహెచ్‌ఏ అర్హత కలిగిన అభ్యర్థుల సేవలను వినియోగించుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి డీఎంపీహెచ్‌ఏ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగం మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న డీఎంపీహెచ్‌ఏ పోస్టులను గుర్తించి ప్రత్యేక ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అభ్యర్థుల అర్హత, శిక్షణ, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని నియామక ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని కోరారు.

# మహిళా సంఘాల సభ్యులకు సమగ్ర ఆరోగ్య సేవలు అందించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి కరస్పాండెంట్, జూలై 1 (జనం సాక్షి) :** మహిళా సంఘాల సభ్యులకు సమగ్ర ఆరోగ్య సేవలు అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్ లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా వైద్య అధికారి మనోహర్, రాష్ట్రస్థాయి అధికారులు మరియు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో మొత్తం 1,94,493 మంది స్వయం సహాయక మహిళా సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులు ఉన్నారని వారందరికీ దశలవారీగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మూడు నెలల వ్యవధిలో పూర్తి చేసేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మహిళకు 30 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో రక్తంలో చక్కెర పరీక్ష, సీరం బిలిరుబిన్, సీరం క్రియాటినిన్, బ్లడ్ యూరియా, ఎస్‌జీపీటీ, ఎస్‌జీఓటీ, సీరం ఆల్కలైన్ ఫాస్ఫటేస్, సీరం టోటల్ ప్రోటీన్, సీరం ఆల్బుమిన్ వంటి 10 బయోకెమిస్ట్రీ పరీక్షలు, థైరాయిడ్ పనితీరును అంచనా వేసే టీఎస్‌హెచ్ పరీక్షతో పాటు



హిమోగ్లోబిన్, తెల్ల రక్తకణాల సంఖ్య, ప్లేట్‌లెట్ కౌంట్, ఎర్ర రక్తకణాల సంఖ్య తదితర 7 హీమటాలజీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదనంగా రక్తగ్రూప్, ఎత్తు, బరువు, బాడీ మాస్ ఇండెక్స్ (దీవీ×), రక్తపోటు, వైకల్య నిర్ధారణ, శరీర ఉష్ణోగ్రత, గుండె స్పందన రేటు, శ్వాస రేటు, కంటి పరీక్ష, నోటి పరీక్ష, చర్మం మరియు గోళ్ల పరీక్షలు వంటి 12 స్పోక్ స్థాయి ఆరోగ్య పరీక్షలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల ద్వారా మహిళల్లో వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లాలో అందుబాటులో ఉన్న ల్యాబ్ మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు, మానవ వనరులు, రీ-ఏజెంట్లు మరియు ఇతర అవసరమైన సామగ్రిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. అవసరమైన చోట ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను నిబంధనల ప్రకారం భర్తీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళా సంఘాల సభ్యుల ఆరోగ్య పరీక్షలు, నమూనాల సేకరణ, డేటా నమోదు, ఫాలోఅప్ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో పాటు మేప్మా, మున్సిపల్ శాఖ మరియు డీఆర్‌డీఏ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పోచంపల్లి, షరాజీపేట్ మరియు బీబీనగర్ ను మాస్టర్ ట్రైనర్ కేంద్రాలుగా గుర్తించి, అక్కడ శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్ల ద్వారా మిగిలిన ఆరోగ్య సిబ్బందికి శిక్షణ అందించి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్య స్థితిపై సమగ్ర ఆరోగ్య ప్రొఫైల్ రూపొందించడంతో పాటు, వ్యాధులను ముందస్తుగా గుర్తించి సకాలంలో చికిత్స అందించడం ద్వారా మహిళల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, డీసీహెచ్‌ఎస్, ఆర్‌ఎంఓలు, వైద్యులు, టీ-హబ్ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సహకార వ్యవస్థ బలోపేతానికి అందరూ కృషి చేయాలి

**జహీరాబాద్, జూలై 1 (జనం సాక్షి) :** సహకార వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు జరా సంఘం మండలం ఏడాకులపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో రైతులు, సభ్యుల కోసం అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా సహకార అధికారి ఆర్. కిరణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతుల ఆర్థికాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా రైతులకు అందిస్తున్న రుణాలు, ఎరువులు, విత్తనాలు, ఇతర సేవలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సభ్యుల భాగస్వామ్యంతోనే సహకార సంఘాలు మరింత బలోపేతం అవుతాయని, రైతు సంక్షేమమే సహకార వ్యవస్థ ప్రధాన లక్ష్యమని అన్నారు. సహకార శాఖ అధికారులు రైతులకు సభ్యత్వం, రుణాల సక్రమ వినియోగం, పొదుపు అలవాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సహకార సంఘాల ద్వారా అందుతున్న సేవలపై అవగాహన కల్పించారు. రైతులు అడిగిన సందేహాలకు సమాధానాలు ఇచ్చి, సహకార సంఘాల అభివృద్ధికి ప్రతి సభ్యుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఎం. శివకుమార్, వైస్ చైర్మన్ కాంతమ్మ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి. వినయ్ కుమార్, పోముసింగ్, సహకార శాఖ అధికారులు కిరణ్మయి, శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్లు, బ్రాంచ్ మేనేజర్ రాజు, ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మణ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, రైతులు, సొసైటీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు సమన్వయంతో పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం కార్పొరేషన్, జూలై 1 (జనం సాక్షి) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) కార్యక్రమంలో క్షేత్ర స్థాయిలో బూత్ లెవల్ ఏజెంట్ లు పాల్గొనాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి ఎస్‌ఐఆర్ కార్యక్రమంలో రానున్న 15 రోజులు కీలకమని, ప్రక్రియ విజయవంతానికి సహకరించాలని అన్నారు. ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, వాటిని పూరించిన పిదప తిరిగి స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ చేపడుతున్నామని తెలిపారు. ఈ దశలో బూత్ లెవల్ ఏజంట్ లు ఓటరు ఎన్యుమరేషన్ ఫారాలు పూర్తి చేసి, బూత్ స్థాయి అధికారులకు అందజేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 95.78 శాతం పూర్తయినట్లు, డిజిటలైజేషన్ ప్రక్రియ చేపడుతునట్లు కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏ) క్రీయాశీలకంగా ఉండి, వివరాల సేకరణలో సహకరించాలన్నారు. ముసాయిదా ఓటరు జాబితాలో ఎవరి పేరు లేకపోయినా తప్పనిసరిగా అభ్యంతరం నమోదు చేయాలని, అభ్యంతరం నమోదు చేయకపోతే ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి అర్హమైన ఓటరు ఓటు హక్కు కొనసాగేందుకు రాజకీయ పార్టీలు ఎన్నికల యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్డీసి సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిటి అన్సారీ, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి నూతి సత్యనారాయణ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, బిజెపి పార్టీ ప్రతినిధులు భూక్యా శ్యామసుందర్ నాయక్, వి. రాజేష్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు బెల్లం వేణుగోపాల్, కె. వెంకట్ రావు, మంకెన రమేష్, కోడిరెక్క ఉమాశంకర్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పి. నర్సింహారావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణ ప్రసాద్, సిపిఐ ఎం పార్టీ ప్రతినిధులు నెల్లూరి వీరబాబు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరావు



**ఎర్రుపాలెం, జూలై 1 (జనంసాక్షి) :** తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన ఖమ్మం జిల్లా ఎరుపాలెం మండలం జమలాపురం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం జమలాపురం నందు జీర్ణోదరణ, ధ్వజ ప్రతిష్ట సహిత మహా కుంభాభిషేకం కార్యక్రమములో భాగంగా బుధవారం ప్రాత:కాల పూజలు, అనుష్టానములు, హోమములు అనంతరం నూతన ధ్వజములకు బింబశుద్ధి అధివాసములు నిర్వహించడం జరిగినది. స్వామివారిని వ్యవసాయ శాఖమంత్రి,తుమ్మల నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్, స్వామివారిని దర్శించుకున్నారు. వారిని ఆలయ కార్య నిర్వహణ అధికారి, అర్చకులు ఆలయ సాంప్రదాయం ప్రకారం ఆహ్వానం పలికి ప్రత్యేకపూజలు నిర్వహించి శేష వస్త్రములతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆలయ పూజారులు,వకుళ మాత స్టేడియం నిర్మాణదాత తుళ్లూరు కోటేశ్వరరావు, స్థానిక సర్పంచ్ తుళ్లూరు.నిర్మల, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, వేజెండ్ల.సాయికుమార్, జిల్లా గ్రంథాలయం,చైర్మన్, ఖాదర్ బాబా,ఏఎంసీ,చైర్మన్,బండారు.నరసింహారావు, సీనియర్ నాయకులు చావా.రామకృష్ణ, ఐలూరి.వెంకటేశ్వర రెడ్డి, గ్రామస్తులు భక్తులు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## సింగరేణి హెడ్ ఆఫీస్ ముట్టడితో మార్మోగిన కొత్తగూడెం

- 12వ వేజ్ బోర్డు ఏర్పాటు, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని జేఏసీ డిమాండ్




**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 1 (జనం సాక్షి) :** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జేఏసీ (ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్) ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం హెడ్ ఆఫీస్ వద్ద నిర్వహించిన మహా ధర్నా, ముట్టడి కార్యక్రమం విజయవంతమైంది. సింగరేణి అన్ని ఏరియాల నుంచి వేలాది మంది కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు హాజరై ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, కార్మికుల సహనాన్ని బలహీనతగా భావిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. దేశ సంపదను సృష్టిస్తున్న కార్మికులకు రావాల్సిన హక్కులను కేంద్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. వెంటనే 12వ వేజ్ బోర్డును ఏర్పాటు చేసి వేతన సవరణ పూర్తి చేయాలని, అలాగే కార్మిక హక్కులను దెబ్బతీసే నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా కార్మిక ఉద్యమాలు మరింత ఉధృతం అవుతాయని స్పష్టం చేశారు. అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల శ్రమతో కోట్లాది రూపాయల లాభాలు ఆర్జిస్తున్న యాజమాన్యం, కార్మికులకు రావాల్సిన హక్కులను నిరాకరించడం అన్యాయమన్నారు. 12వ వేజ్ బోర్డు ఏర్పాటు విషయంలో జాప్యాన్ని వెంటనే తొలగించాలని, నాలుగు లేబర్ కోడ్స్ ద్వారా శ్రమ చట్టాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను కార్మిక ఉద్యమం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని హెచ్చరించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమం కొనసాగుతుందని, అవసరమైతే సమ్మెలు, ముట్టడులు, నిరవధిక ఆందోళనలు చేపడతామని నాయకులు ప్రకటించారు. సింగరేణి చరిత్రలో కార్మికులకు లభించిన ప్రతి హక్కు ఉద్యమాల ద్వారానే సాధ్యమైందని గుర్తు చేస్తూ, ఈసారి కూడా ఐక్య పోరాటంతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె. సారయ్య, వీరభద్రయ్య, వై.వి. రావు, ముస్కే సమ్మయ్య, వంగ వెంకట్, బ్రాంచ్ కార్యదర్శులు మల్లికార్జున్, రమణమూర్తి, నజీర్, మేకల ఈశ్వర్, సుధాకర్, గట్టయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు జనక్ ప్రసాద్, త్యాగరాజన్, లక్ష్మారెడ్డి, ఆల్బర్ట్, పీతంబరం, రజాక్, సీఐటీయూ నాయకులు మంద నర్సింహారావు, రాజిరెడ్డి, విజయగిరి శ్రీనివాస్, హెచ్ఎంఎస్ నాయకులు కృష్ణ ప్రసాద్, ఆంజనేయులు, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో కార్మికులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తెలుగు రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్ అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- పోలీసులపై దాడి..
- ఆత్మరక్షణలో కాల్పులు..
- ప్రధాన నిందితుడికి కాలికి గాయం.
- నల్లగొండ పోలీసుల సాహసం

**నల్లగొండ ప్రతినిధి, జూలై 1 (జనం సాక్షి) :** తెలుగు రాష్ట్రాల్లో వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాలుగా మారిన మోస్ట్ వాంటెడ్ అంతర్రాష్ట్ర దొంగల ముఠాను నల్గొండ జిల్లా పోలీసులు సాహసోపేతంగా అరెస్టు చేశారు. నిందితుడిని పట్టుకునే క్రమంలో అతడు ఇనుప రాడ్, కత్తితో పోలీసులపై దాడి చేయడంతో ఓ హెడ్ కానిస్టేబుల్ గాయపడ్డారు. దీంతో ఆత్మరక్షణలో భాగంగా పోలీసులు ముందుగా మూడు రౌండ్లు గాలిలో హెచ్చరిక కాల్పులు జరిపి, అనంతరం నిందితుడి కాళ్లపై కాల్పులు జరిపి అదుపులోకి తీసుకున్నారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు. జిల్లాలో ఇటీవల వరుస చోరీలు జరుగుతుండటంతో ఎస్పీ ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. జితేందర్ రెడ్డి, మిర్యాలగూడ రూరల్ ఇన్‌స్పెక్టర్ పి.ఎన్.డి. ప్రసాద్ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో




విస్తృతంగా దర్యాప్తు చేపట్టి, వందలాది సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా ఈ చోరీలకు భూస్మి శ్రీకాంత్ అలియాస్ అమ్మిరాజు ముఠా పాల్పడుతున్నట్లు గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు జూన్ 30న ఔటర్ రింగ్ రోడ్ వద్ద పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. నాగార్జునసాగర్ నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న డీసీఎం వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించగా, ప్రధాన నిందితుడు వాహనం నుంచి దూకి సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన్ గిరిపై ఇనుప రాడ్‌తో దాడి చేశాడు. హెచ్చరిక కాల్పులు చేసినప్పటికీ దాడిని కొనసాగించడంతో నిందితుడి కాళ్లపై కాల్పులు జరిపి అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన నిందితుడిని వనస్థలిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక కేసు నమోదు చేశారు. పోలీసులు ప్రధాన నిందితుడు భూస్మి శ్రీకాంత్ అలియాస్ అమ్మిరాజు తో పాటు వేల్పుల అతేంద్ర అలియాస్ అత్తిలి ని అరెస్టు చేశారు. విచారణలో ఈ ముఠా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అనేక చోరీలకు పాల్పడినట్లు అంగీకరించింది. ప్రధాన నిందితుడు శ్రీకాంత్‌పై గతంలోనే 30కి పైగా కేసులు నమోదుకాగా, జైలు నుంచి విడుదలైన తర్వాత మరో 40కి పైగా చోరీలకు పాల్పడినట్లు విచారణలో ఒప్పుకున్నాడని ఎస్పీ తెలిపారు. అతనిపై గతంలో కానిస్టేబుల్ హత్య కేసు కూడా నమోదైందన్నారు. నల్లగొండ జిల్లాలో ఎనిమిది కేసుల్లో అతడిని నిందితుడిగా గుర్తించగా,మొత్తం 10 నేరస్థలాల్లో అతని వేలిముద్రలను పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదకర నిందితుడిని ప్రాణాలకు తెగించి పట్టుకున్న సీసీఎస్, మిర్యాలగూడ రూరల్ పోలీసు బృందాలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేకంగా అభినందించారు. వారికి నగదు బహుమతులు,ప్రశంసాపత్రాలు ప్రకటించారు.

## ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, జూలై 1 (జనంసాక్షి) :** ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ (వీబీజీ రామ్ జీ) పథకం కింద చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి డ్రైనేజీల శుభ్రపరిచే పనులు, డీ-సిల్టింగ్, చెత్త తొలగింపును నిరంతరం నిర్వహించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని, డెంగ్యూ, మలేరియా అనుమానిత కేసులపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. ఎన్‌ఎఫ్‌బీఎస్ పథకం కింద అర్హులైన లబ్ధిదారులను గుర్తించి త్వరితగతిన ప్రయోజనం కల్పించాలని, ముఖ్యంగా మున్సిపాలిటీల్లో ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అవెన్యూ ప్లాంటేషన్, రహదారుల నిర్మాణం, నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయడంతో పాటు అన్ని గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో గుడిసెల్లో నివసించే అర్హులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.




## ఏడాది వ్యాలిడిటీతో వొడాఫోన్ ఐడియా కొత్త ప్రీపెయిడ్ ప్లాన్




**న్యూఢిల్లీ:**ప్రముఖ టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా సరికొత్త ప్రీపెయిడ్ ప్లాన్‌తో ముందుకొచ్చింది. రూ.4600తో వార్షిక ప్రీపెయిడ్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. అపరిమిత కాల్స్, డేటాతో దేశవ్యాప్తంగా ఉన్న 4జీ, 5జీ యూజర్లకు ఈ ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం కొన్ని సర్కిళ్లలోనే అందుబాటులో ఉంది. త్వరలో అన్ని సర్కిళ్లకూ విస్తరించనుంది.ఈ ప్లాన్ 365 రోజుల వ్యాలిడిటీతో వస్తోంది. రోజూ అపరిమిత డేటా, అన్‌లిమిటెడ్ కాల్స్ లభిస్తాయి. రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి. వ్యక్తిగత, నాన్ కమర్షియల్ ఉపయోగానికి మాత్రమే ఈ ప్లాన్‌ను తీసుకొచ్చింది. 5జీ నెట్‌వర్క్ కవరేజీ ఉన్న ప్రాంతంలో 5జీ అపరిమిత డేటా లభిస్తుంది. అపరిమిత డేటాపై రోజువారీ పరిమితి లేకపోయినప్పటికీ.. 28 రోజులకు గరిష్ఠంగా 300 జీబీ వరకు మాత్రమే డేటా వినియోగించుకోవచ్చు. పరిమితి మించాక వేగం నెమ్మదిస్తుంది. రోజుకు రూ.12.6 చొప్పున ఖర్చు అవుతుంది. వార్షిక ప్లాన్‌తో పాటు 6 నెలల వ్యాలిడిటీతో మరో ప్లాన్‌నూ వొడాఫోన్ ఐడియా తీసుకొచ్చింది. 180 రోజుల వ్యాలిడిటీతో రూ. 2,475 ప్రీపెయిడ్ ప్లాన్‌ను లాంచ్ చేసింది. ఈ ప్లాన్‌లోనూ అపరిమిత డేటా, అపరిమిత కాల్స్ అందిస్తుంది. రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి. వార్షిక ప్లాన్ మాదిరిగానే డేటా పరిమితి నిబంధనలు వర్తిస్తాయి.

# రెండు రోజుల నష్టాలకు బ్రేక్

### లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి మిశ్రమ సంకేతాలు, క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడంతో మన మార్కెట్‌లో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ, రియాల్టీ, బ్యాంక్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దీంతో స్టాక్ మార్కెట్‌లో రెండు రోజుల నష్టాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ 443 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 162 పాయింట్ల పైకి చేరింది. సెన్సెక్స్ ఉదయం 76,545.21 పాయింట్లు (క్రితం ముగింపు 76,478.67) వద్ద స్వల్ప లాభాలతో ప్రారంభమైంది. రోజంతా సూచీలు లాభాల్లోనే కదలాడాయి. ఇంట్రాడేలో 77,110.08 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి సెన్సెక్స్ 443.97 లాభంతో 76,922.64 వద్ద ముగిసింది. నిఫ్టీ 140.10 పాయింట్ల లాభంతో 24,005.85 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నెల్, ఏషియన్ పెయింట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి. హెచ్‌సీఎల్, టెక్ మహీంద్రా, టీసీఎస్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టీ షేర్లు నష్టాలు చవిచూశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 95.23గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.34 డాలర్లుగా ఉండగా.. బంగారం ఔన్సు 3,987 డాలర్ల వద్ద కొనసాగుతోంది.అంతకుముందు ఐటీ, చమురు-గ్యాస్, కొన్ని బ్యాంకింగ్ షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తడంతో దేశీయ సూచీలు నష్టపోయాయి. అమెరికా- ఇరాన్ చర్చలపై అనిశ్చితి ఇందుకు కారణమైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 5 పైసలు తగ్గి 94.56 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.25% తగ్గి 72.97 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో హాంకాంగ్ నష్టపోగా, మిగతావి లాభపడ్డాయి. ఐరోపా సూచీలు




లాభాల్లో ట్రేడయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.40,000 కోట్లు పెరిగి రూ.474.09 లక్షల కోట్ల (5.01 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 277 పాయింట్ల (క్రితం ముగింపు 76,728.37) లాభంతో 77,005.51 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజులో ఎక్కువ భాగం నష్టాల్లోనే కదలాడిన సూచీ, ఇంట్రాడేలో 76,329.39 వద్ద కనిష్ఠాన్ని నమోదుచేసింది. చివరకు 249.70 పాయింట్ల నష్టంతో 76,478.67 వద్ద ముగిసింది. నిఫ్టీ 80.50 పాయింట్లు కోల్పోయి 23,865.75 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 23,829.20-24,035.55 పాయింట్ల మధ్య కదలాడింది. ఈవీ షేర్ల పరుగులు: దిల్లీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక విద్యుత్ వాహన (ఈవీ) విధానాన్ని ప్రకటించడంతో విద్యుత్ వాహన తయారీ కంపెనీల షేర్లు మెరిశాయి. ఓలా ఎలక్ట్రిక్ 8.34%, ఏథర్ ఎనర్జీ 5.39% లాభపడ్డాయి. సెన్సెక్స్ 30 షేర్లలో 20 డీలాపడ్డాయి. ఇన్ఫోసిస్ 3.49%, టీసీఎస్ 3%, హెచ్‌సీఎల్ టెక్ 2.82%, టెక్ మహీంద్రా 2.08%, హెచ్‌యూఎల్ 1.50%, ఐటీసీ 1.31%, ఎస్‌బీఐ 0.90% నష్టపోయాయి. మారుతీ 5.14%, టైటన్ 2.93%, బజాజ్ ఫైనాన్స్ 2.22%, ఎటర్నల్ 2.06%, అదానీ పోర్ట్స్ 1.89%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.31% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. ఫోకస్డ్ ఐటీ 2.62%, ఐటీ 2.48%, పీఎస్‌యూ బ్యాంక్ 0.68%, బ్యాంకింగ్ 0.25% పడ్డాయి. స్థిరాస్తి, సేవలు, మన్నికైన వినిమయ వస్తువులు, ఆరోగ్య సంరక్షణ, యంత్ర పరికరాలు రాణించాయి బీఎస్ఈలో 1998 షేర్లు నష్టపోగా, 2248 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 182 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

ఐపీఓ సమాచారం

ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేందుకు సెబీ వద్ద డిజిటల్ రుణాల ప్లాట్‌ఫామ్ ఫైబ్ మాతృసంస్థ సోషల్‌వర్త్ టెక్నాలజీస్ ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా రూ.750 కోట్ల తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో 4 కోట్ల వరకు షేర్లను ప్రస్తుత వాటాదార్లు విక్రయించనున్నారు.ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేందుకు స్టాల్‌వార్ట్ పీపుల్ సర్వీసెస్, సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఇష్యూలో భాగంగా రూ.150 కోట్ల తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో 52,64,151 షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు.ఐపీఓ ద్వారా నిధుల సమీకరణకు మన్ ఫ్లీట్ పార్టనర్స్ ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా 60.12 లక్షల తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో 19.10 లక్షల షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు.

## జూన్ నెలలో 14 శాతం పెరిగిన జీఎస్టీ వసూళ్లు

దేశంలో వస్తు, సేవల పన్ను వసూళ్ల వివరాలను బుధవారం కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసింది. జూన్ నెలలో రూ.1.95 లక్షల కోట్ల మేర జీఎస్టీ వసూలైంది. గతేడాది ఇదే నెలతో పోలిస్తే 14 శాతం వృద్ధి నమోదైంది. దేశీయ లావాదేవీలతో వసూలైన వస్తుసేవల పన్ను మొత్తం రూ.1.35 లక్షల కోట్లుగా ఉంది. అదే సమయంలో దిగుమతులపై వసూళ్లు 34.6 శాతం పెరిగి, రూ.60వేల కోట్లకు చేరాయి. జూన్ నెలకు రీఫండ్ల విలువ రూ.32,436 కోట్లు కాగా.. దానిని సర్దుబాటు చేసిన తర్వాత నికర జీఎస్టీ వసూళ్లు రూ.1.62 లక్షల కోట్లుగా ఉన్నాయి.జూన్ నెలలో తెలంగాణకు స్థూలంగా రూ.5,050 కోట్ల జీఎస్టీ వసూళ్లు రాగా.. ఆంధ్రప్రదేశ్‌కు రూ.3,548 కోట్లు వచ్చాయి. తెలంగాణలో గతేడాది ఇదే నెలతో పోలిస్తే 11 శాతం వృద్ధి నమోదు చేయగా.. ఏపీ వసూళ్లలో ఐదు శాతం వృద్ధి నమోదైంది. సర్దుబాటు అనంతరం తెలంగాణ నికర జీఎస్టీ ఆదాయం రూ.3,994 కోట్లు కాగా.. ఆంధ్రప్రదేశ్ నికర ఆదాయం రూ.3,144 కోట్లు.







## చిక్కుల్లో వాట్సాప్..

### యూజర్ నేమ్‌పై కేంద్రం నజర్

**న్యూఢిల్లీ:**ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సప్ తీసుకొస్తున్న యూజర్‌నేమ్ సదుపాయంపై ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ప్రము ఖుల పేర్లతో మోసాలకు పాల్పడే అవకాశం ఉందని, దుర్వినియోగానికి ఈ ఫీచర్ వీలు కల్పిస్తోందన్న ఆందోళనల నేపథ్యంలో దీనిపై దృష్టి సారించింది. వాట్సప్ తీసుకొస్తున్న కొత్త ఫీచర్‌ను కేంద్రం పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆన్‌లైన్ మోసాలు, వినియోగదారుల భద్రత కోణంలో సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నాయి. ఏదైనా ముప్పు పొంచి ఉందని తేలితే మెటాకు నోటీసు జారీ చేసే అవకాశముందని తెలిపాయి. జాతీయ భద్రత విషయంలో రాజీపడేది లేదని కేంద్రం స్పష్టంచేసినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

ఏమిటీ యూజర్ నేమ్ ఫీచర్

ఫోన్ నంబర్ ప్రైవసీని కాపాడుతూ యూజర్ నేమ్ ఆప్షన్‌ను వాట్సప్ తీసుకొస్తోంది. దీనివల్ల యూజర్లు ఫోన్ నంబరును షేర్ చేయాల్సిన అవసరం ఉండదు. కేవలం యూజర్ నేమ్‌ద్వారా సంభాషణలను జరపవచ్చు. ప్రస్తుతం యూజర్ నేమ్‌ను రిజర్వు చేసుకునేందుకు వాట్సప్ అనుమతిస్తోంది. యూ జర్ నేమ్‌లో 3 నుంచి 35 క్యారక్టర్లను అనుమతిస్తారు. అందులో సెలబ్రిటీలు, అత్యున్నత స్థాయి వ్యక్తుల పేర్లను






అనుమతించబోరు. యూజర్ నేమ్‌వల్ల ఫోన్ నంబరు కనిపించదని, పెద్ద గ్రూపుల్లో మీరు యాడ్ అయినప్పుడు మీ ప్రైవసీకి రక్షణ లభిస్తుందనేది వాట్సప్ వాదన.

**ఆందోళనలు ఏమిటి?**

ఫోన్ నంబర్‌ను షేర్ చేయకుండా చాట్ చేయడానికి వాట్సప్ తీసుకొచ్చిన యూజర్ నేమ్ సదుపాయంపై సైబర్ నిపుణులు ఆందోళనలు వ్యక్తంచేస్తున్నారు. సుపరిచిత వ్యక్తుల పేర్లతో నకిలీ యూజర్‌నేమ్స్ సృష్టించి, ప్రజలను మోసం చేసేందుకు ఈ ఫీచర్ అవకాశం కల్పిస్తోందని హెచ్చరిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఏదో ఒక యూజర్‌నేమ్‌ను అంచనా వేసి నేరుగా మెసేజ్ చేసే అవకాశం ఉండటంతో స్పామ్ కాల్స్, సందేశాలు పెరిగే అవకాశం ఉందని సైబర్ నిపుణుల వాదన. ఫోన్ నంబర్లు గోప్యంగా ఉంచడం వరకు బాగున్నా.. మోసాలను అరికట్టడానికి తగిన భద్రతా చర్యలు లేకపోతే టెలిగ్రాం తరహా మోసాలకు వాట్సప్ వేదికగా మారుతుందన్న ఆందోళనలూ నెలకొన్నాయి.

# ఆంత్రోపిక్‌కు భారీ ఊరట

### మిథోస్, ప్యాబిల్‌పై ఆంక్షల ఎత్తివేసిన అమెరికా

**వాషింగ్టన్:**ఏఐ రంగంలో సంచలనాలు సృష్టిస్తోన్న అమెరికా కంపెనీ ఆంత్రోపిక్‌కు ఊరట లభించింది. ఆ సంస్థ ఏఐ మోడల్స్ మిథోస్, ప్యాబిల్‌పై ఎగమతి ఆంక్షలను యూఎస్ వాణిజ్య శాఖ ఎత్తివేసింది. మూడు వారాల పాటు వాటిపై సమీక్ష నిర్వహించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ రెండు మోడళ్ల యాక్సెస్‌ను పునరుద్ధరిస్తామని ఆంత్రోపిక్ వెల్లడించింది.ఫ్యాబిల్ 5, మిథోస్ 5 ఏఐ మోడళ్లపై అమెరికా ప్రభుత్వం గతంలో ఆందోళన వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. వాటిని విదేశీ పౌరులకు నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఆంత్రోపిక్‌లో పనిచేసే విదేశీ ఉద్యోగులకు కూడా ఈ మోడళ్ల యాక్సెస్ ఉండకూడదని స్పష్టంచేసింది. దాంతో విదేశీ పౌరులే గాక, యూజర్లందరికీ ఈ సేవలను నిలిపివేస్తున్నట్లు కంపెనీ ప్రకటించిన సంగతి తెలిసిందే.'క్లాడ్ మిథోస్',



'ఫ్యాబిల్ 5' అధునాతన ఏఐ నమూనాలు. సంస్థల సాఫ్ట్‌వేర్‌లో లోపాలను గుర్తించి, సైబర్ భద్రతను మెరుగుపరచడానికి వాటిని రూపొందించారు. అయితే ఫ్యాబిల్-5 మోడల్‌లోని కొన్ని లోపాల కారణంగా..




అధునాతన సాంకేతికత సాయంతో సైబర్ నేరగాళ్లు సులువుగా కంపెనీలపై హ్యాకింగ్‌కు పాల్పడే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఏప్రిల్‌లో పలు అంతర్జాతీయ కంపెనీల్లోని సాఫ్ట్‌వేర్‌ను మిథోస్ స్కాన్ చేసి, తీవ్రమైన భద్రతా లోపాలను వెలుగులోకి తెచ్చింది. ప్రధాన ఆపరేటింగ్ సిస్టమ్స్, వెబ్ బ్రౌజర్లలోనూ ఇవి కనిపించాయి. ప్రపంచవ్యాప్తంగా అది కలకలం సృష్టించింది. దాంతో ఈ రెండు మోడళ్లను అమెరికా బ్యాన్ చేసింది. కానీ ఇప్పుడు సమీక్ష అనంతరం ఆ ఆంక్షలు తొలగించింది.

## చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు అవే

**దిల్లీ:** పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ)తో పాటు వివిధ చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను ప్రభుత్వం వరుసగా తొమ్మిదో త్రైమాసికంలోనూ మార్పు చేయ లేదు. 2026 జులై 1 నుంచి ప్రారంభమయ్యే త్రైమా సికంలో పాత రేట్లనే కొనసాగించింది. సెప్టెంబరు 30 వరకు ఇవి అమల్లో ఉంటాయి. ఆర్థిక శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం, సుకన్య సమృద్ధి పథకంపై 8.2 శాతం వడ్డీ రేటు ఉంది. మూడేళ్ల టర్మ్ డిపాజిట్‌పై 7.1 శాతం, పీపీఎఫ్‌పై 7.1 శాతం, పోస్టాఫీసు పొదుపు డిపాజిట్లపై 4 శాతం, కిసాన్ వికాస పత్రపై 7.5 శాతం, ఎన్ఎస్‌సీపై 7.7 శాతం, నెలవారీ ఆదాయ పథకంపై 7.4 శాతం వడ్డీ రేట్లు ఉన్నాయి.







### తక్కువ బ్యాగేజీతో ప్రయాణించేవారి కోసం

# ఇండిగో లైట్

దిల్లీ: ఇండిగో పేరిట విమానాలను నడిపే ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ సరికొత్త ప్లాన్‌తో ముందుకొచ్చింది. తక్కువ లగేజీతో (కేవలం క్యాబిన్ బ్యాగ్ మాత్రమే) ప్రయాణించేవారికి తక్కువ ఛార్జీతో విమానంలో ప్రయాణించేలా 'ఇండిగో లైట్' పేరుతో ప్రత్యేక ఛార్జీల విధానాన్ని తీసుకొచ్చింది. దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులకు ఈ విధానం వర్తిస్తుంది. డైరెక్ట్ ఫ్లైట్లలో మాత్రమే అనుమతిస్తారు. ఇందులో సాధారణ ఎకానమీ టికెట్లతో పోలిస్తే టికెట్ ధరలు తక్కువగా ఉంటాయి.ఇండిగో లైట్ కింద కేవలం 7 కేజీల వరకు క్యాబిన్ బ్యాగ్‌ను మాత్రమే అనుమతిస్తారు. అదనపు రుసుము లేకుండా ఆటోమెటిక్ సీటును కేటాయిస్తారు. తక్కువ లగేజీతో ప్రయాణించేవారు వారు పొందుతున్న సేవలకు మాత్రమే చెల్లించేలా ఈ టికెట్ విధానాన్ని డిజైన్ చేసినట్లు ఇండిగో ఓ ప్రకటనలో తెలిపింది. విమాన ప్రయాణాన్ని మరింత ఎక్కువ మందికి, తక్కువ ధరలో అందుబాటులో ఉంచడమే తమ లక్ష్యమని ఇండిగో చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ అలోక్ సింగ్ తెలిపారు. ఇండిగో యాప్, వెబ్‌సైట్‌లో బుకింగ్‌పై మాత్రమే వర్తిస్తుంది. ఎయిరిండియా గ్రూపునకు చెందిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సైతం 'ఎయిరిండియా లైట్' పేరిట క్యాబిన్ బ్యాగేజీ ఓన్లీ ఫేర్ విధానాన్ని అనుసరిస్తోంది. ఇండిగో రోజూ 2100 విమాన సర్వీసులను నడుపుతోంది.

## టాటా సియారాలో విద్యుత్ వర్షన్

### పరిచయ ధర రూ.18.79- 24.79 లక్షలు

**దిల్లీ:** టాటా మోటార్స్ తన ఎస్‌యూవీ సియారా మోడల్‌లో ఎలక్ట్రిక్ వర్షన్‌ను విడుదల చేసింది. దీని పరిచయ ధరల శ్రేణి రూ.18.79- 24.79 లక్షలు. సియారా ఎలక్ట్రిక్ వర్షన్‌కు బుకింగ్‌లు మంగళవారమే ప్రారంభమయ్యాయని, జులై 15 నుంచి డెలివరీలు ప్రారంభించనున్నట్లు కంపెనీ తెలిపింది. భారత్‌లో విద్యుత్ వాహనాలకు ఆదరణ వేగంగా పెరగడంలో పశ్చిమాసియా



ఉద్రిక్తతలు కీలక పాత్ర పోషించాయని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్ లిమిటెడ్ (టీఎంపీవీఎల్) ఎండీ, సీఈఓ శైలేష్ చంద్ర తెలిపారు. విద్యుత్ వాహనాల కొనుగోళ్ల కోసం వినియోగదార్లలో ఆసక్తి పెరిగేలా ఈ పరిణామం మార్చిందని ఆయన అభిప్రాయపడ్డారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల సమయంలో ఇంధన ధరలు పెరగడం, సరఫరాపరమైన అవరోధాలతో ఇంధన కొరత ఏర్పడొచ్చన్న భయాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్యాసింజర్ వాహన విభాగంలో ఈవీల వాటా 7-8 శాతంగా ఉంటుందని, 2027-28 ఆర్థిక సంవత్సరంలో ఇది 10 శాతాన్ని అధిగమిస్తుందని శైలేష్ చంద్ర అంచనా వేశారు.

## కోటక్ బ్యాంక్ చేతికి డాయిష్ రిటెయిల్, ప్రైవేటు బ్యాంకింగ్ వ్యాపారాలు

**ముంబయి:** జర్మనీకి చెందిన డాయిష్ బ్యాంక్‌కు మన దేశంలో ఉన్న రిటెయిల్, ప్రైవేటు బ్యాంకింగ్, వెల్త్ మేనేజ్‌మెంట్ వ్యాపారాలను కొనుగోలు చేయడానికి ఒక కచ్చితమైన ఒప్పందంపై సంతకం చేసినట్లు ప్రైవేటు రంగ కోటక్ మహీంద్రా బ్యాంక్ వెల్లడించింది. ఎంత మొత్తానికి ఈ వ్యాపారాలను కొనుగోలు చేస్తున్నదీ వెల్లడించలేదు. ఈ ఒప్పందంతో సంపన్న, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వ్యాపారానికి మరింత మద్దతునివ్వాలని ఆశిస్తున్నట్లు తెలిపింది. కొనుగోలు చేయబోయే వ్యాపారాల్లో సుమారు రూ.29,000 కోట్ల రుణాలు, రూ.16,000 కోట్ల డిపాజిట్లు, రూ.10,500 కోట్ల నిర్వహణలో ఉన్న ఆస్తులు (ఏయూఎం) ఉన్నాయి. భారతదేశంలో తమ రిటెయిల్ వ్యాపారం నుంచి పాక్షికంగా వైదొలగిన అనేక ఇతర అంతర్జాతీయ బ్యాంక్‌ల సరసన డాయిష్ బ్యాంక్ కూడా చేరింది. ఈ మూడు వ్యాపార విభాగాల పరిధిలో బ్యాంకుకు 1,000 మంది ఉద్యోగులు ఉన్నారు. సుమారు 1.5 లక్షల మంది ఖాతాదార్లకు సేవలు అందిస్తున్నారు. ఒప్పంద లావాదేవీ పూర్తయిన తర్వాత ఈ ఉద్యోగులు కోటక్ మహీంద్రా బ్యాంక్‌లో చేరతారని తెలుస్తోంది. వచ్చే ఏడాది సెప్టెంబరు నాటికి ఈ ఒప్పందం ముగింపు దశకు చేరుకుంటుందని అంచనా. కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), ఇతర నియంత్రణ ఆమోదాలకు లోబడి ఒప్పందం పూర్తవుతుందని తెలుస్తోంది.

# మీ వైఫల్యాలపై చర్చకు సిద్ధం

అని సీ ఎం విసిరిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. తేదీ, సమయం ఫిక్స్ చేయాల న్నారు. "తెలంగాణను కోటి ఎకరాల మాగా ణిగా కేసీఆర్ తీర్చిదిద్దారు. 2014-15లో రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి 26లక్షల హెకార్లు మాత్రమే. కేసీఆర్ అధికారం నుంచి దిగే పోయే నాటికి ఆ సంఖ్య 59 లక్షల హెక్టార్లకు చేరింది. కాళేశ్వరం ప్రాజెక్టును చూసి ప్రపం చమంతా ఆశ్చర్యపోయింది. బీఆర్ఎస్ అధికా రంలో ఉన్న పదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా ముందుకెళ్లి అద్భుతాలు చేశాం. హైదరాబాద్‌ను చూసి న్యూయార్క్‌లా ఉందని రజనీకాంత్ అన్నారు. ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన మేఘాలయ సీఎం కాన్రాడ్ సంగ్మా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను చూసి ఫోన్ చేసి అభినందించారు. ఫాక్స్‌కాన్ ఛైర్మన్ కూడా గతంలో హైదరాబాద్‌పై ప్రశంసలు కురిపించారు.

**కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారు**

సీఎం రేవంత్ పదేపదే రాష్ట్రాన్ని అవమానిస్తున్నారు. మమ్మల్ని దూషించండి, కేసులు పెట్టుకోండి.. కానీ తెలంగాణను దూషించవద్దు, ప్రజల మనోస్థైర్యాన్ని దెబ్బతీయవద్దు. ఇంతటి భావదారిద్ర్యం ఉన్న సీఎంను ఎప్పుడూ చూడలేదు. తెలంగాణ గొప్పతనం, ఎదుగుదల రేవంత్‌కు జీర్ణం కాకపోవచ్చు. పరిపాలన చేతగాక గత ప్రభుత్వంపై ఇంకా ఎన్ని రోజులు ఏడుపులు? సీఎం, డిప్యూటీ సీఎంకు అబద్ధాలు చెప్పడంలో కూడా పొంతన లేదు. కాగ్ లెక్కలు నమ్మాలా? కాకి లెక్కలు నమ్మాలా? సీఎం, కుటుంబ సభ్యుల దోపిడీతో రాష్ట్రం ఆస్తులు కోల్పోతోంది. దండుపాళ్యం ముఠాలా కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారు. రాహుల్ బంధు, పొంగులేటి బంధు, సోదరుల బంధు బంద్ చేయాలి. అబద్ధాలు ఆడటం రేవంత్‌కు జన్మహక్కు. ఈసారి ఆయనకు ప్రతిపక్ష పాత్ర కూడా మిగలదు.

వైఫల్యాలు ఎండగట్టకపోతే రాజకీయాల నుంచి తప్పుకొంటా

అద్భుతమైన ప్రగతిభవన్ ఉంటే దాన్ని వదిలేసి రూ.200 కోట్లతో మరో క్యాంపు కార్యాలయం నిర్మించారు. కాంపౌండ్ వాల్ నిర్మాణానికే రూ.19 కోట్లు ఖర్చు చేశారు. కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం. తేదీ, సమయం ఫిక్స్ చేయాలి. అసెంబ్లీనా?ప్రెస్‌క్లబ్‌లోనా?జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లోనా? ఎక్కడైనా నేను రెడీ. కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ ప్రకటించిన వరంగల్ చౌరస్తానా? 2లక్షల ఉద్యోగాలు అని రాహుల్‌గాంధీ డైలాగులు కొట్టిన అశోక్‌నగర్ చౌరస్తానా? మీరొస్తారో, రాహుల్‌గాంధీ వస్తారో రండి. మీ తప్పులను గణాంకాలతో సహా బయటపెడతాం. పాలనా వైఫల్యాలను ఎండగట్టకపోతే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొంటా" అని రేవంత్‌కు కేటీఆర్ సవాల్ విసిరారు.

## మహారాష్ట్రలో బాబ్లీ గేట్లు ఎత్తివేత

నుంచి ఇంత తక్కువ మొత్తంలో వరద రావడం ఇదే తొలిసారి అని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఎత్తిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లు అక్టోబర్ 28వ తారీఖు వరకు తెరిచి ఉంటాయి. అంతర్ రాష్ట్ర జలవివాదాలు నేపథ్యంలో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఏటా వర్షాకాలంలో, ఎండాకాలంలో బాబ్లి గేట్లను ఎత్తి దిగువకు వరద వదిలిపెడుతున్నారు.

## నాలుగు భారత సంస్థలపై ఆంక్షలు తొలగించిన అమెరికా



**న్యూఢిల్లీ:**భారత్‌కు చెందిన నాలుగు సంస్థలపై అమెరికా తాజాగా ఆంక్షలు తొలగించింది రష్యా సంస్థలతో కలిసి పనిచేస్తు న్నాయన్న కారణంతో ఆర్ఆర్‌జీ ఇంజినీరింగ్ టెక్నాలజీస్, లోకేష్ మెషిన్స్ లిమిటెడ్, గెలాక్సీ బేరింగ్స్, శౌర్య ఏరోనాటిక్స్ కంపెనీలను గతంలో నిషేధిత సంస్థల జాబితాలో చేర్చింది. వీటిల్లో ఆర్ఆర్‌జీ ఇంజినీరింగ్, లోకేష్ మెషిన్స్ సంస్థలు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయి. తాజాగా వీటిపై సమీక్ష జరిపిన అగ్రరాజ్యం.. ఈ నాలుగు సంస్థలపై ఆంక్షలను ఎత్తివేసింది.రోలర్ బేరింగ్‌లు, అసెంబుల్ పరికరాలను రష్యన్ సంస్థలకు ఎగుమతి చేసిందనే ఆరోపణలతో గెలాక్సీ బేరింగ్స్ లిమిటెడ్‌పై 2024 అక్టోబరులో అమెరికా ఆంక్షలు విధించింది. రాడార్ పరికరాలు, రేడియో నావిగేషనల్ ఎయిడెడ్ పరికరాలు, రేడియో రిమోట్ కంట్రోల్ ఉపకరణాలను రష్యాకు పంపిందన్న కారణంతో శౌర్య ఏరోనాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై చర్యలు తీసుకుంది. నిర్బంధం విధించిన జాబితాలో ఉన్న రష్యా కంపెనీ ఆర్టెక్స్ లిమిటెడ్‌కు 100కు పైగా మైక్రోఎలక్ట్రానిక్స్ సరుకులను సరఫరా చేసినందుకుగానూ ఆర్ఆర్‌జీ ఇంజినీరింగ్ టెక్నాలజీస్‌పై ఆంక్షలు తీసుకొచ్చింది. రష్యన్ తయారీ కంపెనీలకు డజన్ల కొద్దీ మెషిన్ టూల్స్ రవాణా చేసినందుకు లోకేష్ మెషీన్స్ సంస్థను నిషేధిత సంస్థల జాబితాలో చేర్చింది.

# బాధితులకు అండగా నిలవాలి



- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- కేసులు సత్వరంగా పరిష్కరించాలి
- భద్రతతో పాటు మానసిక స్థైర్యం కల్పించాలి

**కరీంనగర్ బ్యూరో, జూలై 1 (జనం సాక్షి):** మహిళలు, చిన్నారులపై హింస, వేధింపులకు గురైన బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు అన్ని శాఖల అధికారు లు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. బాధితులకు భద్రత కల్పించడంతో పాటు మానసిక స్థైర్యం అందించడం అధికారుల ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కొత్తపల్లిలోని భరోసా సెంటర్‌లో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అధ్యక్షతన బుధవారం రాత్రి నిర్వహించిన సమన్వయ సమావేశానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో మహిళలు, చిన్నారుల రక్షణ, పునరావాసం, న్యాయ సహాయం, వైద్య సేవలు వంటి అంశాలపై విస్తృత చర్చ జరిగింది. బాధితులకు ఉచిత కౌన్సెలింగ్, వైద్య పరీక్షలు, చికిత్స, ఉచిత న్యాయ సహాయం త్వరగా అందించాలని కలెక్టర్ సూచించారు. కేసుల దర్యాప్తు, పునరావాస చర్యల్లో ఎలాంటి జాప్యం లేదా నిర్లక్ష్యం ఉండకూడదని ఆదేశించారు.

పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, భరోసా సెంటర్ బాధిత మహిళలు, చిన్నారులకు ఒకే వేదికపై పోలీసు, వైద్య, న్యాయ, కౌన్సెలింగ్, పునరావాస సేవలు అందించే సమగ్ర వ్యవస్థ అని తెలిపారు. బాధితులు భయాందోళనలకు గురికాకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని, ప్రతి కేసును మానవీయ కోణంలో పరిశీలించి త్వరిత న్యాయం అందిస్తామని హామీ ఇచ్చారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో పోక్సో కేసుల దర్యాప్తు, షీ టీమ్స్ పనితీరు, సఖి సెంటర్ నిర్వహణ, ఆపరేషన్ ముస్కాన్, బాలల రక్షణ, బాధితుల పునరావాసం వంటి అంశాలపై విస్తృత చర్చ జరిగింది. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ హరిప్రసాద్, డిసిపి వెంకటరమణ, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, జిల్లా న్యాయ సేవ సంస్థ ప్రతినిధులు, పోలీసు అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సోయాచంక్స్ ఫ్యాక్టరీపై టాస్క్‌ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

### 755 కిలోల సోయా చంక్స్, 1600 కిలోల రఫ్ బ్రాన్ సీజ్

**రామడుగు (జనంసాక్షి):** రామడుగు మండలం దేశరాజుపల్లి గ్రామంలో ఉన్న మెగా ఇండస్ట్రీస్ తయారీ ఫ్యాక్టరీపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా మానవ వినియోగానికి ఉద్దేశించిన సోయాచంక్స్ (మిల్‌మేకర్) తయారీలో జంతువుల దాణాగా ఉపయోగించే రఫ్ బ్రాన్ కలుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఫ్యాక్టరీలో ఉన్న 755 కిలోల సోయా చంక్స్ తో పాటు తయారీలో వినియోగిస్తున్న 1600 కిలోల రఫ్ బ్రాన్‌ను సీజ్ చేశారు. అనంతరం సీజ్ చేసిన ఉత్పత్తుల నుంచి నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ప్రయోగశాలకు (ల్యాబ్‌కు) పంపించారు. ల్యాబ్ నివేదిక ఆధారంగా సంబంధిత చట్టాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి హానికరమైన ఆహార పదార్థాల తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో టాస్కోఫోర్స్ ఆర్ఎస్సై శ్రీకాంత్, ఫుడ్ సేఫ్టీ అధికారులు అంకిత్ రెడ్డి, రోహిత్ రెడ్డి, కానిస్టేబుల్ సాయి, శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గంజాయి అక్రమ రవాణా - ముగ్గురు నిందితుల అరెస్ట్

**శంకర్ పల్లి, జూలై 01(జనం సాక్షి) :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్, శంకర్‌పల్లి డివిజన్ పరిధిలోని మొకిల పోలీస్ స్టేషన్ పోలీసులు మరోసారి గంజాయి అక్రమ రవాణాను అడ్డుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మొకిల పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తుండగా మియా ఖాన్ గడ్డ వద్ద నిషేధిత బాధక ద్రవ్యం గంజాయి అక్రమంగా విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను తనిఖీలు నిర్వహిస్తుండగా, మోకిలా పోలీసులు వారిని పట్టుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద సుమారు 136 గ్రాముల గంజాయి లభ్యమైంది. పట్టుబడిన నిందితుల వివరాలు ఇలాఉన్నాయి. రవీంద్ర జెన్ ఒడిస్సా, నీరజ్ రే బీహార్, దారో గారే బీహార్ విచారణలో నిందితులు బిహార్, ఒడిస్సా రాష్ట్రాలకు చెందినవారని, అక్కడి నుంచి గంజాయిని తీసుకువచ్చి హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో విక్రయించే ఉద్దేశంతో చర్యకు పాల్పడినట్లు తెలిపారు. పోలీసులు వెంటనే స్పందించి వారిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. నిందితులపై ఎన్డీపీఎస్ యాక్టివ్ ప్రకారం1985 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మొకిల పోలీసులు తెలిపారు.

# 60 మిలియన్ టన్నుల లక్ష్యం దిశగా.. ఎన్ఎండిసి

- మొదటి త్రైమాసికంలో రికార్డు ఉత్పత్తి, విక్రయాలు
- జూన్‌లోనే చరిత్ర సృష్టి.. 5.15 మిలియన్ టన్నుల ఉత్పత్తి
- 26 శాతం వృద్ధితో 15.10 మిలియన్ టన్నుల ఉత్పత్తి
- 100 మిలియన్ టన్నుల దీర్ఘకాలిక విజన్‌కు బలమైన పునాది





**హైదరాబాద్, జూలై 1 (జనంసాక్షి):** భారత ప్రభుత్వ రంగ సంస్థ, దేశంలోనే అతిపెద్ద ఇనుప ఖనిజ ఉత్పాదకుడైన ఎన్ఎండిసి (చీవీణజ) 2026-27 ఆర్థిక సంవత్సరాన్ని రికార్డు స్థాయి ఫలితాలతో ఘనంగా ప్రారంభించింది. మొదటి త్రైమాసికంలోనే సంస్థ చరిత్రలో అత్యధిక ఉత్పత్తి, విక్రయాలను నమోదు చేసి కొత్త రికార్డు సృష్టించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఎన్ఎండిసి 15.10 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజాన్ని ఉత్పత్తి చేసి గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 26 శాతం వృద్ధిని సాధించింది. విక్రయాలు 11.75 మిలియన్ టన్నులకు చేరుకుని 2 శాతం వృద్ధిని నమోదు చేశాయి. జూన్ నెలలో మాత్రం 5.15 మిలియన్ టన్నుల ఉత్పత్తి, 3.98 మిలియన్ టన్నుల విక్రయాలతో వరుసగా 44 శాతం, 11 శాతం వృద్ధిని సాధించి సంస్థ చరిత్రలోనే అత్యుత్తమ జూన్ ప్రదర్శనను చూపించింది. ఛత్తీస్‌గఢ్, కర్ణాటకలోని మైనింగ్ కాంప్లెక్స్‌లలో సాధించిన కార్యాచరణ నైపుణ్యం, దేశీయంగా ఇనుప ఖనిజానికి ఉన్న స్థిరమైన డిమాండ్ ఈ రికార్డు ఫలితాలకు ప్రధాన కారణాలని సంస్థ వర్గాలు తెలిపాయి. సీఎండీ అమితాబ్ ముఖర్జీ మాట్లాడుతూ, దేశంలో మౌలిక సదుపాయాలు, ఉత్పాదక రంగాల్లో జరుగుతున్న పెట్టుబడులు ఇనుప ఖనిజ డిమాండ్‌ను పెంచుతున్నాయని, ఈ అవసరాలను బాధ్యతాయుతంగా తీర్చడానికి ఎన్ఎండిసి సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ ఫలితాలు ఉద్యోగుల నిబద్ధతకు నిదర్శనమని, మైనింగ్ సామర్థ్యాలు, లాజిస్టిక్స్‌ను ఆధునీకరిస్తూ ప్రపంచ స్థాయి మైనింగ్ పవర్‌హౌస్‌గా ఎదగాలనే లక్ష్యం దిశగా స్థిరంగా అడుగులు వేస్తున్నామని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 60 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించుకున్న ఎన్ఎండిసి, దీర్ఘకాలికంగా 100 మిలియన్ టన్నుల సామర్థ్య విజన్‌ను సాధించే దిశగా వేగంగా ముందుకు సాగుతోంది. మొదటి త్రైమాసిక రికార్డు ఫలితాలు ఈ లక్ష్యాల సాధనకు బలమైన పునాది వేశాయి.



## సర్ నమోదు తప్పనిసరి

### ఆదిభట్ల మాజీ మున్సిపల్ చైర్మన్ కొత్త ఆర్థిక ప్రవీణ్ గౌడ్

**ఇబ్రహీంపట్నం, జులై 1(జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్ జిహెచ్ఎంసి డివిజన్ 54లో సర్ ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తూ విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తున్న ఆదిభట్ల మాజీ మున్సిపల్ చైర్మన్ కొత్త ఆర్థిక ప్రవీణ్ గౌడ్, బిఎల్ఓల బృందం, సర్ దేశ వ్యాప్తంగా ఒక పార్టీకి సంబంధించినది కాదని, ప్రతి పౌరుడు నమోదు చేసుకోవాలని, ఒక ఓటు ఉండాలని, ఉద్దేశంతో ఈ కార్యక్రమం తీసుకోవడం ప్రభుత్వం హర్షణీయమని, అధికారులు కూడా సర్ ఓటర్ నమోదు కార్యక్రమంలో జాగ్రత్త వహించాలని, స్థానికంగా ఉండే ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉందని, అధికారులు తగిన సూచనలు చేయాలని ప్రవీణ్ గౌడ్ అన్నారు,

## ఇళ్ల స్థలాల బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది

- పొజిషన్ ఇచ్చేంతవరకు గ్రామస్థులకు అండగా ఉంటాం
- బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి
- కొనసాగుతున్న హిమాయత్ నగర్ గ్రామస్థుల ఆందోళన



**మొయినాబాద్, జూలై 1 (జనం సాక్షి):** గత వారం రోజుల నుంచి ఇళ్ల స్థలాల పొజిషన్ కోసం పోరాడుతున్న హిమాయత్ నగర్ గ్రామస్థులకు న్యాయం జరిగేంత వరకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. గత వారం రోజుల నుంచి మండల పరిధిలోని హిమాయత్ నగర్ సర్వేనెంబర్ 151 లో రిలే నిరాహార దీక్ష చేస్తున్న హిమాయత్ నగర్ గ్రామస్థులకు బుధవారం బీఆర్ఎస్ పార్టీ సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 60 సంవత్సరాలు అవుతుందని.. పేదలకు 60 గజాల ఇళ్లు ఇవ్వడానికి మాత్రం ప్రభుత్వాలు ముందుకు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ పేదల పక్షాన పోరాటం చేస్తుందని.. హిమాయత్ నగర్ గ్రామస్థులకు న్యాయం జరిగేంతవరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇదే స్ఫూర్తితో గ్రామస్థులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సంపాదించుకోవాలని ప్రజా ప్రతినిధులుగా మేము అండగా ఉంటామని భరోసాని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ కర్రోళ్ల శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి, కోట్ల నరోత్తం రెడ్డి, కొత్త నరసింహారెడ్డి, కొత్త మాణిక్ రెడ్డి, ముదిగొండ శ్రీహరి యాదవ్, ముదిగొండ రవి యాదవ్, రవుఫ్, మండల పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు సురేందర్ గౌడ్, యువజన సంఘం నాయకుడు జల్లెల మల్లేష్ యాదవ్ కొత్తపల్లి తిరుపతిరెడ్డి సుధాకర్ యాదవ్, పరమేష్, మోత్కుపల్లి సునీల్, కోమటి సాయిరాం గుప్తా, హిమాయత్ నగర్ గ్రామానికి చెందిన ఆయా యువజన సంఘాల అధ్యక్షులు కుమ్మరి విఠల్, కట్టమీది శ్రీను, కరీం, గోపాల్ నాయక్, హిమాయత్ నగర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎస్‌బీఐ 71వ బ్యాంక్ దినోత్సవం వేడుక



- హైదరాబాద్‌లో భారీ సామాజిక విరాళాలు
- మూడు యుటిలిటీ వాహనాలు సంక్షేమ సంస్థలకు
- వైద్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లను సత్కరించిన బ్యాంకు
- విశ్వాసం, సమ్మిళితత్వంతో దేశ నిర్మాణం

**హైదరాబాద్, జూలై 1 (జనం సాక్షి):** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తన 71వ బ్యాంక్ దినోత్సవాన్ని హైదరాబాద్ సర్కిల్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకుంది. ఈ సందర్భంగా విశ్వాసం, ఆర్థిక సమ్మిళితం, దేశ నిర్మాణంలో తన ఏడు దశాబ్దాల వారసత్వాన్ని పునరుద్ఘాటించింది.

హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ నీలేష్ ద్వివేది నేతృత్వంలోని సర్కిల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, గౌరవనీయ అతిథులు, సిబ్బంది పాల్గొన్న ఉదయపు కార్యక్రమంలో సంస్థ ఘన చరిత్రను గౌరవించారు. డీజీఎం సీడీఓ సురజిత్ త్రిపాఠి ప్రముఖులకు పర్యావరణ అనుకూల మొక్కల బొకేలు అందించారు. అనంతరం అందరూ కలిసి 71వ బ్యాంక్ దినోత్సవ ప్రతిజ్ఞను పఠించారు.

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద సమాజ సేవకు అనుగుణంగా ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ మూడు యుటిలిటీ వాహనాలను విరాళంగా అందించింది. సాధన ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్పెషల్ చిల్డ్రన్ (సికింద్రాబాద్)కు ప్రత్యేక మినీవ్యాన్, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌కు 52 సీట్ల బస్సును అందజేశారు. నాయకత్వ బృందం జెండా ఊపి వాహనాలను ప్రారంభించింది. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా 11 మంది బ్యాంక్ మెడికల్ అధికారులు, నిపుణులను సత్కరించింది. చార్టర్డ్ అకౌంటెంట్స్ దినోత్సవం సందర్భంగా ప్రముఖ ఆడిటర్లు సి.ఎస్.ఆర్. మూర్తి, డి. విజయ్ కుమార్‌లను చీఫ్ జనరల్ మేనేజర్ నీలేష్ ద్వివేది సన్మానించారు. 71వ బ్యాంక్ దినోత్సవ వేడుకలు డీజీఎం ఉ సీడీఓ సురజిత్ త్రిపాఠి అందించిన అధికారిక వందన సమర్పణతో ముగిశాయి.

# ఫీజులు ఇస్తారా.. గద్దె దిగుతారా.. ?

## ప్రభుత్వానికి బీసీ జేఏసీ హెచ్చరిక

- ఫీజు బకాయిలు తక్షణం విడుదల చేయాలి
- నేటి కాలేజీల బంద్‌కు అఖిలపక్ష విద్యార్థి సంఘాల మద్దతు
- బడుగు విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నారని ఆరోపణ
- ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలి



**ముషీరాబాద్, జూలై 1 (జనం సాక్షి):** ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ఫీజు బకాయిలు తక్షణం చెల్లించాలని, పాత పద్ధతిలోనే రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 2న తలపెట్టిన కాలేజీల బంద్‌కు అఖిలపక్ష విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించాయి.

బుధవారం బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, బడుగు విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. "ఫీజులు ఇస్తారా.. గద్దె దిగుతారా.. ఇక మీ ఇష్టం" అంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని చూసి తెలంగాణ ప్రభుత్వం సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు.

అఖిలపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలులో జాప్యం వల్ల వేలాది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం తక్షణం బకాయిలు విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయకపోతే ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికి అంతిమ గడియ అని హెచ్చరించారు.

ప్రైవేట్ డిగ్రీ కాలేజీ అసోసియేషన్ ప్రతినిధి సూర్యనారాయణ రెడ్డి, ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ అసోసియేషన్ ప్రతినిధులు కూడా కాలేజీల బంద్‌కు మద్దతు ప్రకటించారు. ఈ సమావేశంలో బీసీ జేఏసీ కో-చైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు డా. నాగేశ్వరరావు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జావిద్, బీజేవైఎం, బీఆర్ఎస్వీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బోనాల మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి

- అమ్మవారి ఆలయాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం
- జూలై 5 లోగా దరఖాస్తు చేసుకోవాలి : కేపీ వివేకానంద్
- పత్రాలతో కమిటీలు ఎమ్మెల్యే కార్యాలయానికి రావాలి

**నిజాంపేట్, జూలై 1 (జనం సాక్షి):** తెలంగాణలో అత్యంత భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించే బోనాల మహోత్సవాలను ఘనంగా జరుపుకునేందుకు అర్హత కలిగిన అమ్మవారి ఆలయాలకు ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సహాయం అందిస్తోందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ తెలిపారు. నియోజకవర్గ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వం అందించే నిధులను పొందేందుకు అర్హత కలిగిన అమ్మవారి ఆలయ కమిటీలు జూలై 5వ తేదీలోగా చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో అవసరమైన పత్రాలతో దరఖాస్తు సమర్పించాలని కోరారు. దరఖాస్తుతో పాటు కమిటీ లెటర్‌హెడ్‌పై వినతిపత్రం, ఆలయ కమిటీ బ్యాంకు ఖాతా వివరాలు (పాస్‌బుక్/బ్యాంకు అకౌంట్ ప్రతి), కమిటీ సభ్యుల ఆధార్ కార్డు ప్రతులు, ఆలయానికి సంబంధించిన మూడు వేర్వేరు ఫోటోలు తప్పనిసరిగా జతపరచాలని సూచించారు. ప్రతి పత్రంపై కమిటీ అధికారిక ముద్రతో పాటు కమిటీ ప్రతినిధుల సంతకాలు ఉండాలని స్పష్టం చేశారు. అర్హత కలిగిన అన్ని అమ్మవారి ఆలయ కమిటీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని పొంది, బోనాల మహోత్సవాలను మరింత భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా, వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పిలుపునిచ్చారు.

## బీటీ రోడ్ల పనులకు లెవెల్స్ పరిశీలన చేసిన కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్‌నగర్, జూలై 1 (జనం సాక్షి):** ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ కాలనీ, ఉషోదయ కాలనీ ప్రధాన రహదారిలో త్వరలో చేపట్టనున్న బీటీ రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించి మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి బుధవారం సంబంధిత అధికారులతో కలిసి రోడ్డు లెవెల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఆదిభట్లలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం

- దట్టమైన పొగ, మంటలు ఎగసిపడుతున్నాయి
- రంగంలోకి అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు
- ప్రమాద కారణాలు, నష్టాలు ఇంకా తెలియాల్సి ఉంది

**ఇబ్రహీంపట్నం, జూలై 1 (జనం సాక్షి):** రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల-నాదర్‌గుల్ మధ్యలోని బహుళజాతి కంపెనీ టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ప్రస్తుతం మంటలు భీకరంగా ఎగసిపడుతున్నాయి. దట్టమైన పొగ కమ్ముకుంటోంది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు, ఆస్తి నష్టం, ప్రాణ నష్టం వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కంపెనీ పరిసర ప్రాంతాల్లో భయాందోళన నెలకొంది. స్థానికులు భయపడి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

# కామారెడ్డిని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ధ్యేయం

- విద్య, క్రీడలు, వైద్యం, సాగునీరు, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి
- బాయ్స్ హైస్కూల్ అభివృద్ధికి రూ.5 కోట్లు
- అంతర్జాతీయ స్థాయికి ఇందిరా గాంధీ స్టేడియం
- పరిశ్రమలు, యువత ఉపాధి, రైతు సంక్షేమం



**కామారెడ్డి, జూలై 1 (జనం సాక్షి):** కామారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ తెలిపారు. విద్య, క్రీడలు, వైద్యం, సాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. కామారెడ్డి పట్టణంలోని నియోజకవర్గ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కామారెడ్డిని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని చెప్పారు. తాను చదివిన కామారెడ్డి బాయ్స్ హైస్కూల్ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామని, ఏసీ తరగతి గదులు, డిజిటల్ క్లాస్‌రూమ్స్, ఆధునిక సైన్స్ ల్యాబ్స్, కంప్యూటర్ ల్యాబ్స్, స్మార్ట్ లైబ్రరీ, క్రీడా మైదానాలు, తాగునీటి సౌకర్యాలతో రాష్ట్రంలోనే రోల్ మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. అవసరమైతే సీఎంఆర్ నిధులతో పాటు తన సొంత నిధులు కూడా వినియోగించి త్వరగా పూర్తి చేస్తామన్నారు.

కామారెడ్డి ఇందిరా గాంధీ స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతామని, ఎంఎస్ఎన్ ఫార్మా సంస్థ సీఎస్ఆర్ నిధులతో రూ.78 లక్షలతో జర్మన్ టెక్నాలజీ డేలైట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన 9 కోట్లతో 8 లేన్ అథ్లెటిక్స్ ట్రాక్, టెన్నిస్ కోర్టులు, వాలీబాల్ కోర్టు, యోగా భవన్, జిమ్, స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. దోమకొండ మండల కేంద్రంలో రూ.10 కోట్లతో ఫైర్ స్టేషన్, 50 పడకల ఆసుపత్రి, ఎమ్ఆర్ఓ కార్యాలయాల నిర్మాణానికి అనుమతులు లభించాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. పట్టణంలో ఆధునిక రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యాలు, పార్కులు, సీసీ రోడ్లు, భూగర్భ మురుగు కాలువలు వంటి పనులు వేగంగా చేపడుతున్నామన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారులు, సాగునీరు, విద్యుత్, పాఠశాలలు, అంగన్‌వాడీలు, మహిళా సంఘాల అభివృద్ధి, పరిశ్రమల స్థాపన, యువతకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, రైతులకు మార్కెటింగ్, గోదాములు, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కామారెడ్డి రైతులకు సాగునీరు అందించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. కామారెడ్డి అభివృద్ధే తన ధ్యేయమని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పారదర్శకంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామని మహమ్మద్ అలీ షబ్బీర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమా శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు ఐరేని సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్కాన్ ఆపరేషన్ సక్సెస్

### ఐదేళ్ల క్రితం తప్పిపోయిన మహిళ బాలుని రక్షించిన పోలీసులు

- పోలీస్ సిబ్బందిని అభినందించిన ఎస్పీ స్నేహమేహ్రా
- చిన్నారులను మహిళలను రక్షించడం కోసమే ముస్కాన్



**వికారాబాద్ జిల్లా బ్యూరో జులై 1 (జనం సాక్షి):** ఐదేళ్ల క్రితం తప్పిపోయిన మహిళ, బాలుడిని వికారాబాద్ పోలీసులు సురక్షితంగా రక్షించారు. అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అభినందించారు. బాలల సంరక్షణ, హక్కుల రక్షణే ధ్యేయంగా జులై 1 నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా "ఆపరేషన్ ముస్కాన్-XII" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, తెలిపారు. ఈ ఆపరేషన్ ప్రారంభం రోజే వికారాబాద్ పోలీసులు పట్టుదలతో శ్రమించి, సరిహద్దులు దాటి మరీ ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఒక క్లిష్టమైన 'మహిళ. బాలుడి మిస్సింగ్' కేసును ఛేదించి ముస్కాన్ కార్యక్రమానికి అత్యుత్తమ ఆరంభాన్ని ఇచ్చారు. గత 2020 సంవత్సరంలో నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ, చిన్నారి బాలుడు అదృశ్యమయ్యారు. ఎలాంటి ఆనవాళ్లు లభించకపోవడంతో ఇది లాంగ్ పెండింగ్ కేసుగా మిగిలిపోయింది. ఇటీవల ఎస్పీ ఆదేశాలతో నవాబ్‌పేట్ పోలీసులు అత్యాధునిక సాంకేతిక ఆధారాలను (కాల్ డేటా, ఆధార్ లింక్‌లు) క్షుణ్ణంగా విశ్లేషించారు. లభించిన ఆధారాలతో వికారాబాద్ డిఎస్పి అంజయ్య పర్యవేక్షణలో మోమిన్‌పేట్ సిఐ, వెంకట్, నవాబ్‌పేట్ ఎస్ఐ గిరి ల యొక్క సూచనల మేరకు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లోని మునగపాక పోలీస్ స్టేషన్ పరిధికి చేరుకుని, సుదీర్ఘ గాలింపు చర్యల అనంతరం ఆ మహిళను, బాలుడిని సురక్షితంగా స్వాధీనం చేసుకున్నారు. టెక్నాలజీని వాడుకుని చాకచక్యంగా ఈ కేసును ఛేదించిన మోమిన్‌పేట్ సిఐ జి. వెంకట్, నవాబ్‌పేట్ ఎస్ఐ గిరి, సిబ్బంది సాయి కుమార్, మహేందర్ గౌడ్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఇట్టి సంధార్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పిల్లల భద్రత విషయంలో వికారాబాద్ పోలీస్ శాఖ ఎప్పుడూ రాజీ ఉండదన్నారు. ఈ రోజు నుండి ప్రారంభమైన ఆపరేషన్ ముస్కాన్-XII' లో భాగంగా తప్పిపోయిన, భిక్షాటన చేస్తున్న బాల కార్మికులుగా మారిన పిల్లలను రక్షించి వారి కుటుంబాలకు అప్పగించడమే మా ప్రాధాన్యత అన్నారు. దీనికోసం సబ్ డివిజన్ల వారీగా పోలీస్ అధికారులు సంబంధిత అధికారులతో కలసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసామని అన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి వికారాబాద్ జిల్లాను బాల కార్మిక రహితజిల్లాగా మార్చాలి అని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పిలుపునిచ్చారు.

# రామగుండంలో ఈఎస్ఐ ఆస్పత్రి ఎప్పుడు?

- 2018లో కేంద్ర అనుమతి.. ఇంకా నిర్మాణం సాగలేదు
- స్థలం ఎంపికలో గత, నేటి ప్రభుత్వాల అలసత్వం
- కార్మికులు, కుటుంబాలు తీవ్ర అసౌకర్యం
- త్వరగా నిర్మాణం చేపట్టాలని స్వచ్ఛంద సంఘాల డిమాండ్




**గోదావరిఖని, జూన్ 30 (జనం సాక్షి):** పెద్దపల్లి జిల్లా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వంద పడకల ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ) ఆస్పత్రి నిర్మాణం ముందుకు సాగకపోవడంపై రామగుండం స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బుధవారం నిరసనకార్యక్రమం నిర్వహించారు.

రామగుండం స్వచ్ఛంద సంఘాల గౌరవ అధ్యక్షులు మద్దెల దినేష్, ఉపాధ్యక్షులు గోలివాడ చంద్రకళ మాట్లాడుతూ, 2018 సెప్టెంబర్‌లోనే కేంద్రం నుంచి అనుమతి వచ్చినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనువైన స్థలం చూపించలేదని, 2022లో సమాధుల పక్కన చెత్త డంపింగ్ యార్డ్‌ను సూచించగా రోడ్డు కనెక్టివిటీ లేకపోవడంతో ఈఎస్ఐ అధికారులు తిరస్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు. 2023లో కొత్త నిబంధనల ప్రకారం స్థలం ఎంపిక చేసినా, 2025 జనవరి 8న రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినా పెద్దపల్లి జిల్లా యంత్రాంగం ఇప్పటికీ నిర్మాణ పనులు ముందుకు తీసుకెళ్లడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగుండం ఈఎస్ఐ బ్రాంచి పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల్, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలకు చెందిన 60,000 మందికి పైగా కార్మికులు (ఎన్‌టీపీసీ, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, సిమెంట్ ఫ్యాక్టరీలు, బీడీ, వీవింగ్ మిల్లు కార్మికులు) ఈ ఆస్పత్రి నిర్మాణం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం రామగుండం, ఎన్‌టీపీసీ, బసంత్‌నగర్‌లో మాత్రమే డిస్పెన్సరీలు పని చేస్తున్నాయని, తీవ్ర అనారోగ్యం వచ్చినప్పుడు వరంగల్, నాచారం, సనత్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం 100 కోట్ల రూపాయలు కేటాయించినా జిల్లా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.

రామగుండంలో త్వరితగతిన ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలని, లేని పక్షంలో రాజకీయాలకు అతీతంగా పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘం నేతలు ఏం. గౌస్, వై. లెనిన్, స్వచ్ఛంద సంఘాల సభ్యులు కంకటి రవి, బిళ్ల శ్రీదేవి, సరిత లక్ష్మి, కొండూ రమాదేవి, కె. సుశీల, ఇమ్మడి శారద, మేకల శోభా, మండల శ్రీనివాస్, నజీర్, వికాస్ పాల్గొన్నారు.

# సింగరేణి భవిష్యత్తుకు కీలక ప్రాజెక్టులు కేటాయించాలి

- సింగరేణికి తాడిచెర్ల, మణుగూరు ప్రాజెక్టులు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఏబికేఎమ్మెస్-బీఎంఎస్ వినతి
- సానుకూల స్పందన, త్వరలో చర్యలు
- కార్మికుల ఉపాధి, సంస్థ అభివృద్ధికి భరోసా



గోదావరిఖని, జూన్ 30 (జనం సాక్షి): సింగరేణి సంస్థ భవిష్యత్తు మరియు వేలాది మంది కార్మికుల ఉపాధి భద్రతను దృష్టిలో ఉంచుకుని తాడిచెర్ల బొగ్గు బ్లాక్-2, మణుగూరు పీకే ఓసీ-2 డీప్ సైడ్ ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టులను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు కేటాయించాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం (ఏబికేఎమ్మెస్-బీఎంఎస్) కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని కోరింది. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి సంఘం ప్రతినిధులు సమగ్ర వినతిపత్రం సమర్పించారు. సంఘం అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వద్దేపల్లి కుమారస్వామి, కార్యదర్శి పి. మాధవ నాయక్ మాట్లాడుతూ, సింగరేణి గనుల్లో బొగ్గు నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో కొన్ని గనులు మూతపడే పరిస్థితి ఏర్పడవచ్చని, దీని ప్రభావం కార్మికుల ఉపాధిపై పడుతుందని వివరించారు. తాడిచెర్ల బ్లాక్-2లో 277 మిలియన్ టన్నులు, మణుగూరు పీకే ఓసీ-2 డీప్ సైడ్ ఎక్స్‌టెన్షన్‌లో 215 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని తెలిపారు. సింగరేణికి ఉన్న అపార అనుభవం, ఆధునిక సాంకేతికత మరియు మౌలిక సదుపాయాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టులు సింగరేణికి కేటాయించడం సంస్థ అభివృద్ధికి పాటు దేశ ఇంధన భద్రతకు ఉపయోగపడుతుందని వివరించారు.

ఇల్లందు ఏరియాలో పూసపల్లి ఓసీ ప్రాజెక్టును తక్షణం ప్రారంభించడం, 12వ వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేయడం, తెలంగాణ ప్రభుత్వ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కోల నుంచి రావాల్సిన సుమారు రూ. 56,000 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయడం వంటి ముఖ్యమైన అంశాలపై కూడా సంఘం వినతి చేసింది. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి వినతిపై సానుకూలంగా స్పందించి, తాడిచెర్ల మరియు మణుగూరు ప్రాజెక్టులను సింగరేణికి కేటాయించే అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని, బకాయిలు, వేతన కమిటీ అంశాలపై కూడా సమీక్షించి పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రి హామీలతో సింగరేణి కార్మికుల్లో కొత్త ఆశలు చిగురించాయి. ఈ ప్రాజెక్టులు సింగరేణికి కేటాయిస్తే సంస్థ భవిష్యత్తు బలపడడంతో పాటు వేలాది కార్మికుల ఉపాధికి భరోసా లభిస్తుందని సంఘం నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏబికేఎమ్మెస్ జాతీయ నాయకులు మండా రమాకాంత్, పులి రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వై. సారంగపాణి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ జీవి కృష్ణారెడ్డి, సెంట్రల్ ట్రెజరర్ సాయివేణి సతీష్, సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకుల హరీన్ పటేల్, ఆర్జీ-1 వైస్ ప్రెసిడెంట్ కర్రవుల మహేష్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల దాడిలో 18 మేకలు మృతి

- వీధి కుక్కల నియంత్రణతో పాటు బాధిత రైతుకు న్యాయం చేస్తాం
- మున్సిపల్ చైర్మన్ సమత వెంకట్‌రెడ్డి

**చేవెళ్ల, జూలై 01 (జనంసాక్షి) :** వీధి కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని, బాధిత రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్తాం అని మున్సిపల్ చైర్మన్ సమత వెంకట్ రెడ్డి తెలిపారు. చేవెళ్ల గ్రామానికి చెందిన రైతు కిష్టయ్య మేకల మందపై మంగళవారం అర్ధరాత్రి వీధి కుక్కలు దాడి చేసి 18 మేకలను పొట్టనపెట్టుకున్నాయి. మిగిలిన సుమారు 200 గొర్రెలు భయంతో రైతు ఇంటి వద్దకు చేరుకుని ప్రమాదం నుంచి తప్పించుకున్నాయి. సమాచారం అందుకున్న చైర్మన్ సమత వెంకట్ రెడ్డి, 14వ వార్డు కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్‌తో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధిత రైతును పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వీధి కుక్కల సమస్యపై అధికారులతో సమీక్షించి నివారణ చర్యలు చేపట్టడంతో పాటు బాధిత రైతుకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఘటనతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు.

# ఇంటర్ విద్యార్థిని బలి తీసుకున్న బస్సు

**చేవెళ్ల, జూలై 01 (జనంసాక్షి):** బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లేందుకు గురుకుల కళాశాల బస్సు కోసం ఎదురుచూస్తున్న ఇంటర్ విద్యార్థి ఆర్టీసీ బస్సు ఢీకొని మృతిచెందిన విషాద ఘటన చేవెళ్ల పట్టణంలోని షాబాద్ చౌరస్తా సమీపంలో చోటుచేసుకుంది. క్షణాల్లో జరిగిన ఈ ప్రమాదం కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కందవాడ గ్రామానికి చెందిన శేరి కృష్ణారెడ్డి, సరిత దంపతుల చిన్న కుమారుడు సాత్విక్ రెడ్డి (18) మొయినాబాద్‌లోని స్వామి నారాయణ గురుకుల పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రతిరోజూ చేవెళ్ల వరకు కుటుంబ సభ్యులు షాబాద్ చౌరస్తా దింపి వెళ్లేవారు. అక్కడి నుంచి పాఠశాల బస్సులో వెళ్లేవాడు. బుధవారం ఉదయం సోదరుడు బైక్‌పై దింపి వెళ్లిన అనంతరం రోడ్డుకు దూరంగా నిలబడి గురుకుల కళాశాల బస్సు కోసం వేచి ఉన్నాడు. ఇదే సమయంలో తాండూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (టిఎస్09జెడ్8119) షాబాద్ వైపు నుంచి వస్తున్న కారును తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి విద్యార్థిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సాత్విక్‌ను బస్సు డ్రైవర్ వెంటనే ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఘనంగా డాక్టర్స్ డే ఉత్సవాలు

- వైద్యులు అభివృద్ధి కి చేయుతనిస్తారు - వైద్యుని పాత్ర వెలకట్టలేనిది
- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి.నరేందర్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, జులై 1 (జనంసాక్షి) :** ప్రతి ఒక్కరికి సంతోషకరమైన జీవితాన్ని గడపాలని ఉంటుందని, ఏర్పరచుకున్నటువంటి లక్ష్యాలను ఎటువంటి ఇబ్బంది లేకుండా సాధించాలనే కోరిక ఉంటుందని ఈ కోరికలను ఎటువంటి ఆటంకం లేకుండా డాక్టర్లు నెరవేరుస్తారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, వివిన్నార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ- టెక్నో పాఠశాలలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి బి.సి.రాయ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వారు చేసిన సేవలను స్మరించుకున్నారు. వారి జయంత్సోవం ఒక గొప్ప పండుగ అని దేశవ్యాప్తంగా చాలా ఘనంగా నిర్వహిస్తారని వారు చెప్పారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం వారి స్మారకార్థమై అనేక కార్యక్రమాలను నిర్వహిస్తారని ఈ సంవత్సరం కూడా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని వారు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమాజాభివృద్ధిలో వైద్యుల పాత్ర చాలా కీలకమైనదని, వెలకట్టలేనిదని వారు తెలుపుతూ, వైద్యుల వలన సమాజంలో అభివృద్ధి చోటు చేసుకుంటుందని ప్రధానంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడానికి వారు చేసేటువంటి కృషి అద్భుతమైన ఫలితాలు ఇవ్వడమే కాకుండా ఇతరులకు ఆదర్శంగా ఉంటుందని వారు తెలిపారు. నేడు ప్రతి ఒక్కరి కోరిక ఆనందంగా ఉండడానికి డాక్టర్ని సంప్రదిస్తారని, డాక్టర్లు చెప్పినటువంటి విషయాలను తప్పకుండా పాటిస్తారని చెప్పారు. అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు వివిధ మెడికల్ కళాశాలల్లో దిగ్విజయంగా మెడిసిన్ పూర్తి చేసుకున్న సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను నమోదు చేయాలని ఆకాంక్షించారు. డాక్టర్స్, చార్టెడ్ అకౌంటెంట్ల విశిష్టతను తెలియజేయడానికి పలు నాటికలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ వైద్య వర్గాలకు అండగా ఉంటుంది

- కరీంనగర్ డిసిసి మెడికల్, హెల్త్ వింగ్ డాక్టర్ సెల్ చైర్మన్ డాక్టర్.ఆర్. వెంకటేశ్వర్లు



**కరీంనగర్ బ్యూరో, జూలై 1 (జనంసాక్షి) :**

జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ మెడికల్ & హెల్త్ వింగ్ డాక్టర్ సెల్ చైర్మన్ డాక్టర్. ఆర్. వెంకటేశ్వర్లు వైద్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆర్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... వైద్య వృత్తి ద్వారా సమాజానికి డాక్టర్లు చేస్తున్న నిస్వార్థ సేవకు వందనం తెలియజేస్తూ... ఆరోగ్య తెలంగాణకు వైద్యులే వెన్నెముక అని పీహెచ్సి నుండి కార్పొరేట్ హాస్పిటల్ వరకు వారి అంకిత భావం వల్లే మన రాష్ట్రం బలంగా ఉందిని తెలిపారు. కరీంనగర్ ప్రాంతంలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, ఆసుపత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి మెడికల్ & హెల్త్ వింగ్, కరీంనగర్ చాప్టర్ సిద్ధంగా ఉందని, మౌలిక సదుపాయాలు, రక్షణ, సర్వీస్ కండిషన్లకు సంబంధించిన అంశాల పై వైద్య వర్గాలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా డిసిసి డాక్టర్ సెల్ పనిచేస్తుందని వెల్లడించారు. నేడు డాక్టర్స్ డే సందర్భంగా అటు వైద్యరంగంలో సుదీర్ఘ అనుభవంతో పాటు రాజకీయ రంగంలో రాణిస్తున్న మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డాక్టర్ సెల్ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వర్లు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ... వైద్య వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం సిద్ధంగా ఉందని, జిల్లాలో డిసిసి డాక్టర్ సెల్ ప్రతి విషయంలో వైద్యులకు అండగా నిలుస్తుందని, ముఖ్యంగా, రోగుల ఆరోగ్య సమస్యల పై సహాయం చేయడానికి, మార్గనిర్దేశం చేయడానికి, వారికి సకాలంలో, అందుబాటు ధరలో వైద్యం అందేలా చూడటానికి మా డాక్టర్ సెల్ కృషి చేస్తుందని అన్నారు. ఆరోగ్య తెలంగాణ ను కాంగ్రెస్ పార్టీ నమ్ముతుందని, కరీంనగర్ జిల్లాలో ప్రజారోగ్యాన్ని బలోపేతం చేయడానికి డాక్టర్ సెల్ క్షేత్రస్థాయిలో పని చేస్తుందని ఆయన తెలిపారు. తమ గొప్ప సేవను కొనసాగించాలని వైద్యులందరికీ డిసిసి డాక్టర్ సెల్ ద్వారా విజ్ఞప్తి చేస్తూ, వైద్య వృత్తి గౌరవాన్ని కాపాడటంలో పార్టీ నుండి పూర్తి మద్దతు ఉంటుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు.

# ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సుల తాత్కాలిక నిలిపివేత

## బ్యాటరీ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

- ప్రయాణికుల భద్రత కోసం 104 బస్సుల సర్వీసులు సస్పెండ్
- జేబీఎం సాంకేతిక బృందం విచారణ
- క్లియరెన్స్ వచ్చిన తర్వాతే తిరిగి సర్వీసు

**కరీంనగర్ టౌన్, జూలై 1 (జనం సాక్షి):** జేబీఎం ఎలక్ట్రిక్ బస్సుల్లో వరుసగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో కరీంనగర్-2 డిపోలోని మొత్తం 104 ఎలక్ట్రిక్ బస్సుల సర్వీసులను ఆర్టీసీ అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. బుధవారం వేకువజామున కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న ఎలక్ట్రిక్ బస్సులో బ్యాటరీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్పటికి బస్సులో ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది వెంటనే మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఇటీవల ఎల్ఎండీ సమీపంలో ఒక ఎలక్ట్రిక్ బస్సు పూర్తిగా దగ్ధమైన ఘటన తర్వాత మరోసారి డిపోలోనే అగ్ని ప్రమాదం జరగడం తీవ్ర ఆందోళన కలిగించింది. వరుస ప్రమాదాలతో ఎలక్ట్రిక్ బస్సుల భద్రతపై ప్రయాణికుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. చాలా మంది ఈవీ బస్సుల్లో ప్రయాణించడానికి వెనుకంజ వేస్తున్నారు. కరీంనగర్-2 డిపో మేనేజర్ మాట్లాడుతూ, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా హైదరాబాద్ మార్గంలో అదనపు సూపర్ లగ్జరీ బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. ఇతర డిపోల నుంచి బస్సులను రప్పించి, సుదూర ప్రాంతాల బస్సులను తాత్కాలికంగా హైదరాబాద్ సర్వీసులకు మళ్లించారు. జేబీఎం సంస్థ ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ మరియు సాంకేతిక బాధ్యతలు చేపట్టిందని అధికారులు తెలిపారు. తాజా ఘటనపై జేబీఎం ప్రత్యేక సాంకేతిక బృందం విచారణ చేపట్టనుంది. బ్యాటరీ వ్యవస్థ, వైరింగ్, భద్రతా ప్రమాణాలపై సమగ్ర తనిఖీలు పూర్తి చేసి సాంకేతిక క్లియరెన్స్ లభించిన తర్వాతే ఎలక్ట్రిక్ బస్సులను తిరిగి రోడ్డుపైకి తీసుకురానున్నట్లు అధికారులు ప్రకటించారు.



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేసుకోవాలి

## ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూలై 01 (జనం సాక్షి);** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 33 వార్డులో నాగుల లక్ష్మీ, నాగుల మనోహర్ లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటుండగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో ఇండ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించి, హౌసింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపికైన లబ్ధిదారులు ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఇండ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. కూలీలను, ఇంటి నిర్మాణానికి కావలసిన మెటీరియల్ ను అందుబాటులో పెట్టుకొని పనుల్లో వేగం పెంచాలని తెలిపారు. హౌసింగ్ అధికారులు ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, డీఈ సాజిద్, తహసీల్దార్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా పాల్గొన్నారు.

# ఇందిరమ్మ చీరలు, కుట్టుమిషన్లు పంపిణీ

- మహిళల ఆర్థిక స్వావలంబనకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి
- రెండో విడత చీరలు మైనార్టీలకు ఉచిత కుట్టుమిషన్లు
- మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు నిరంతర కృషి



**బోధన్, జూలై 1 (జనం సాక్షి):** బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా కాంగ్రెస్ ప్రభుత్వం రెండో విడత ఇందిరమ్మ చీరలు మరియు మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మైనార్టీలకు ఉచిత కుట్టుమిషన్లను బుధవారం శుభోదయం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసి వారి సంక్షేమం మరియు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనను ప్రోత్సహించడంలో భాగంగా డ్వాక్రా సంఘాలకు కోట్లాది రూపాయల రుణాలు అందించడంతో పాటు బస్సులు కూడా అందించడం జరిగిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మ, పట్టణ పార్టీ అధ్యక్షులు అంకు దాము, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హొందాన్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, టిపిసిసి డెలిగేట్ గంగా శంకర్, మండల పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్ రావు, సాలూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మందర్న రవి, కౌన్సిలర్లు, బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, మెప్మా టిఎంసి శ్రీనివాస్ మరియు మహిళలు పాల్గొన్నారు.

# హైకోర్టు స్టే ఉన్నా ఆగని జెసిబిలు

- మేడిపల్లిలో ఫార్మాసిటీ భూముల వద్ద తీవ్ర ఉద్రిక్తత
- రెవెన్యూ, పోలీస్, టీ జిఐఐసీ అధికారులను అడ్డుకున్న రైతులు
- చేతికొచ్చిన జొన్న, పత్తి పంటలు ధ్వంసం చేశారంటూ కన్నీరు

**యాచారం, జులై 1(జనం సాక్షి) :** మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో ఫార్మాసిటీ భూసేకరణ వ్యవహారం బుధవారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. తాము ఫార్మాసిటీకి భూములు ఇచ్చేది లేదని మొత్తుకుంటున్నా, కోర్టు స్టే ఆర్డర్ అమలులో ఉన్నప్పటికీ అధికారులు జెసిబిలతో వచ్చి పంటలను ధ్వంసం చేయడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు తమ భూముల్లో సాగు చేసుకున్న జొన్న, పత్తి పంటలను ధ్వంసం చేసేందుకు రెవెన్యూ, పోలీస్, టీజీఐఐసీ అధికారులు భారీ బందోబస్తుతో తరలివచ్చారు. దీనిని గమనించిన బాధితులు అధికారులను అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య పెద్ద ఎత్తున తోపులాట జరిగింది. లక్షలాది రూపాయలు అప్పులు తెచ్చి కష్టపడి వేసిన పంటలను కళ్లముందే జెసిబిలతో తొలగిస్తుంటే రైతులు అధికారులపై తిరగబడ్డారు. కోర్టు స్టే ఉన్నా తమ భూములను ఎలా చదును చేస్తారని నిలదీశారు. ఈ క్రమంలో "ఏదైనా ఉంటే కోర్టులోనే చూసుకోండి" అంటూ పోలీసులు తమపై దుర్భాషలాడారని, దౌర్జన్యంగా పంటలను నాశనం చేశారని రైతులు కన్నీరుమున్నీరయ్యారు.

# మేడిగడ్డ నీటిని తరలించకపోవడం దుర్మార్గం

## కేసులకు భయపడేది లేదు: హరీశ్‌రావు, గంగుల కమలాకర్



**కరీంనగర్ టౌన్, జూలై 01, (జనంసాక్షి) :**

బీఆర్ఎస్ కరీంనగర్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. జిల్లా కేంద్రంలోని కొండా సత్యలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశానికి మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలకు భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ప్రసంగంలో హరీశ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కరీంనగర్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు రెండుసార్లు ఎంపీ పదవికి రాజీనామా చేసి తిరిగి గెలిచిన గడ్డ కరీంనగర్ అని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. మేడిగడ్డ నుంచి నీటిని తరలించే అవకాశం ఉన్నప్పటికీ రాజకీయ కారణాలతో ప్రభుత్వం ఆ పని చేయడం లేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ దూరదృష్టితో నిర్మించారని, ఇప్పుడు ఆ నీటి అవసరం ఎంత ముఖ్యమో రైతులు అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు మేలు చేయకుండా కేసీఆర్‌ను విమర్శించడం సరికాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. గంగుల కమలాకర్ మాట్లాడుతూ తనను నాలుగుసార్లు గెలిపించిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధి నిలిచిపోయిందని ఆరోపించారు. తన క్యాంపు కార్యాలయంపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోలేదని, అయితే ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేసిన తమపై క్రిమినల్ కేసులు నమోదు చేశారని విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా తాము భయపడబోమని, కార్యకర్తలు కూడా ధైర్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అక్రమంగా నమోదు చేసిన కేసులను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై హరీశ్‌రావు కీలక సూచనలు చేశారు. ప్రతి 20 ఏళ్లకు ఒకసారి జరిగే ఈ ప్రక్రియలో బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండి ఓట్లు తొలగింపులకు అవకాశం లేకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. పశ్చిమ బెంగాల్ ఉదాహరణను ప్రస్తావిస్తూ ఓటు హక్కు పరిరక్షణలో నిర్లక్ష్యం చేయొద్దని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, మాజీ టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, ఎర్రోళ్ల శ్రీనివాస్, తుల ఉమ, పార్టీ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు, పొన్నం అనిల్ కుమార్ గౌడ్, సర్దార్ రవీందర్ సింగ్, చల్ల హరిశంకర్‌తో పాటు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధు లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వీబీజీ రాంజీ చట్టాన్ని రద్దు చేయాలి

- జాతీయ ఉపాధి హామీ చట్టాన్నే కొనసాగించాలి: సీఐటీయూ, రైతు-వ్యవసాయ కార్మిక సంఘాలు




**కరీంనగర్ టౌన్, జూలై 1, (జనం సాక్షి) :**

కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి అమలు చేయనున్నట్లు ప్రకటించిన వీబీజీ రాంజీ చట్టాన్ని వెంటనే రద్దు చేసి, ప్రస్తుతం అమల్లో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్నే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పునూటి శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి సంపత్ మాట్లాడుతూ, వామపక్షాల పోరాట ఫలితంగా అమలులోకి వచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చిందని విమర్శించారు. కొత్త చట్టంలో 125 రోజుల పని కల్పిస్తామని ప్రచారం చేస్తున్నప్పటికీ, కేంద్రం తన నిధుల బాధ్యతను తగ్గించుకుంటోందని తెలిపారు. గతంలో 90 శాతం నిధులు కేంద్రం భరించగా, ఇప్పుడు కేవలం 60 శాతం మాత్రమే ఇవ్వాలని, మిగిలిన 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని నిబంధన పెట్టడం వల్ల ఉపాధి హామీ అమలు దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

వ్యవసాయ పనుల సీజన్‌లో 60 రోజుల పాటు పనులు నిలిపివేయడం, కనీస వేతనాలపై స్పష్టత లేకపోవడం, ఉదయం-సాయంత్రం పని ప్రదేశంలో ఫోటోలు అప్‌లోడ్ చేసినప్పుడే వేతనాలు చెల్లించే నిబంధనలు కార్మికులకు ఇబ్బందులు కలిగిస్తాయని పేర్కొన్నారు. అలాగే గ్రామపంచాయతీలకు పనుల ఎంపిక హక్కు లేకుండా కేంద్ర ప్రభుత్వమే పనులను నిర్ణయించడం వికేంద్రీకరణ స్ఫూర్తికి విరుద్ధమన్నారు.

కొత్త చట్టం అమలైతే ఫీల్డ్ అసిస్టెంట్ల ఉద్యోగాలు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడంలో విఫలమైందని నాయకులు విమర్శించారు. వీబీజీ రాంజీ చట్టాన్ని పూర్తిగా రద్దు చేసే వరకు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా కోశాధికారి జి. రాజేశం, సహాయ కార్యదర్శి పున్నం రవి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి మాతంగి శంకర్, నాయకులు గౌరీమియా, రజిత, వీరమ్మ, జ్యోతి, పుల్లెల మల్లయ్య, బుర్ర రత్నాకర్, మల్లేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాడులో టీవీకే ప్రభుత్వ కూల్చివేతకు కుట్ర

## ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



చెన్నై, జూలై1 (జనంసాక్షి) : తమిళనాడులో అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. 15 మంది టీవీకే ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి, ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్ని స్తున్నారన్న ఆరోపణలతో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. టీవీకే ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలో మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ పాత్రపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తమిళనాడు ఇంటెలిజెన్స్ అధికారులు ఈ కుట్రపై దర్యాప్తు చేపట్టారు. టీవీకే పార్టీ ఎమ్మెల్యే ఎన్ ఇళయరాజా కొద్దిరోజుల క్రితం చెన్నై పోలీసులను ఆశ్రయించారు. చెన్నైకి చెందిన ఐపీడీఎస్ కన్సల్టెన్సీ ఫామ్ ఉద్యోగిపై ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులో.. 'తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టమని ఐపీడీఎస్ కన్సల్టెన్సీ ఫామ్‌కు చెందిన వ్యక్తి నాతో చెప్పాడు. అలా చేస్తే 35 కోట్ల రూపాయలు ఇస్తానన్నాడు. ఈ ఆఫర్ గురించి ఎవరితోనూ మాట్లాడవద్దని చెప్పాడు' అని పేర్కొన్నాడు. ఎమ్మెల్యే ఫిర్యాదుతో పోలీసులు ఐపీడీఎస్ కన్సల్టెన్సీ ఫామ్ ఉద్యోగిని అరెస్ట్ చేశారు. అతడు మాజీ మంత్రి సెంథిల్ బాలాజీకి అత్యంత సన్నిహితుడని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే మాజీ మంత్రి పాత్రపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక, ఈ వ్యవహారంపై తమిళనాడు మంత్రి సీటీ నిర్మల్ కుమార్ స్పందించారు. సెంథిల్ బాలాజీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. నిర్మల్ కుమార్ మాట్లాడుతూ.. 'సెంథిల్ బాలాజీతో సన్నిహిత సంబంధాలు ఉన్న వ్యక్తులు ఈ వ్యవహారంలో నేరుగా పాలుపంచుకున్నారు. వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. కుట్రలో భాగం అయిన ప్రతి ఒక్కరినీ అరెస్ట్ చేయాలి. ఇలాంటి దుర్మార్గపు చర్యలకు ముగింపు పలకాలి' అని అన్నారు.

# టూవీలర్‌ను ఢీకొన్న కాలేజీ బస్సు

- మహిళ అక్కడికక్కడే మృతి

హైదరాబాద్, జూలై 1 (జనంసాక్షి) : హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి జాతీయ రహదారిపై బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనంపై వెళుతున్న మహిళను ఓ కాలేజీ బస్సు ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపగా, జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్‌కు కారణమైంది. ఈ ఘటనపై సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి హైవేపై వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని కాలేజీ బస్సు ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతతో మహిళ బస్సు కింద పడిపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ప్రమాద సమయంలో రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. మృతురాలి వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి రాకపోకలను క్రమబద్ధీకరించే ప్రయత్నాలు చేశారు. కొంతసేపు ఆ మార్గంలో తీవ్ర ట్రాఫిక్ జామ్ నెలకొనడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలను కూడా పరిశీలిస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికానున్నాయి.

# మణికొండలో ఈగిల్ టీమ్ దాడులు




- హ్యాష్ ఆయిల్ విక్రయిస్తున్న వ్యక్తి పట్టివేత

హైదరాబాద్, జూలై 1 (జనంసాక్షి) : హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిధిలోని మణికొండలో 'ఈగల్ టీమ్' బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఈ తనిఖీల్లో భాగంగా ఓ ప్రైవేట్ హోటల్‌లో బస చేసిన వ్యక్తిని హ్యాష్ ఆయిల్ విక్రయిస్తుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు మణికొండ పరిధిలోని సదరు ప్రైవేట్ హోటల్‌పై ఈగల్ టీమ్ సభ్యులు ఒక్కసారిగా మెరుపు దాడులు చేశారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. నిందితుడి నుంచి 9 గ్రాముల లిక్విడ్ హ్యాష్ ఆయిల్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ నిందితుడితో పాటు సీజ్ చేసిన హ్యాష్ ఆయిల్‌ను స్థానిక నార్సింగి పోలీసులకు అప్పగించారు. పట్టుబడ్డ వ్యక్తి డ్రగ్స్ విక్రేతా? లేక ఏజెంటా? అనే కోణంలో నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హ్యాష్ ఆయిల్ ఎక్కడి నుంచి నగరానికి తీసుకొచ్చారు? దీని వెనుక ఉన్న ప్రధాన సూత్రధారులు ఎవరు ఐటీ కారిడార్‌లోని ఎవరెవరికి దీనిని సరఫరా చేస్తున్నారనే అంశాలపై నిందితుడిని పోలీసులు విచారిస్తున్నారు. నగరంలో డ్రగ్స్ నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు నిఘా మరింత కఠినతరం చేసినట్లు అధికారులు తెలిపారు.

# ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు మరింత ఆలస్యం

- పెద్దగా ప్రభావం ఉండేలా కనిపించని పరిస్థితి
- వరి బదులు ఆరుతడి పంటలపై సిఎం రేవంత్ సూచనలు



హైదరాబాద్, జూలై 1 (జనంసాక్షి) : నీటి లభ్యతపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే పొద్దుతిరుగుడు, పత్తి, మొక్కజొన్న, ఉల్లి వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని ప్రభుత్వం సూచిస్తోంది. తాజాగా సిఎం రేవంత్ రెడ్డి కూడా ఇదే విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవడం లేదని, అందువల్ల రైతులు ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలని కోరారు. వరికి అసవరమైన నీరు లభించనప్పుడు, ఆరుతడి పంటలవైపు మళ్లాలని అన్నారు. దీంతో రైతులు కూడా ఈదిశగా ఆలోచన చేయాల్సి ఉంది. అదేపనిగా వరి పండించడం వల్ల కూడా రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. ఈ అవకాశాన్ని ఆసారగా తీసుకుని మార్పుకోసం ప్రయత్నిస్తే మంచిదే. ఎందుకంటే వర్షాలు పడతాయో లేదో తెలియడం లేదు. ఇప్పటి వరకు కురిసిన వర్షాలతో నారు వేసే పరిస్థితి లేదు. పరిమిత నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించు కోవాలనే ఉద్దేశంతో సిఎం ఈ సూచనలు చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. వర్షాలు ఆలస్యమవడం, సాధారణ స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితులు కొత్తవి కావు. అయితే వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ముందస్తు ప్రణాళిక, శాస్త్రీయ వ్యవసాయం, సమర్థవంతమైన జల నిర్వహణ మరింత కీలకంగా మారాయి. ప్రభుత్వం, వాతావరణ నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘాలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ప్రస్తుత సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి. రైతులకు సమయానుకూల సమాచారం, పంటలపై శాస్త్రీయ మార్గదర్శకాలు, నీటి వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలు రాబోయే రోజుల్లో కీలకపాత్ర పోషించనున్నాయి. ప్రకృతి సవాళ్లను పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించే ముందస్తు చర్యలు మాత్రం మన చేతుల్లోనే ఉన్నాయి. అందుకే ఆందోళన కంటే అప్రమత్తతకు, విమర్శల కంటే కార్యాచరణకు, నిరాశ కంటే ముందుచూపుకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయంగా కనిపిస్తోంది. అయితే రైతుల కోణంలో చూస్తే పరిస్థితి అంత సులభంగా కనిపించడం లేదు. గతంలో కొన్ని ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ అనిశ్చితి, ధరల హెచ్చుతగ్గులు, కనీస మద్దతు ధర అమలులో ఎదురైన సమస్యలు రైతుల్లో సందేహాలను పెంచుతున్నాయి. వరికి ఉన్న మార్కెట్ భరోసా ఇతర పంటలకు లేదనే భావన రైతుల్లో కనిపిస్తోంది. ప్రకృతి ప్రభావంతో పాటు జల నిర్వహణ సామర్థ్యం, నీటి నిల్వల వినియోగం, సాగునీటి ప్రణాళికలు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో చర్చకు వస్తున్నాయి. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని మౌలిక వసతుల సమర్థ వినియోగం, రిజర్వాయర్ల నిర్వహణ, నీటి పంపిణీ వ్యవస్థల మెరుగుదల వంటి అంశాలు కూడా చర్చలో ఉన్నాయి. అయితే ఈ అంశాలపై సాంకేతిక, ఆర్థిక, పరిపాలనా కోణాలను సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితి ఒకవైపు వాతావరణ ప్రభావాన్ని గుర్తు చేస్తే, మరోవైపు నీటి వనరుల దీర్ఘకాలిక నిర్వహణ ఎంత కీలకమో కూడా స్పష్టం చేస్తోంది.

# రైతులను బెదిరించి డబ్బులు వసూలు

- ఫిర్యాదుతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అరెస్ట్



ఆదిలాబాద్, జూలై1 (జనంసాక్షి) : జిల్లాలోని తలమడుగు మండలం కజ్జర్ల గ్రామానికి చెందిన రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కృష్ణ నాయక్ పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తలమడుగు ఎస్‌హెచ్‌ఓ డి. రాధిక తెలిపారు. ఆమె తెలిపినవివరాల ప్రకారం కజ్జర్ల-దేవాపూర్ గ్రామాల మధ్య రహదారి ఇరువైపులా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవెన్యూ ప్లాంటేషన్‌కు రైతులు తమ పొలాల్లోని పంట అవశేషాలను తగులబెట్టిన సమయంలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి కొంత నష్టం వాటిల్లిందని వివరించారు. దీనిని ఆసరాగా చేసుకున్న నిందితుడు కృష్ణ నాయక్, రైతులను బెదిరిస్తూ మొక్కలకు జరిగిన నష్టానికి పరిహారంగా రూ. 1,50,000 ఇవ్వాలని రైతులను డిమాండ్ చేశాడు. డబ్బులు ఇవ్వకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తానని బెదిరించాడని పేర్కొన్నారు. బెదిరింపులకు భయపడి చింతలపెల్లి జైభరత్ రెడ్డి రూ. 25 వేలు, యెల్మ రఘువరన్ రెడ్డి రూ. 10వేలు, తాండ్ర మహేష్ రూ. 7,500, తాండ్ర నర్సింహులు రూ. 7,500 చొప్పున మొత్తం రూ. 50వేలు, నిందితుడికి ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కృష్ణ నాయక్‌ను అరెస్ట్ చేసినట్లు రాధిక తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగి హోదాను దుర్వినియోగం చేసి ప్రజలను బెదిరించి అక్రమంగా డబ్బులు వసూలు చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

# రేవంత్ రెడ్డికి రైతులు బుద్ది చెప్పడం ఖాయం

- బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



నిజామాబాద్, జూలై1 (జనంసాక్షి) : రైతులను అడుగడుగునా ద్రోహం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతులు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లాలోని వేల్పూర్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతు ఆశీర్వాద సభ అంటూ నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిట్టడమే లక్ష్యంగా తన ప్రసంగాన్ని కొనసాగించారని ఆరోపించారు. ప్రజాధనంతో సభలు ఏర్పాటు చేసి ఆశీర్వాద సభను శాపనార్థాల సభగా మార్చారని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను మోసం చేస్తున్నాడని రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. మోసంచేసే పార్టీని ఏ విధంగా రైతులు ఆశీర్వాదిస్తారని పేర్కొన్నారు. 2018 లో కొడంగల్ లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న రేవంత్ రెడ్డి మూడు నెలల్లో ఎంపీ ఎలక్షన్లో నిలబడటం సిగ్గుచేటన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగని విమర్శించారు. కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఇస్తానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు మూడు లక్షల పెళ్లిళ్లు అయ్యాయని గుర్తు చేశారు. లబ్ధిదారులకు వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు.

# ప్రగతి ప్రణాళిక అమలుపై ఆరా

- అధికారులతో సమీక్షించిన సిఎస్ సంజయ్ జాజు



హైదరాబాద్, జూలై 1 (జనంసాక్షి) : రాష్ట్రంలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ బుధవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. వివిధ జిల్లాల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలు తీరును పర్యవేక్షించిన నోడల్ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలో గుర్తించిన సమస్యలు, సవాళ్లను సిఎస్ కు వివరించారు. అలాగే జిల్లాలలో అమలు చేసిన వినూత్న విధానాలతో సానుకూల ఫలితాలు వచ్చాయని, వాటిని ఇతర జిల్లాల్లో కూడా అమలు చేయవచ్చని సూచించారు. జిల్లా కలెక్టర్లతో చర్చించి సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నోడల్ అధికారులను ఆదేశించారు. ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ 99 రోజుల కార్యక్రమంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర వివరాలను అందించారు. కార్యక్రమంలోని వివిధ అంశాల కింద ఇప్పటివరకు సాధించిన పురోగతిని ఆయన వివరించారు. సమీక్షా సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, నోడల్ అధికారులు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బైక్ దొంగల ముఠా అరెస్ట్

- ఇద్దరు పాత నేరస్తుల రిమాండ్

హైదరాబాద్,జూలై1 (జనంసాక్షి) : బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు పాత నేరస్థులను అరెస్ట్ చేసిన పోలీసులు.. రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు సీఐ నాగేశ్వరరావు తెలిపారు. శివరాంపల్లి పిల్లర్ నంబర్ 295 వద్ద రాయల్ ఎన్‌ఫీల్డ్ దొంగతనంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సీసీటీవీ కెమెరాల ఆధారంగా దొంగలను అత్తాపూర్ పోలీసులు గుర్తించారు. అరెస్ట్ అయిన వారిలో మహమ్మద్ షానవాజ్, మహమ్మద్ మొయిజ్ మోహియుద్దీన్ ఉన్నారు. పరారీలో ఉన్న శాస్త్రీపురానికి చెందిన నూర్, ఫర్హాన్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. వీరంతా జల్సాలు, చెడు వ్యసనాల కోసమే బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. స్వాధీనం చేసుకున్న వాటిలో రాయల్ ఎన్‌ఫీల్డ్, సుజుకి బర్గ్‌మన్, యాక్టివా వాహనాలు ఉన్నాయి.

# ప్రైవేటు పాఠశాలల బస్సుల అడ్డగింత



చెన్నారావుపేట, జులై 1 ( జనం సాక్షి): ప్రైవేటు పాఠశాలలు మాకొద్దు... ప్రభుత్వ పాఠశాల ముద్దు... అని అంటున్నారు లింగగిరి గ్రామస్తులు. బుధవారం లింగగిరి గ్రామానికి వచ్చిన ప్రైవేటు పాఠశాలల బస్సులను గ్రామ సర్పంచ్ మెడబోయిన రజిత కుమార్ ఆధ్వర్యంలో వార్డు సభ్యులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కలిసి అడ్డుకున్నారు. గ్రామంలోకి ప్రైవేటు పాఠశాలల బస్సులు రావద్దని బస్సు డ్రైవర్లకు సూచించారు. అలాగే గ్రామం లోని ప్రభుత్వ పాఠశాలలోకి విద్యార్థులను పంపించాలని తల్లిదండ్రు లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పడిదం కట్ట స్వామి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# వీబీ జీ రామ్ జీని రద్దు చేయాలి

- సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాసంఘాల ఆందోళన



ఖమ్మం, జూలై1 (జనంసాక్షి) : పేదలకు ఉపాధిని దూరం చేసే వీబీ జీ రామ్ జీ ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కారేపల్లి తాసీల్దార్ కార్యాలయం, ఎర్రబోడు, మాణిక్యారం, విశ్వనాథపల్లి, గాంధీనగర్, గాదెపాడు, చీమలపాడు గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. అంక్షలు లేకుండా పేదలకు ఉపాధి కల్పించాలని, రైతులకు నష్టదాయకమైన విద్యుత్ సవరణ చట్టం, నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు, సీఐటీయూ మండల కన్వీనర్ కె.నరేంద్ర, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణా ఉపాధి హామీని రద్దు చేసి వీబీ జీ రామ్ జీ పేరుతో పేదలకు ఉపాధి దూరం చేయుటకు పూనుకుందన్నారు. వీబీ జీ రామ్ జీ బిల్లును జులై 1 నుండి అమలు చేయనున్నట్లు ప్రకటించిందని, దీనిలో కేంద్రం 60 శాతం రాష్ట్రం 40 శాతం నిధులు భరాయించాలని పేర్కొనడం ఉపాధి కల్పన నుండి కేంద్రం దూరం జరగటమేనన్నారు. నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్మిక హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే రైతు భరోసా ఎగవేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా రైతు డిస్ట్రిబ్యూషన్ కంపెనీని ఏర్పాటు చేసి ఉచిత కరెంట్ కు మంగళం పాడే పరిస్థితిని తీసుకరానుం దన్నారు. కేంద్ర, రాష్ట్ర పాలకుల తీరుపై పోరా టాలే శరణ్యమన్నారు. పోరాటాలతోనే పాలకు ల దిగివచ్చి పేదలకు అనుకూల నిర్ణ యాలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నేతలు పలువురు పాల్గొన్నారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370